

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



26న ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ
**40వ వార్షికోత్సవం**
ముఖ్యఅతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణ రాక

- వివరాలు 4 లో.

# మున్సిపల్ ఎన్నికల రీ షెడ్యూల్




- నవంబరు 1న పోలింగ్, 3న కౌంటింగ్
- కడప, రాజంపేట, మైదుకూరు, తిరుపతిలో నేటి నుంచి కొన్ని వార్డులకు మళ్లీ నామినేషన్లు
- 25న పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన
- సుప్రీం ఆదేశాలతో రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం



*అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో 100 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఎన్నికలకు నవంబరు 1నపోలింగ్ జరగనుంది. నవంబరు 3న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కడప, రాజంపేట, మైదుకూరు, తిరుపతిలో కొన్ని వార్డులలో ఈ నెల 23, 24 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించ నున్నారు. 25న నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నారు. కడప కార్పొరేషన్‌లో 11 వార్డులకు, తిరుపతి కార్పొరేషన్‌లో 18 వార్డులకు, రాజంపేట మున్సిపాలిటీలో 11వార్డులకు,మైదుకూరు మున్సిపాలిటీలో 32 వార్డులకు నామినేషన్లు స్వీకరించనున్నారు.*

*సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఏడు జిల్లాలోని 19 పురపాలక సంఘాలపై కలెక్టర్ల నుంచి నివేదికలను తెప్పించుకున్నారు. న్యాయనిపుణులతో చర్చించిన అనంతరం నవంబరు 1న ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 28న జరగాల్సిన పోలింగ్ మరో మూడురోజులు వాయిదా పడినట్లయింది.*

---

సీఎం చంద్రబాబు నివాసానికి పవన్‌కళ్యాణ్

## స్థానిక ఎన్నికలపై కీలక చర్చలు



అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి గురువారం డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వెళ్లారు. ఎటువంటి భద్రతా, కాన్వాయ్ లేకుండా వచ్చారు. ఇరువురి మధ్య కీలక చర్చలు జరిగినట్లు సమాచారం.స్థానిక ఎన్నికలు, రెబల్స్ బెడద, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో భేటీ జరిగినట్లు సమాచారం. గత రాత్రి పట్టణ స్థానిక ఎన్నికలపై సుప్రీంకోర్టు తీర్పు, రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయంపై కూటమిపార్టీలు ఉమ్మడి ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల కమిషన్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు.

పెట్టుబడులే కాదు..

## ఉత్పత్తి కూడా ప్రారంభించాలి

- విశాఖలో అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్ సిద్ధం చేయాలి
- సెమీ కండక్టర్ రంగంలో ఎకోసిస్టం ఏర్పాటు కావాలి
- తూర్పు, పశ్చిమ ప్రాంతాల అనుసంధానంపై దృష్టిపెట్టాలి
- 22వ ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 22వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఎస్ఐపీబీ సమావేశానికి వర్చువల్‌గా మంత్రులు లోకేష్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నారాయ ణ, కందుల దుర్గేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. పరిశ్రమలు, ఇంధన శాఖ, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన రంగాల్లో వివిధ పెట్టుబడి ప్రతిపాదనలపై ఎస్ఐపీబీలో అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు. పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలి పారు. గతంలో కుదుర్చుకున్న ఒప్పందాలు పెట్టుబడులుగా మారి ఉత్పత్తి ప్రారంభించే అంశంపై దృష్టి పెట్టాలని దిశా నిర్దేశం చేశారు. మొత్తం 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులకు సంబంధిం చి కార్యాచరణ ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. పెట్టుబడుల సదస్సు నిర్వహించేందుకు వీలుగా విశాఖపట్నంలో ఓ అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటయ్యే లా చూడాలని ఆదేశించారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలు కీలకమని సీఎం మార్గనిర్దేశం చేశారు. లాజిస్టిక్స్ హబ్‌లో భాగంగా పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్ రైల్ కనెక్టివిటీతో పాటు తూర్పు, పశ్చిమ ప్రాంతాల అనుసంధానంపై దృష్టి పెట్టాలని దిశానిర్దేశం చేశా రు. సెమీ కండక్టర్ రంగంలో తయారీ యూనిట్లతో కూడిన ఎకోసిస్టం రాష్ట్రంలో ఏర్పాటు కావాలని సూచించారు.

---



హింస రాజకీయాలే

## గొడ్డలి పార్టీ దినచర్య

- పక్క రాష్ట్రాల నుంచి కిరాయి గూండాలను రప్పించారు
- సుప్రీంకోర్టు ఆదేశాలు వక్రీకరిస్తూ తప్పుడు ప్రచారం
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

7

నామినేషన్లలో వైసీపీ విధ్వంసంపై

## రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

- 7 ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు
- ఆధారాలు అందజేసిన టీడీపీ బృందం
- ఆ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని వినతి



*రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో వైసీపీ నాయకులు సాగించిన అరాచకాలు, విధ్వంసాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠాకు గురువారం టీడీపీ ప్రతినిధి బృందం ఫిర్యాదు చేసింది. తంబళ్లపల్లె, సదుం, చౌడేపల్లి, కనిగిరి, అనంతపురం రూరల్, నెకరికల్లు, దర్శి ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి సృష్టించిన అరాచకాలను ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.*

6

ఆర్గనైజ్డ్ క్రైమ్స్‌తో ఎన్నికలు ఆపడమే

## గొడ్డలి పార్టీ లక్ష్యం

- ఉనికి కోసమే పథకం ప్రకారం హింసాకాండ
- ఆ పార్టీపై ప్రజల తిరుగుబాటును చూసి తట్టుకోలేక కుట్రలకు తెరలేపింది
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే జగన్‌రెడ్డి అండ్ కో అసలు నైజం
- ఫ్యాక్షన్ ముఠాలను రంగంలోకి దించారు
- టీడీపీ నేత ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ ధ్వజం



9

# విధ్వంస రచన.. హింస వచన

- కొనసాగుతున్న గొడ్డలిపార్టీ అరాచక పర్వం
- జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్లలో వీరంగం
- కనిగిరిలో పోలీసులపై దాడికి యత్నం
- తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం, పోతుపేటలో టీడీపీ నాయకులకు గాయాలు
- కృష్ణగిరి మండలంలో కానిస్టేబుల్‌కు గాయాలు
- పల్నాడు జిల్లా నకరికల్లులో టీడీపీ అభ్యర్థుల
- నామినేషన్ పత్రాలను చించివేసిన వైసీపీ శ్రేణులు
- కడప జిల్లా నందలూరులోనూ దౌర్జన్యకాండ



అమరావతి(చైతన్యరథం): స్థానిక ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ రౌడీమూకల అరాచక పర్వం కొనసాగుతోంది. నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసులు, నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన టీడీపీ అభ్యర్థులపై దాడులకు పాల్పడుతూ భయో త్పాతం సృష్టిస్తున్నారు. మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నామినేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన వైసీపీ వర్గీయులు వీరంగం సృష్టించా రు. అప్రమత్తమైన పోలీసులు వారిని చెదరగొట్టారు. మరోవైపు కనిగిరిలోనూ పోలీసులపై దాడికి యత్నించారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వైసీపీ నాయకులు వెళ్లగా అభ్యర్థితో పాటు ఇద్దరు మాత్రమే వెళ్లాలని పోలీసులు సూచించారు. ఈ క్రమంలో వైసీపీ నేతలు రెచ్చిపోయి వారిపై దాడి చేసేందుకు యత్నించారు.

– అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్ద మండెం, పెద్దతిప్పసముద్రం మండలాల్లో ఘర్షణలు చోటు చేసుకు న్నాయి. పెద్దమండెంలో 2 ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. పెద్దతిప్పసముద్రంలో వైసీపీ శ్రేణులు చేసిన దాడిలో టీడీపీ నేతల కు గాయాలయ్యాయి. పోతుపేట టీడీపీ నేతలు నారాయణరెడ్డి, ఆనంద్‌రెడ్డి, బీజేపీ నేత బాషా గాయపడ్డారు. వారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేశారు.

## కర్నూలు జిల్లా కృష్ణగిరిలో రాళ్లు కర్రలతో దాడి

– కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలంలో వైసీపీ శ్రేణులు వీరంగం సృష్టించాయి. నామినేషన్ వేసేందుకు వెళ్లిన టీడీపీ అభ్య ర్థులపై రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో కానిస్టేబుల్ రాఘవేంద్ర ప్రసాద్ తలకు తీవ్రగాయాలయ్యాయి. పలువురు టీడీపీ అభ్యర్థులూ గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు సమీ పంలోని ఆస్పత్రికి తరలించారు.

– పల్నాడు జిల్లా నకరికల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఘర్షణ చోటు చేసుకుంది. టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను వైసీపీ నేతలు చించివేశారు. దీంతో టీడీపీ కార్యకర్తలు వారిపై తిరగబడ్డారు. పోలీసులు కలుగజేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

## టీడీపీ కార్యకర్తల కార్లకు నిప్పు

– కడప జిల్లా రాజంపేట నియోజకవర్గం నందలూరులో నామినేషన్ కేంద్రం దగ్గర ఉద్రిక్తత చోటు చేసుకుంది. టీడీపీ కార్యకర్తలపై వైసీపీ రౌడీ మూకలు దాడి చేశారు. టీడీపీ నేతలకు చెందిన మూడు వాహనాలకు నిప్పుపెట్టారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు వారిని చెదరగొట్టారు. గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. జగన్‌రెడ్డి క్రిమినల్ పాలిటిక్స్‌కు ఇది నిదర్శ నం. పక్క రాష్ట్రాల నుంచి రౌడీమూకలను తెప్పించి స్థానిక ఎన్ని కల్లో అరాచకం సృష్టించి ఏదో జరిగిపోయిందని ఎన్నికలు అడ్డు కునేందుకు కోర్టులకు వెళ్లడం గొడ్డలి పార్టీకి పరిపాటిగా మారింది.







## రెండోరోజున పెద్దఎత్తున నామినేషన్లు

మరోవైపు జెడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలకు ముమ్మరంగా నామినేషన్లు దాఖలవుతున్నాయి. ఏపీ వ్యాప్తంగా రెండోరోజున పెద్దఎత్తున నామినేషన్లను కూటమి, వైసీపీ సహా వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు దాఖలు చేశారు. వివిధ ప్రాంతాల్లో జోరుగా స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. జెడ్పీటీసీ స్థానాలకు కూటమి అభ్యర్థుల కంటే ఎక్కువగా వైసీపీ నేతలు నామినేష న్లు దాఖలు చేస్తున్నారు.

## తొలిరోజు నామినేషన్ల వివరాలు

9829 ఎంపీటీసీ స్థానాలకు తొలిరోజున 5267 నామినేషన్ల ను వివిధ పార్టీల అభ్యర్థులు దాఖలు చేశారు. 659 జెడ్పీటీసీ స్థానాలకు తొలిరోజున 409 నామినేషన్లు దాఖలయ్యాయి. వివిధ ఎంపీటీసీ స్థానాలకు టీడీపీ 2719, జనసేన 294 నామినేషన్లు, బీజేపీ 74, వైసీపీ 1918నామినేషన్లు దాఖలయ్యాయి. వివిధ జెడ్పీటీసీ స్థానాలకు టీడీపీ 128, జనసేన 21, బీజేపీ 24, వైసీపీ 192 నామినేషన్లు దాఖలు చేశారు. రెండో రోజున వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్రులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోంది.

# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

### కర్నూలు ఎన్నికల అబ్జర్వర్ అనిల్‌కుమార్‌రెడ్డి



కర్నూలు(చైతన్యరథం): కర్నూలు కార్పొరేషన్‌కు సంబంధించి స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా సామగ్రి పంపిణీ,స్వీకరణ,బ్యాలెట్ బాక్సుల భద్రత, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.గురువారం ఆయన అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక కమిషనర్ చల్లా ఓబు లేసుతో కలిసి అథెనా పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలాన్ని కేటాయించి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపునకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు, అధికారుల విధుల నిర్వహణకు అనువైన వాతావరణం కల్పించాలని సూచించారు. జెడ్పీలో జరుగుతున్న జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. జెడ్పీ, ఆవరణలోని మండల కార్యాలయంలో జరుగుతున్న ఎంపీ టీసీల నామినేషన్ల ప్రక్రియను తనిఖీచేశారు. జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ జే.రమణమూర్తి, డీసీపీ శభ్నం శాస్త్రి, ఎంఈలు మనోహర్‌రెడ్డి, గిరిరాజు, డీఈలు నరేష్, శ్రీనివాసన్, పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

## ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా




అమరావతి(చైతన్యరథం): శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, నామినేషన్ పత్రాలను చింపేసినా, పోలీసులపై దాడులకు తెగబడినా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, హోదా లతో సంబంధం లేకుండా చట్టాన్ని కఠినంగా అమలు చేస్తామని తేల్చి చెప్పారు. ఈ మేరకు రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో తొలిరోజు చోటుచేసుకున్న ఘటనలపై డీజీపీ కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది. "ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియలో భాగంగా తొలిరోజు మొత్తంగా 13 జిల్లాల్లో 31 ఘటనలు నమోదయ్యాయి. వీటిలో 22 ఘర్షణలు, ప్రజాశాంతికి భంగం కలిగించిన ఘటనలు ఉన్నాయి. వీటిలో 9 చోట్ల నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కొని చింపేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద ప్రత్యర్థులు తెగబడిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థను విస్మయానికి గురి చేసేలా ఉంది. కనీసం 6 చోట్ల రాళ్లు, కర్రలతో దాడులు జరిగాయి. రెండు కార్లు, రెండు మోటార్ సైకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. రెండు నివాస గృహాలపై దాడులు జరగగా, ఒక ఇంటిని ఏకంగా జేసీబీ సాయంతో కూల్చి వేశారు. అభ్యర్థులకు రక్షణగా వెళుతున్న పోలీసు వాహనంపై రాళ్లదాడి చేశారు. ఇప్పటివరకు 16 కేసులు నమోదు చేశాం. మరో 11 ఘటనలపై కేసుల నమోదు ప్రక్రియ జరుగుతోంది. సీసీటీవీ ఫుటేజీలు, వీడియోల ఆధారంగా మరిన్ని ఆరెస్టులు ఉండే అవకాశం ఉంది. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చైతన్యరథం

# ఎన్నికలంటే భయపడుతున్న వైసీపీ..!




- కేసులతో అడ్డుకునే కుట్రలు
- ఐదేళ్ల పాలన తరువాత ఎదురైన ఓటమి... మళ్లీ ఎన్నికలంటే భయపడేలా చేసింది
- ప్రజాక్షేత్రంలోనూ..న్యాయస్థానాల్లోనూ గొడ్డలిపార్టీకి తప్పని భంగపాటు
- స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు వరుస పిటిషన్లు
- పులివెందులలోనూ మారుతున్న పరిస్థితులు.. వైసీపీ ఆధిపత్యానికి సవాల్

కరెంట్ అనాలిసిస్ — తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం

జమ్ము సాయి కల్యాణ్, అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

ప్రజాస్వామ్యంలో ఎన్నికలే అంతిమ తీర్పు. ప్రజల మద్దతు ఉన్న పార్టీ ఎన్నికల బరిలో నిలబడి తన బలాన్ని నిరూపించుకుంటుంది. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన పార్టీ మాత్రం ఎన్నికలను ఎదుర్కోవడానికి వెనుకాడుతుంది. ప్రస్తుతం వైసీపీ వ్యవహార శైలి చూస్తుంటే ఇదే విషయం గుర్తుకొస్తోంది. ఎన్నికలు వస్తే ప్రజల్లోకి వెళ్లి మద్దతు కూడగట్టుకోవడంకంటే కేసులు, వివాదాలు, అడ్డంకులతో ఎన్నికల ప్రక్రియను నిలువరించాలనే ప్రయత్నాలకే గొడ్డలి పార్టీ ప్రాధాన్యం ఇస్తోంది. ప్రజాక్షేత్రంలో ఎదురయ్యే పరాజయాన్ని న్యాయస్థానాల ద్వారా తప్పించుకోవచ్చనే ఆలోచనతోనే వైసీపీ అడుగులువేస్తున్నట్లు కనిపిస్తోంది. 2019 ఎన్నికల సమయంలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ కేసులో వాస్తవాలు న్యాయపరమైన విచారణలో తేలాల్సి ఉన్నప్పటికీ, అప్పటి రాజకీయ పరిణామాలు ఇప్పటికీ చర్చకు వస్తూనే ఉన్నాయి. మరోవైపు, గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా వైసీపీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రత్యర్థులను ఇబ్బందులకు గురిచేసింది. నాడు అధికార బలంతో రాజకీయ ఆధిపత్యాన్ని ప్రదర్శించిన ఆ పార్టీకి 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారు. కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం చేసి, ప్రతిపక్ష హోదా కూడా దక్కని పరిస్థితిని కల్పించారు. అయినా వైసీపీ తన వైఖరిని మార్చుకోకపోవడం రాజకీయంగా ఆ పార్టీ దివాళాకోరుతనాన్ని తెలియజేస్తోంది.

## అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోంది. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మెగా డీఎస్సీ నిర్వహణకు సిద్ధమైనప్పుడు కూడా అడ్డంకులు సృష్టించేందుకు వైసీపీ యత్నించింది. సుమారు 300 కేసులు దాఖలైనప్పటికీ ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేసి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టింది. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకుసాగింది. అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాల్సిన ప్రతిపక్షం, వాటిని అడ్డుకునే ప్రయత్నాలు చేయడంవల్ల నష్టపోయేది ప్రజలే. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు వంటి కీలక అంశాల్లోనూ వైసీపీ ఇదే వైఖరిని కొనసాగిస్తోంది. రాష్ట్రానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టుల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సి ఉండగా, రాజకీయ ప్రయోజనాలే ప్రాధాన్యంగా మారితే అభివృద్ధి కుంటుపడుతుంది. ఇప్పుడు స్థానిక ఎన్నికల విషయంలోనూ ఇదేతరహా రాజకీయాలు కొనసాగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఎన్నికలంటే ఎందుకీ వెనుకడుగు?

స్థానికసంస్థల ఎన్నికలు గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కీలకం. ప్రజలకు స్థానిక పాలన అందుబాటులోకి రావాలంటే ఎన్నికలు సజావుగా జరగాలి. అయితే ఈ ఎన్నికల్లో పోటీచేసేందుకు వైసీపీకి అభ్యర్థులు దొరకడంలేదు. ఇప్పటికే అసెంబ్లీలో బలహీనమైన స్థితికి చేరుకున్న ఆ పార్టీకి స్థానిక ఎన్నికల్లోనూ ఎదురుదెబ్బ తగిలితే క్షేత్రస్థాయిలో ఉనికి ప్రశ్నార్థకమవుతుంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లు, ఎస్ఐఆర్ (సర్), తదితర అంశాలను ముందుకు తెచ్చి న్యాయస్థానాలను ఆశ్రయించి ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేసింది. స్థానిక ఎన్నికలకు సంబంధించి సుమారు 60కేసులు దాఖలయ్యాయి. బీసీ రిజర్వేషన్ల విషయంలో న్యాయపరమైన పరిమితులు ఎదురైనా కూటమి ప్రభుత్వం సాధ్యమైనంత మేరకు బీసీలకు న్యాయం చేసింది. అయినప్పటికీ ఎన్నికలను పూర్తిగా నిలిపివేయాలనే వైసీపీ ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో కొన్ని ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలను రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిణామాలుగా చిత్రీకరించి ఎన్నికల నిర్వహణపై సందేహాలు సృష్టించేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది.

## ఉమ్మడి కడప జిల్లా పైనే ప్రత్యేక దృష్టి

కోర్టుల్లో వైసీపీ ఫిర్యాదుచేసిన 19మున్సిపాలిటీల్లో ఎనిమిది ఉమ్మడి కడప జిల్లాలోనే ఉండటం గమనార్హం. రాజంపేట, ఎర్రగుంట్ల, కడప, రాయచోటి, కమలాపురం, పులివెందుల, ప్రొద్దుటూరు, మైదుకూరు ప్రాంతాల్లో ఎన్నికల వ్యవహారాలు వివాదాస్పదంగా మారడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పుంగనూరు రాజకీయ ప్రభావం ఉన్న ప్రాంతాల్లోనూ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఉమ్మడి కడప జిల్లా వైసీపీకి చాలా కాలంగా రాజకీయంగా కీలకమైన ప్రాంతం. ముఖ్యంగా పులివెందులలో వైఎస్ కుటుంబానికి ఉన్న రాజకీయ ఆధిపత్యం అందరికీ తెలిసిందే. అలాంటి ప్రాంతాల్లోనే స్థానిక ఎన్నికల సందర్భంగా వివాదాలు తెరపైకి రావడం వెనుకరాజకీయ కారణాలున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలను సాకుగా చూపుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలను నిలిపివేయాలనే ఉద్దేశంతో వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని అడ్డుకోవాలనే ప్రయత్నానికి అనుకూల ఫలితం దక్కలేదు. నామినేషన్లకు సంబంధించిన అంశాల్లో నిర్ణయం తీసుకునే బాధ్యతను రాష్ట్ర ఎన్నికల సంఘానికే వదిలేయడంతో ఎన్నికలను పూర్తిగా నిలిపివేయాలనే వైసీపీ ప్రయత్నాలకు బ్రేక్‌పడింది.

## కోర్టుల చుట్టూ రాజకీయాలు!

న్యాయస్థానాలను ఆశ్రయించడం ప్రతిపౌరుడికి, రాజకీయ పార్టీకి ఉన్న హక్కే. అయితే ప్రతి రాజకీయ సమస్యకూ కేసులే పరిష్కారమని భావించడం ఎంతవరకు సమంజసం? ప్రజల సమస్యలను ప్రజల్లోనే పరిష్కరించుకోవాలి. ఎన్నికల్లో తమ బలాన్ని నిరూపించుకోవాలి. కానీ రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి, ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డంకులు సృష్టించడానికి న్యాయపరమైన ప్రక్రియలను ఉపయోగించుకుంటున్నారనే విమర్శలు వైసీపీపై ఉన్నాయి. జగన్ వ్యక్తిగత వ్యవహారాలు కూడా తరచూ న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నాయి. అక్రమాస్తుల కేసుల్లో విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో వివిధ న్యాయపరమైన పిటిషన్లు దాఖలవుతున్నాయి. వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులోనూ దర్యాప్తు, విచారణకు సంబంధించిన అంశాలు న్యాయస్థానాల్లో చర్చకు వస్తున్నాయి. మరోవైపు సొంత కుటుంబంలోనే ఆస్తుల వివాదాలు తలెత్తడం, చెల్లెలు వైఎస్ షర్మిలతో ఆస్తులకు సంబంధించిన న్యాయపోరాటం కొనసాగడం జగన్ వ్యక్తిగత వ్యవహారాలను కూడా రాజకీయచర్చలోకి తెచ్చింది. మేనకోడలి వివాహానికి సంబంధించిన వివాదాలు సైతం కుటుంబ వ్యవహారాలు బహిరంగ చర్చకు దారితీయడానికి కారణమయ్యాయి. ఇలాంటి పరిణామాలన్నీ ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. రాజకీయ నాయకుడికి ప్రజల్లో విశ్వసనీయత ఎంత ముఖ్యమో, వ్యక్తిగత వ్యవహారాల్లోనూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం అంతే ముఖ్యం. సొంత కుటుంబంలో తలెత్తినవివాదాలే పరిష్కారం కాకుండా న్యాయస్థానాల వరకు వెళ్తున్నప్పుడు, ప్రజాసమస్యల పరిష్కారంపై నాయకత్వం ఎంత శ్రద్ధచూపుతుందనే ప్రశ్నలు సహజంగానే ఉత్పన్నమవుతాయి.

## ప్రజలతీర్పే అసలైన పరీక్ష

స్థానిక ఎన్నికలు కేవలం గ్రామాలు, పట్టణాల పాలకవర్గాలను ఎన్నుకునే ప్రక్రియ మాత్రమే కాదు. రాజకీయ పార్టీలకు ప్రజల్లో ఉన్న ఆదరణను అంచనావేసే కీలక సందర్భం కూడా. ఈ ఎన్నికల్లో వైసీపీ తన బలాన్ని నిరూపించుకోవాల్సి ఉండగా, కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఆధారంగా ప్రజల మద్దతును నిలబెట్టుకుంటామనే ధీమాతో ఉంది. రాజకీయ ఆధిపత్యం శాశ్వతం కాదు. ప్రజల నమ్మకాన్ని కోల్పోతే బలమైన కంచుకోటలూ కూలిపోతాయి. ఉమ్మడి కడప జిల్లాలోనూ, ముఖ్యంగా పులివెందులలోనూ మారుతున్న రాజకీయ పరిస్థితులు ఇదే విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. ఎన్నికలను అడ్డుకునే ప్రయత్నాలు చేసినంత మాత్రాన ప్రజల అభిప్రాయాన్ని మార్చలేరు. ప్రజలు ఎవరిని ఆదరిస్తున్నారు, ఎవరిని తిరస్కరిస్తున్నారన్నది ఓటు ద్వారా స్పష్టమవుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. కోర్టు కేసులతోనో, రాజకీయ ఆరోపణలతోనో ప్రజల తీర్పును శాశ్వతంగా అడ్డుకోలేరు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడమే రాజకీయ పార్టీలకు అసలైన విజయం.




## పులివెందులలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి కడప జిల్లాపై మాత్రమే జగన్ ప్రత్యేకదృష్టి పెట్టడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. బెంగళూరు నుంచి పులివెందులకు వచ్చి పార్టీ నాయకులు, ద్వితీయశ్రేణి నేతలతో సమావేశాలు నిర్వహించడం వెనుక స్థానికంగా పార్టీ పరిస్థితిపై ఆందోళన ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపని నాయకులను ఒప్పించడం, కార్యకర్తల్లో ఉత్సాహం నింపడం, తమకు ఇంకా క్షేత్రస్థాయిలో పట్టుఉందని చాటుకునేందుకు వైసీపీ పడరాని పాట్లు పడుతోంది. ఒకప్పుడు తమకు కంచుకోటగా భావించిన ప్రాంతాల్లోనే రాజకీయ సమీకరణాలు మారుతున్నాయనే సంకేతాలు ఆ పార్టీని కలవరపెడుతున్నాయి. పులివెందులలో ప్రజలు స్వేచ్ఛగా ఓటువేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయనే కూటమి వర్గాల వాదన కూడా ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజలు ఎలాంటి భయాలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోగలిగితే, రాజకీయ ఆధిపత్యం పేరుతో కొనసాగిన పాత పద్ధతులకు కాలం చెల్లినట్లే. స్థానిక ఎన్నికల సమయంలో పక్క రాష్ట్రాలనుంచి వ్యక్తులను తీసుకొచ్చి గొడవలు సృష్టించేందుకు గొడ్డలిపార్టీ చేసిన కుట్రలు కూడా బయటపడటంతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించాయి. ప్రజలు తమ ప్రతినిధులను స్వేచ్ఛగా ఎన్నుకునే వాతావరణం ఉండాలి. రాజకీయపార్టీలు తమ బలాన్ని నిరూపించుకోవాల్సింది ప్రజల మధ్యనే తప్ప, వివాదాలు సృష్టించడం ద్వారా కాదు.

### 26న ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ

# 40వ వార్షికోత్సవం

### ముఖ్యఅతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణ రాక



అమరావతి(చైతన్యరథం): భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆంధ్ర ప్రదేశ్‌లో పర్యటించనున్నారు. అక్టోబరు 26న విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 40వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఉపరాష్ట్రపతి పర్యటనకు ఇన్‌చార్జ్‌గా ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యవహరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి జె. శ్యామలరావు ఉత్తర్వులు జారీచేశారు. ఏపీ పర్యటనలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు స్వాగతం, వీడ్కోలు పలికేబాధ్యతలు మంత్రి సత్యకుమార్‌కు అప్పగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

**ఉప రాష్ట్రపతి పర్యటన షెడ్యూల్ వివరాలు**

అక్టోబరు 26న ఉదయం 10.05 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి ఉపరాష్ట్రపతి చేరుకుంటారు. ముందుగా అంబేద్కర్ కళావేదిక, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్మృతివనాన్ని ఆయన సందర్శిస్తారు. ఉదయం 11 నుంచి 12.10గంటల వరకు ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వేడుకల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.00గంటకు గన్నవరం విమానాశ్రయంనుంచి తిరుపతికి వెళతారు. మధ్యాహ్నం 2గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.00గంటలకు శ్రీవారిని దర్శించుకుంటారు. అదేరోజు రాత్రి తిరుపతిలోనే ఆయన బసచేస్తారు. అక్టోబరు 27న ఉదయం తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి దర్శించుకుంటారు. అనంతరం ఉదయం 8.15 గంటలకు తిరుపతి విమా నాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళతారు.

## మాజీ మంత్రి యనమలకు స్వల్ప అస్వస్థత

### కుటుంబసభ్యులతో సీఎం చంద్రబాబు ఆరా



కాకినాడ(చైతన్యరథం): మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కాకినాడలోని ట్రస్ట్ ఆస్పత్రిలో వైద్యచికిత్స అందిస్తున్నారు. ఇటీవల ఆయనకు గుండె శస్త్రచికిత్స చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో యనమలకు అమర్చిన స్టంట్లో స్వల్ప ఇబ్బందులు రావడంతో అస్వస్థతకు గురైనట్లు సమాచారం. ఆ తర్వాత తిరిగి వైద్యం అందించడంతో యనమల ఆరోగ్యం కుదుటపడింది.ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు ఆయనను తరలించారు. యనమలకు ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. యనమల ఆరోగ్య పరిస్థితిపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ఆయన కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి వివరాలు తెలుసుకున్నారు. యనమల ఆరోగ్య పరిస్థితి గురించి తనకుఎప్పటికప్పుడు సమాచారం అందించాలని తెలుగుదేశం పార్టీ నేతలను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఎంపీ సానా సతీశ్ ట్రస్ట్ ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో మాట్లా డారు. యనమల ఆరోగ్య పరిస్థితి గురించి సీఎంకు సమాచారం అందజేశారు.

**యనమల త్వరగా కోలుకోవాలి: లోకేష్**

అస్వస్థతకు గురై కాకినాడ ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు త్వరగా కోలుకోవాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

## భవానీ భక్తుల మృతి బాధాకరం

**సీఎం చంద్రబాబు సంతాపం**

**క్షతగాత్రులకు మెరుగైన చికిత్సకు ఆదేశం**

అమరావతి(చైతన్యరథం): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని కత్తిపూడి జాతీయ రహదారిపై రావికంపాడు జంక్షన్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు భవానీ భక్తులు మృతిచెందిన విషయం తెలిసిందే.భవానీ భక్తుల మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రవిచారం వ్యక్తంచేశారు. భవానీ దీక్షలో ఉన్న నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంపై సీఎం సంతాపం తెలిపారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి దర్శనంకోసం కాలినడకన వస్తున్న భవానీ భక్తులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందటం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గాయ పడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**మంత్రి లోకేష్ సంతాపం**

కాకినాడ జిల్లా కత్తిపూడి వద్ద రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా డెంకాడకుచెందిన భవానీభక్తులు మృతి చెందడం చాలా బాధాకరమని మంత్రి నారా లోకేష్ ఒకప్రకటనలో సంతాపం తెలిపారు.మృతులకు నివాళులర్పించారు. వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.





# వైసీపీ రాజకీయ పార్టీనా..రౌడీల, బందిపోట్ల ముఠానా?

- జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి
- పోలీసుల ముందే మహిళలపై ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే అత్యంత జుగుప్సాకర వ్యాఖ్యలు
- విధుల్లో ఉన్న పోలీసు అధికారిపై మాజీ మంత్రి రోజా అసభ్య దూషణలు, దౌర్జన్యం
- చేసేవన్నీ చేసి నంగనాచుల్లా ఎన్నికల కమిషన్ ముందు ధర్నాలు
- మొగుడ్ని కొట్టి మొగసాల కెక్కినట్లుగా వైసీపీ తీరు
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఆగ్రహం
- స్థానిక ఎన్నికల నామినేషన్ల వేళ వైసీపీ విధ్వంసాలపై ఎస్ఈసీకి టీడీపీ బృందం ఫిర్యాదు
- 7 ప్రాంతాల్లో వైసీపీ నేతల అరాచక ఘటనల వీడియోల పెన్ డ్రైవ్‌ను అందజేసిన నేతలు
- వైసీపీ గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరామన్న వర్ల రామయ్య
- టీడీపీ బృందంలో పర్చూరి అశోక్ బాబు, ఎస్.రాజశేఖర్, నీలాయపాలెం విజయ్ కుమార్



అమరావతి (చైతన్యరథం): స్థానిక ఎన్నికల సందర్భంగా వైసీపీ నేతలు పాల్పడుతున్న అరాచకాలు, అల్లర్లు చూస్తుంటే అది రాజకీయ పార్టీలా కాకుండా రౌడీ మూకలా, మాఫియా ముఠాలా కనిపిస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య ధ్వజమెత్తారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగించిన అరాచకాలు, విధ్వంసాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠాకు తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బృందం గురువారం ఫిర్యాదు చేసింది. తంబళ్లపల్లె, సదుం, చౌడేపల్లి, కనిగిరి, అనంతపురం రూరల్, నెకరికల్లు ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు సాగించిన దాడులు, విధ్వంసాలు, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్.రాజశేఖర్, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్‌లతో కూడిన బృందం ఎన్నికల కమిషనర్‌కు సమగ్ర లిఖితపూర్వక ఫిర్యాదును అందజేసింది. ఆయా ప్రాంతాల్లో నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా టీడీపీ అభ్యర్థులు, పోలీసులపై వైసీపీ గూండాలు సాగించిన దౌర్జన్యాలు, బెదిరింపులు, వాహనాల ధ్వంసానికి సంబంధించిన స్పష్టమైన వీడియో ఆధారాలతో కూడిన పెన్ డ్రైవ్‌ను ఎన్నికల కమిషనర్‌కు సమర్పించారు.

ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్సీ వర్ల రామయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం కొద్దీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలించారన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ని కలిసి వైఎస్సార్సీపీ నేతలు పాల్పడుతున్న అరాచకాలు, హింసాత్మక చర్యలు, అసభ్య ప్రవర్తనలకు సంబంధించిన 7 ప్రధాన సంఘటనలపై వీడియో ఆధారాలతో కూడిన ఫిర్యాదును అందజేసినట్లు తెలిపారు. వైఎస్సార్సీపీ నేతలు బాహాటంగా మైకులు పట్టుకుని 'రప్పా రప్పా నరికేస్తాం', 'మేక పోతుల్లా మెడలు కోస్తాం', 'పొడిచేస్తాం' అంటూ మాట్లాడుతున్నారు. అసలు మీది రాజకీయ పార్టీయా.. బందిపోటు దొంగల ముఠానా? మాఫియా గ్యాంగా? ప్రజాస్వామ్యంలో ప్రజలకు దిశా నిర్దేశం చేయాల్సిన నేతలు ఇలాంటి గూండా భాష మాట్లాడటం సభ్యసమాజం తలదించుకోవాల్సిన విషయం. ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి.. పోలీసుల ముందే నిలబడి అహంకారంతో అత్యంత జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేశారు. అసభ్య పదజాలం వాడారు. అంతటితో ఆగకుండా ఆడవారిపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ మమ్మల్ని కొట్టండి.. మేము అధికారంలోకి వచ్చాక మీ భరతం పడతాం.. అని మాట్లాడటం ఘోరాతి ఘోరం. ఆడబిడ్డల మానప్రాణాలను గౌరవించాల్సింది పోయి, నీచమైన భాషలో మాట్లాడుతున్న వారిని అసలు మనిషి అనవచ్చా? బుద్ధి, జ్ఞానం ఉన్నవాడెవడైనా ఇలాంటి మాటలు మాట్లాడతాడా? 2028లోపు మమ్మల్ని చంపేయండి.. లేకపోతే 2029లో బతికుంటే మీ కళ్లల్లోంచి రక్తం తెప్పిస్తాం.. అంటూ ఫ్యాక్షనిస్టులా, కసాయిలా బెదిరింపులకు దిగుతున్నారు. జగన్మోహన్ రెడ్డిని నేరుగా అడుగుతున్నా.. ఈ భాష మీ పార్టీ సంస్కృతా? ఈయనే మా నాయకుడు, తరువాతి ఎన్నికల్లో ప్రొద్దుటూరులో రాచమల్లుకే టికెట్ ఇస్తాం, ఇతనికే ఓటు వేయండి అని ప్రజల ముందు చెప్పే ధైర్యం మీకు ఉందా అని వర్ల రామయ్య ప్రశ్నించారు.

### డ్యూటీలో ఉన్న పోలీసులపై మాజీ మంత్రి రోజా దాష్టీకం

మహిళా నాయకురాలిగా చెప్పుకునే మాజీ మంత్రి ఆర్కే రోజా.. విధుల్లో ఉన్న ఒక పోలీస్ అధికారి ఛాతీపై పిడిగుద్దులు గుద్ది అసభ్యంగా మాట్లాడారు. పబ్లిక్ సర్వెంట్‌పై దాడి చేసి ఇలాంటి నీచమైన పదజాలం వాడటం క్షమించరాని నేరం. ఆ నీచమైన మాటలకు అర్థం ఏమిటో ఆమెనే స్వయంగా రాష్ట్ర ప్రజలకు వివరించాలి. ఇలాంటి ప్రవర్తన గల వారిని చూసి మహిళా లోకమే సిగ్గుతో తలదించుకుంటోంది. శాంతిభద్రతలు కాపాడే పోలీసుల మీదే పెట్రోల్ బాంబులు విసిరారు. బారికేడ్ల వద్ద ఆపుతున్న పోలీసు అధికారిని వాటర్ ట్యాంకర్‌తో తొక్కించే దుశ్చర్యకు పాల్పడ్డారు. కేంద్రాల్లోకి చొరబడి నామినేషన్ పేపర్లను లాక్కుని, చించి అధికారుల ముఖంపై కొట్టారు. 'నరికేస్తాం, చంపేస్తాం' అన్న వీరి బెదిరింపులు భరించలేక అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ (ఎంపీడీవో) ప్రాణభయంతో అక్కడి నుంచి పారిపోవాల్సి వచ్చింది. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందిని, పోలీసులను భయభ్రాంతులకు గురిచేస్తూ వైఎస్సార్సీపీ నేతలు సాగిస్తున్న 7 వికృత ఘటనలను ఆధారాలతో సహా ఎస్ఈసీ దృష్టికి తీసుకెళ్లాం. ఈ సాక్ష్యాలను చూసి ఆయన కూడా అవాక్కయ్యారు. పక్కనే ఉన్న మహిళా ఐజీ రాజకుమారి ఆ బూతులు వినలేక చెవులు మూసుకున్నారు. ఇలాంటి చట్టవ్యతిరేక పార్టీ గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశామని వర్ల రామయ్య తెలిపారు.

### మొగుడ్ని కొట్టి మొగసాలకెక్కినట్లుగా..

అధికారులపై దాడులు చేస్తూ, ప్రజలను బెదిరిస్తూ అన్ని అరాచకాలు చేసి, మళ్లీ ఆ పార్టీ నాయకులే ఎస్ఈసీ వద్దకు వచ్చి ధర్నా చేస్తుండటం విడ్డూరంగా ఉంది. ఇది అచ్చం 'మొగుడ్ని కొట్టి మొగసాలకెక్కినట్లు', 'దొంగే దొంగ అని అరిచినట్లు'గా ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవిస్తూ నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఈసీపై నోటికొచ్చినట్లు మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా అక్కాచెల్లెమ్మలు, వైఎస్సార్సీపీ నేతల రౌడీయిజాన్ని, అసభ్యకర పోకడలను గమనించాలి. రాజకీయాల్లో భాష సంస్కారవంతంగా, ప్రజాహితంగా ఉండాలి తప్ప గూండాల మాదిరిగా ఉండకూడదు. ఎన్నికల కమిషన్ నిబంధనలను, చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వైఎస్సార్సీపీ అరాచక మూకలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- జీవీఎంసీపై కూటమి జెండా ఎగురవేయాలి
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పిలుపు
- విశాఖలో జీవీఎంసీ కూటమి కార్పొరేటర్ అభ్యర్థులతో మంత్రి సమావేశం



విశాఖపట్నం (చైతన్యరథం): గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం ప్రతి అభ్యర్థి కష్టపడి పని చేయాలని విశాఖ జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పిలుపు ఇచ్చారు. గురువారం విశాఖ డాల్ఫిన్ హోటల్ లో జీవీఎంసీ కూటమి కార్పొరేటర్ ఆభ్యర్థులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరు, ప్రజలతో మమేకమవడం వంటి అంశాలపై అభ్యర్థులకు మంత్రి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం మంత్రి డోలా మాట్లాడుతూ.. టిక్కెట్లు ఆశించి పొందలేని వారిని సమన్వయంతో కలుపుకొని పనిచేయాలన్నారు. వైసీపీ అభ్యర్థుల కంటే కూటమి అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తూ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. కూటమి రెండున్నరేళ్ల పాలనలోనే విశాఖ నగరానికి పెద్ద ఎత్తున కంపెనీలు, పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. వైసీపీ హయాంలో విశాఖ నగరంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, కూటమి పాలనలో నగరంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రజలంతా కూటమి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి అభ్యర్థి కష్టపడి పని చేసి జీవీఎంసీపై కూటమి జెండా ఎగురవేయాలని మంత్రి డా.డోలా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీ శ్రీ భరత్ , ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడు చోడే పట్టాభిరామ్, జీవీఎంసీ ఎన్నికల పరిశీలకుడు ఎంఏ షరీఫ్, కూటమి మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థుల గెలుపుతోనే నిడదవోలు సమగ్ర అభివృద్ధి

- స్థానిక ఎన్నికల ప్రచారంలో మంత్రి దుర్గేష్
- కూటమి మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి మురాల జ్యోతి, వార్డు అభ్యర్థుల తరపున ప్రచారం



నిడదవోలు (చైతన్యరథం): మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి నిడదవోలు పట్టణ సమగ్ర అభివృద్ధికి బాటలు వేయాలని స్థానిక ప్రజలకు రాష్ట్ర రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పిలుపు ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలో విస్తృతంగా గురువారం మంత్రి పర్యటించారు. కూటమి మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి మురాల జ్యోతితో పాటు స్థానిక కూటమి అభ్యర్థులతో కలిసి ఆయన నిడదవోలు పట్టణంలోని 7,10, 23, 24, 25 వార్డులతో పాటు వైఎస్సార్ కాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

7వ వార్డు కూటమి జనసేన అభ్యర్థి గుర్రం శాంతి శ్రీ, 10వ వార్డు టీడీపీ అభ్యర్థి మహమ్మద్ షకీనా అన్సారీ బేగం, 23వ వార్డు కూటమి టీడీపీ అభ్యర్థి గొబ్బిళ్ళ ఫణిరాజ్, 24వ వార్డు బీజేపీ అభ్యర్థి సన్నిధి శ్రీనివాస్, 25వ వార్డు జనసేన అభ్యర్థి మాడిపాటి నాగమణి తరపున ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. క్షేత్రస్థాయిలో వార్డుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన సాధ్యపడాలంటే కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా ఒక ఓటు కూటమి మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థికి, మరొక ఓటు స్థానిక వార్డు కూటమి అభ్యర్థికి వేసి విజయాన్ని అందించాలని కోరారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో నిడదవోలు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. గడిచిన రెండున్నర ఏళ్ల కూటమి ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని, అభివృద్ధికి మద్దతుగా నిలిచి కూటమికి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల ప్రచారానికి ముందు మంత్రి దుర్గేష్ స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేరపూరిత కుట్రతో స్థానిక ఎన్నికల భగ్నానికి వైసీపీ కుట్ర

## - ఎస్ఈసీకి ఎమ్మెల్సీ వర్ల రామయ్య వినతి పత్రం

అమరావతి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో హింసను ప్రేరేపిస్తూ వైసీపీ నేతలు చేస్తున్న దాడులు, దౌర్జన్యాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠాకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల వినతి పత్రం సమర్పించారు. దాని పూర్తి పాఠం...

**గౌరవనీయులైన సర్,**

**విషయం:** స్థానిక సంస్థల ఎన్నికలు–2026 – రాష్ట్రవ్యాప్తంగా హింసను ప్రేరేపించేందుకు వైఎస్సార్‌సీపీ కుట్ర – నేరపూరిత కుట్ర – వ్యవస్థీకృత నేరాలు – ప్రజాస్వామ్య స్ఫూర్తిని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు – ఎన్నికలను భగ్నం చేసేందుకు హింసను ప్రేరేపించడం – వైఎస్సార్‌సీపీపై చర్యలు తీసుకోవాలని అభ్యర్థనకు సంబంధించి.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి, ఎన్నికలను భగ్నం చేయడానికి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడానికి, ప్రజల భాగస్వామ్యాన్ని అడ్డుకోవడానికి వైఎస్సార్‌సీపీ వివిధ మార్గాల్లో హింసను ప్రేరేపించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

మొదటగా, ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము పాల్గొనబోమని వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రకటించారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ఉద్దేశపూర్వకంగా హింసను ప్రేరేపించి, సుప్రీంకోర్టును ఆశ్రయించి అన్యాయం జరుగుతోందంటూ ఆరోపణలు చేసింది.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడానికి వైఎస్సార్‌సీపీ దాదాపు 59 పిటిషన్లు దాఖలు చేసింది. బీసీ రిజర్వేషన్ల నుంచి కొన్ని స్థానిక సంస్థల సరిహద్దుల పునర్విభజన వరకు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నుంచి ఎన్నికల పేరుతో హింస వరకు వివిధ అంశాలపై ఈ పిటిషన్లు దాఖలు చేసింది.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వైఎస్సార్‌సీపీ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను ఎదుర్కోలేక, హింస ద్వారా ఎన్నికల నిర్వహణను దెబ్బతీసేందుకు కుట్ర పన్నిందనేది స్పష్టంగా తెలుస్తోంది.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా వ్యవస్థీకృత హింసకు పాల్పడేలా వైఎస్సార్‌సీపీ నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు కనిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ నిర్వహించిన కొన్ని హింసాత్మక సంఘటనల వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

**1. కృష్ణగిరి మండలం – పత్తికొండ నియోజకవర్గం**

2026 అక్టోబర్ 22న కర్నూలు జిల్లా పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని కృష్ణగిరి మండలంలో, వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి (మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి బావమరిది), ఆయన అనుచరులతో కలిసి, నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులపై దాడి చేశారు. గులకరాళ్లతో నింపిన ట్రాక్టర్‌లో వచ్చి, రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చేసిన ఈ దాడిలో సుమారు 50 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో పాటు రాఘవేంద్ర ప్రసాద్ అనే పోలీస్ కానిస్టేబుల్ గాయపడ్డారు. అనంతరం వారిని ఆసుపత్రికి తరలించారు.

**2. తంబళ్లపల్లె – ఎంపీడీవో కార్యాలయం**

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయంలోని నామినేషన్ కేంద్రం వద్ద, కన్నెమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు డి. రామకృష్ణారెడ్డి, డి. శివశంకర్‌రెడ్డి నాయకత్వంలో సుమారు 600 మంది వైఎస్సార్‌సీపీ రౌడీలు గుంపుగా వచ్చారు. వారు నామినేషన్ కేంద్రం గేట్లను నెట్టివేస్తూ, అక్కడ ఉన్న అధికారులను భయభ్రాంతులకు గురిచేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పుడు, ఆ గుంపు రాళ్లు, కర్రలు, పెట్రోల్ బాంబులతో దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గాయపడ్డారు. ఈ ఘటనలో పక్కీరప్ప (ఎస్సీ) తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**3. పెద్దతిప్పసముద్రం మండలం**

అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలంలో, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ గూండాల ముఠా, ఎంపీటీసీ నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడి చేసింది. ఈ దాడి సమయంలో వైఎస్సార్‌సీపీ వర్గం రాళ్లు రువ్వడంతో, పోతుపేట గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, బూర్లపల్లి గ్రామానికి చెందిన ఆనందరెడ్డికి తలకు గాయాలయ్యాయి.

**4. నందలూరు – కడప జిల్లా**

కడప జిల్లా నందలూరులోని నామినేషన్ కేంద్రం సమీపంలో వైఎస్సార్‌సీపీ గూండాలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడి చేసి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు చెందిన మూడు వాహనాలను తగలబెట్టారు. వైఎస్సార్‌సీపీ రౌడీలను అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు గాలిలోకి ఐదు రౌండ్ల కాల్పులు జరపాల్సి వచ్చింది.

**5. దర్శి**

ప్రకాశం జిల్లా దర్శిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తీవ్రంగా ఉల్లంఘిస్తూ, పోలీసులు అనుమతి ఇవ్వనప్పటికీ వైఎస్సార్‌సీపీ గూండాలు 1,500 మందితో ఊరేగింపు నిర్వహించారు. పోలీసులు ఆ ఊరేగింపును అడ్డుకున్నప్పుడు, వైఎస్సార్‌సీపీ గూండాలు తమ నామినేషన్ పత్రాలను తామే చించుకుని, పోలీసులపై దాడి చేసి, హింసాత్మక వాతావరణాన్ని సృష్టించారు. నామినేషన్ దాఖలు చేయడానికి కేవలం నలుగురు లేదా ఐదుగురిని మాత్రమే అనుమతిస్తామని, వారిని నామినేషన్ కేంద్రానికి తీసుకెళ్లడానికి బస్సును కూడా ఏర్పాటు చేశామని పోలీసులు పదేపదే వైఎస్సార్‌సీపీ గూండాలకు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకపోయింది.

అన్నమయ్య జిల్లా రాయచోటిలో హింసను ప్రేరేపించేందుకు పంజాబ్ నుంచి ఆయుధాలతో కూడిన గ్యాంగ్‌స్టర్లను కూడా వైఎస్సార్‌సీపీ రప్పించింది. ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికల నిర్వహణను భగ్నం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రేరేపించిన హింసను ఈ నేపథ్యంలోనే చూడాలి.

ఒకవైపు వైఎస్సార్‌సీపీ వ్యవస్థీకృత నేరాలు, నేరపూరిత కుట్రల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా హింసను ప్రేరేపిస్తుండగా, మరోవైపు తమకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ, తామే బాధితులమని చెప్పుకుంటోంది. వైఎస్సార్‌సీపీ గూండాలు, రౌడీలు చేస్తున్న ఇటువంటి నేరపూరిత చర్యలపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి మోసపూరిత రాజకీయ పార్టీల నిజస్వరూపాన్ని బయటపెట్టడం అత్యంత అవసరం.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకున్నప్పుడే ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిపై కోల్పోయిన విశ్వాసాన్ని తిరిగి పునరుద్ధరించగలుగుతాము.

**ధన్యవాదాలు.**

**ఆత్మీయ అభివందనాలతో,**
**టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య**

--------

4–6 పేజీల్లో జతచేసిన ఫొటోల వివరాలు

**పేజీ 4:**
వైఎస్సార్‌సీపీ వ్యవస్థీకృత హింసను చూపించే ఫొటోలు. ఆ పార్టీ గూండాలు చెక్క కర్రలు, రాళ్లతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ప్రజలపై దాడి చేస్తున్న దృశ్యాలు.

**పేజీ 5:**
వైఎస్సార్‌సీపీ నిర్వహించిన దాడిలో తీవ్రంగా గాయపడిన పక్కీరప్ప (ఎస్సీ).

**పేజీ 6**
పెద్దతిప్పసముద్రం మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై వైఎస్సార్‌సీపీ గూండాల దాడి.

# గోదావరి పుష్కరాల్లో ప్లాస్టిక్ వినియోగంపై నియంత్రణ

- **ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలి**
- **బేవరేజ్ సంస్థల ప్రతినిధులతో పీసీబీ చైర్మన్ కృష్ణయ్య వీడియో కాన్ఫరెన్స్**

విజయవాడ (చైతన్యరథం): గోదావరి పుష్కరాల సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి, వినియోగించిన ప్లాస్టిక్ బాటిళ్లను సమర్థవంతంగా సేకరించి రీసైక్లింగ్ చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) చైర్మన్ డా. పీ కృష్ణయ్య సూచించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, పర్యావరణహిత ప్రత్యామ్నాయాల వినియోగంపై రాష్ట్రంలోని ప్రముఖ బేవరేజ్ సంస్థల ప్రతినిధులతో గురువారం విజయవాడలోని ఏపీపీసీబీ ప్రధాన కార్యాలయం నుంచి చైర్మన్ కృష్ణయ్య వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, వివిధ బేవరేజ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలపై ప్రత్యేక దృష్టి**

గోదావరి పుష్కరాలు కుంభమేళా తరహాలో భారీ స్థాయిలో నిర్వహించనున్న నేపథ్యంలో, పెద్ద సంఖ్యలో భక్తులు గోదావరి తీర ప్రాంతాలకు చేరుకునే అవకాశం ఉందని, ఈ సమయంలో తాగునీరు, పానీయాల సరఫరా ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా పేరుకుపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కృష్ణయ్య పేర్కొన్నారు. ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగాన్ని తగ్గించేందుకు సాధ్యమైన మేరకు పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా వృక్షాధారిత పదార్థాలు, పేపర్ వంటి వాటితో రూపొందించిన పర్యావరణహిత సీసాలు, ఇతర ప్రత్యామ్నాయ ప్యాకేజింగ్ విధానాల వినియోగంపై పరిశ్రమలు పరిశీలన చేయాలని కోరారు.



**తాగునీరు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు**

పుష్కరాలకు వచ్చే భక్తులకు ప్లాస్టిక్ సీసాలకు బదులు అవసరమైన ప్రాంతాల్లో వాటర్ డిస్పెన్సర్లు ఏర్పాటు చేయడం, పునర్వినియోగానికి అనువైన సీసాలను వినియోగించేలా చర్యలు చేపట్టాలని బేవరేజ్ సంస్థలకు సూచించారు. పరిశ్రమలు తమ వనరులు, సామర్థ్యానికి అనుగుణంగా పుష్కర ప్రాంతాల్లో తాగునీటి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయడం, తాగునీటి సరఫరా కోసం స్థానిక యంత్రాంగంతో సమన్వయం చేసుకోవడం వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కృష్ణయ్య కోరారు.

**ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణ, రీసైక్లింగ్‌కు పటిష్టమైన వ్యవస్థ**

పుష్కరాల సమయంలో విక్రయించే లేదా పంపిణీ చేసే ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగం అనంతరం నిర్లక్ష్యంగా పడవేయకుండా, వాటిని సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేసే వ్యవస్థను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కృష్ణయ్య సూచించారు. బాటిళ్ల సేకరణ కోసం తగిన కేంద్రాలను ఏర్పాటు చేయడం, వ్యర్థాలను ఇతర చెత్త నుంచి వేరు చేయడం, సేకరించిన బాటిళ్లను అధీకృత రీసైక్లింగ్ సంస్థలకు తరలించడం, ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు పర్యవేక్షణ కొనసాగించడం వంటి చర్యలపై దృష్టి సారించాలన్నారు. పుష్కర ప్రాంతాల్లో స్థానిక సంస్థలు, పారిశుధ్య సిబ్బంది, బేవరేజ్ కంపెనీలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేవలం బాటిళ్లను సేకరించడంతో ముగియకూడదని, వాటిని సరైన విధానంలో రీసైక్లింగ్ చేయించే వరకు బాధ్యతాయుతమైన వ్యవస్థ ఉండాలని కృష్ణయ్య పేర్కొన్నారు.

అలానే పుష్కరాల సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం, సేకరణ, రీసైక్లింగ్ వివరాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించడం అవసరమని స్పష్టం చేశారు. పుష్కరాల కోసం ఎన్ని ప్లాస్టిక్ బాటిళ్లు అమ్ముడయ్యాయి, ఎన్ని ఉచితంగా పంపిణీ అయ్యాయి, వాటిలో ఎన్ని తిరిగి సేకరించబడ్డాయి, ఎంత పరిమాణంలో రీసైక్లింగ్‌కు పంపించారు, ఇంకా ఎంత వ్యర్థం మిగిలిపోయింది అనే వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హిందుస్థాన్ కోకా–కోలా, రిలయన్స్, బిస్లెరీ ఇంటర్నేషనల్, ఆర్ట్రోస్, తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వాటర్ డిస్పెన్సర్ల ఏర్పాటు, తాగునీరు, పానీయాల సరఫరా, ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణ, రీసైక్లింగ్ వంటి అంశాలపై వివిధ ప్రతిపాదనలను చర్చించారు. పుష్కరాల సందర్భంగా చేపట్టనున్న కార్యక్రమాలు, అందించగల సహకారం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు అనుసరించనున్న విధానాలు, పర్యావరణహిత ప్రత్యామ్నాయాల వినియోగంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలను పదిహేను రోజుల్లోగా సమర్పించాలని ఆయా సంస్థల ప్రతినిధులను కృష్ణయ్య కోరారు. గోదావరి పుష్కరాలను పర్యావరణ హితంగా నిర్వహించడంలో ప్రభుత్వ శాఖలతో పాటు పరిశ్రమలు, స్థానిక సంస్థలు, ఇతర భాగస్వాములు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంతో పాటు, గోదావరి నది, పరిసర ప్రాంతాల పరిశుభ్రతను కాపాడటం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కృష్ణయ్య పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టు ఆదేశాలు చదివావా..

# అసలు నీకు అర్థమయ్యాయా?

- వైసీపీ నేత ధర్మాన ప్రసాదరావుపై మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజం
- వక్రీకరించి ప్రభుత్వానికి చెంపదెబ్బ అంటూ తప్పుడు ప్రచారం
- 2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ దౌర్జన్యాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదు
- అప్పటి ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌ను అక్రమంగా తొలగించిన చరిత్ర మీది కాదా?
- జగన్ రెడ్డి ఆదేశాలతోనే గొడ్డలి పార్టీ రౌడీమూకల అరాచకాలు
- ప్రజాక్షేత్రంలో తేల్చుకునే వాళ్లమే తప్ప.. అక్రమంగా అడ్డుకునే వాళ్లం కాదు
- గొడ్డలి పార్టీ గూండాగిరిని, ఫ్యాక్షన్ సంస్కృతిని ఉపేక్షించేది లేదు



అమరావతి (చైతన్యరథం): సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా చదివి అర్థం చేసుకోవడం రాని గొడ్డలి పార్టీ నాయకుల నుంచి సరైన విశ్లేషణ ఆశించడం తమదే తప్పని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్రలో అత్యంత తెలివైనవాడినని తనకు తాను చెప్పుకునే ధర్మాన ప్రసాదరావు.. సుప్రీంకోర్టు ఆదేశాలు చదివారా? అవి ఆయనకు అర్థమయ్యాయా అని ప్రశ్నించారు. అభ్యర్థుల తుది జాబితా ప్రచురణను ఈ నెల 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారనే ఫిర్యాదులు అందితే సంబంధిత సాక్ష్యాధారాలు, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలతో సహా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పరిశీలించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు.

శాంతిభద్రతల సమస్య కారణంగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారని నిర్ధారణ అయితే ఆ పట్టణ స్థానిక సంస్థల్లో మాత్రమే నామినేషన్ల గడువును పొడిగించాలని, ఆ పొడిగింపు కూడా నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి 48 గంటలు మాత్రమే ఉండాలని స్పష్టం చేసిందన్నారు. ఇంత స్పష్టంగా ఉన్న ఆదేశాలను వక్రీకరించి ప్రభుత్వానికి 'చెంపదెబ్బ' అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రజాస్వామ్యబద్ధంగా పరిస్థితులు ఉన్నాయి కాబట్టే వైసీపీ అభ్యర్థులు టీడీపీ అభ్యర్థులతో సమానంగా నామినేషన్లు దాఖలు చేయగలిగారని, మేము ప్రజాక్షేత్రంలో తేల్చుకునే వాళ్లమే తప్ప అక్రమంగా అడ్డుకునే వాళ్లం కాదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

**2021 అరాచకాలను జనం మర్చిపోలేదు..**

2021 స్థానిక ఎన్నికల ప్రక్రియలో వైసీపీ దౌర్జన్యాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అభ్యర్థులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ఫిర్యాదు చేసినా, కోర్టును ఆశ్రయించినా చంపేస్తారనే భయం కల్పించి, 80 శాతం స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర మీది అని ఆరోపించారు. అదే మీ రప్పా రప్పా రాజ్యాంగం అంటూ ఎద్దేవా చేశారు. అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌ని అక్రమంగా తొలగించిన తీరు, కోర్టు ద్వారా ఆయన తిరిగి నియమితులైన తర్వాత కూడా ఆయనపై చేసిన వ్యక్తిత్వ హననం ప్రజలు మరిచిపోలేదన్నారు. ఇలాంటి చరిత్ర ఉన్న మీ గొడ్డలి పార్టీ అధ్యక్షుడు రాజ్యాంగ సంస్థలు, ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థల పట్ల మీకున్న గౌరవమేమిటో మీ గత చరిత్రే చెబుతోందని అన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ రెడ్డి ఇచ్చే ఆదేశాల మేరకే గొడ్డలి పార్టీ రౌడీమూకలు క్షేత్రస్థాయిలో బరితెగించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉంటే తమ ఉనికికే ప్రమాదమని అల్లర్లు సృష్టించి పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో గులకరాయి, కోడికత్తి నాటకాలతో సానుభూతి పొందేందుకు ప్రయత్నించినట్లే, ఇప్పుడు తామే అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలు లేవంటూ సానుభూతి పొందాలనుకుంటున్నారని విమర్శించారు. కానీ ప్రజలు మీ నైజాన్ని ఇప్పటికే తెలుసుకున్నారని, ఇక మీ ఆటలు చెల్లవని హెచ్చరించారు. పుంగనూరులో ఎంపీ కాన్వాయ్‌లో మారణాయుధాలు, మద్యం బాటిళ్లు పెట్టుకుని ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టాలని చూసింది మీ గొడ్డలి పార్టీ కాదా అని సూటిగా ప్రశ్నించారు.

**అల్లర్ల బాధ్యులపై చట్టప్రకారం చర్యలు**

ప్రజాక్షేత్రంలో ఘోర పరాజయం తప్పదని ముందే తెలిసిపోయి, కనీసం పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా దొరకక, ఇప్పుడు పోలీసులు అడ్డుకుంటున్నారని, ఎన్‌ఓసీలు ఇవ్వడం లేదని కుంటిసాకులు చెబుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. మాది ప్రజాస్వామ్యబద్ధమైన ప్రభుత్వం కాబట్టే రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా తన విధులు నిర్వర్తించగలుగుతోందన్నారు. ఎన్‌ఓసీల అవసరం లేదని స్పష్టం చేయడంతోపాటు, చిన్న ఫిర్యాదు అందినా పూర్తిస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చేంత స్వేచ్ఛగా ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు గొడ్డలి పార్టీ గూండాగిరికి, ఫ్యాక్షన్ సంస్కృతికి రాజకీయంగా సమాధి కట్టడం ఖాయమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాష్ట్రాన్ని అశాంతిపాలు చేయాలని చూసే గొడ్డలి పార్టీ ముఠా నాయకుల్లో ఏ ఒక్కరినీ కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

# స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు...

# హింస, విధ్వంసాలనే నమ్ముకున్న గొడ్డలిపార్టీ

- ఎన్నికలు జరగకపోతే 16వ ఆర్థిక సంఘం నిధులు కోల్పోయే ప్రమాదం
- పక్క రాష్ట్రాల కిరాయి గూండాలతో బీభత్సానికి వైసీపీ కుట్రలు
- సుప్రీంకోర్టు ఆదేశాలను వక్రీకరిస్తూ తప్పుడు ప్రచారం
- వేల సంఖ్యలో నామినేషన్లు వేసి కూడా అడ్డుకున్నారంటూ జగన్ ముఠా దుష్ప్రచారం
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవడమే లక్ష్యంగా గొడ్డలి పార్టీ నిత్యం అరాచకాలు, దాడులు, రక్తపాతానికి తెగబడుతోందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోతే 16వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన రూ.12,500 కోట్ల భారీ నిధులు శాశ్వతంగా నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి విధ్వంసం చేస్తే, సీఎం చంద్రబాబు నాయుడు నేడు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూపాయి రూపాయి పోగేసి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని తెలిపారు. ఋషులు యజ్ఞం చేస్తుంటే రాక్షస మూకలు భగ్నం చేయాలని చూసినట్లు, కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి యజ్ఞాన్ని అడ్డుకునేందుకు వైసీపీ కోర్టుల్లో కేసులు వేసి కుట్రలు పన్నిందని, అవి ఫలించకపోవడంతో నేడు నేరుగా హింసకు తెరలేపిందని మండిపడ్డారు.

**బీభత్సానికి కుట్రలు**

ఎన్నికల ప్రక్రియను భగ్నం చేసేందుకు పంజాబ్, ఇతర రాష్ట్రాల నుంచి కిరాయి రౌడీలు, షార్ప్ షూటర్లను రప్పించి పుంగనూరు, కడప, రాయచోటి ప్రాంతాల్లో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని పట్టాభిరామ్ ఆరోపించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి, అవినాష్ రెడ్డి అండతో చిత్తూరులో నడవలేని స్థితిలో వాకర్ సాయంతో నామినేషన్ వేయడానికి వచ్చిన వృద్ధ మహిళా అభ్యర్థిపై సైతం దాడి చేసి పత్రాలు లాక్కోవడం గొడ్డలి పార్టీ రాక్షసత్వానికి పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్లు వేయనివ్వడం లేదంటూ సుప్రీంకోర్టు, ఈసీల వద్ద గగ్గోలు పెడుతున్న వైసీపీ నేతల మాటలకు, క్షేత్రస్థాయి గణాంకాలకు అసలు పొంతన ఉందా అని నిలదీశారు. 100 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏకంగా 23 వేలకు పైగా నామినేషన్లు దాఖలయ్యాయని, సీఎం సొంత నియోజకవర్గం కుప్పం, డిప్యూటీ సీఎం నియోజకవర్గాల్లో కూడా వైసీపీ అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేశారని గుర్తుచేశారు.

**అడ్డుకుంటే ఇన్ని నామినేషన్లు సాధ్యమా..**

నామినేషన్ల గణాంకాలను స్వయంగా మీడియా ముందుంచిన పట్టాభిరామ్.. ఎంపీటీసీ పదవులకు మొదటి రోజు మొత్తం 9,829 స్థానాలకు గాను 5,267 నామినేషన్లు పడితే, అందులో టీడీపీ 2,719, గొడ్డలి పార్టీ తరపున 1,918 నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. ప్రభుత్వం అడ్డుకుంటే తొలిరోజే 1,918 నామినేషన్లు ఎలా వేశారో చెప్పాలన్నారు. 659 జెడ్పీటీసీ స్థానాలకు మొదటి రోజు 409 నామినేషన్లు పడితే టీడీపీ 128 దాఖలు చేయగా, గొడ్డలి పార్టీ తరపున టీడీపీ కంటే 64 ఎక్కువగా 192 నామినేషన్లు ఫైల్ అయ్యాయని స్పష్టం చేశారు. ఇంత భారీగా నామినేషన్లు వేసి కూడా దాడులు చేస్తున్నారంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. 2020-21 వైసీపీ పాలనలో స్థానిక ఎన్నికల సమయంలో కేంద్ర హోం శాఖకు నాటి ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ లేఖ రాస్తూ.. 25 శాతం ఎంపీటీసీలు (2,362 స్థానాలు), 20 శాతం జెడ్పీటీసీలు (126 స్థానాలు) బలవంతపు ఏకగ్రీవాలు చేశారని, తన ప్రాణాలకు రక్షణ కావాలని కోరింది నిజామా కాదా అని జగన్మోహన్ రెడ్డిని నిలదీశారు. నాడు ఎన్నికల కమిషన్ ఎందుకు? ప్రభుత్వమే నిర్వహించుకుంటుంది.. అన్న జగన్ రెడ్డి, నేడు ఏ ముఖం పెట్టుకుని ఎన్నికల సంఘం మెట్లు ఎక్కుతున్నారని ప్రశ్నించారు.

**వైసీపీ తప్పుడు ప్రచారం**

సుప్రీంకోర్టు ఉత్తర్వులను సైతం వక్రీకరిస్తూ ఎన్నికలు వాయిదా పడ్డాయని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. పిటిషనర్ ఇచ్చిన వినతిపత్రాలను పరిశీలించి ఎన్నికల కమిషనే స్వయంగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశించిందని ఆర్డర్ కాపీని ప్రదర్శించారు. కోర్టు ఆదేశాల మేరకు అభ్యర్థుల తుది జాబితా ప్రకటనకు రెండు రోజుల గడువు తీసుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం సంపూర్ణంగా గౌరవిస్తుందని, స్వాగతిస్తుందని తెలిపారు. సొంత చెల్లి కుమార్తె వివాహాన్ని కూడా ఓర్చుకోలేక తాడేపల్లి ప్యాలెస్ గేట్లు మూసేసిన సంకుచిత మనస్తత్వం జగన్‌దని, వేసిన రోడ్లను సైతం తవ్వేసే సైకో పార్టీకి ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో ఓట్లు వేయరని తేల్చిచెప్పారు. పోలీసులు అమరవీరుల దినోత్సవం వేళ సీఎం ఆదేశించినట్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తాట తీస్తారని హెచ్చరించారు. 'పీకలు కోస్తాం' అంటూ బెదిరింపులకు దిగిన రాచమల్లు శివప్రసాద్ రెడ్డి లాంటి వారిపై పార్టీ తరపున ఈసీకి ఫిర్యాదు చేశామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపాలిటీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పంచాయతీల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి గొడ్డలి పార్టీకి శాశ్వత సమాధి కట్టాలని ప్రజలకు పట్టాభిరామ్ విజ్ఞప్తి చేశారు.

చైతన్యరథం

# పాలకొల్లులో వైసీపీకి మరో షాక్

- టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ, మాజీ ఎంపీటీసీ, పలువురు నేతలు
- ఇటీవలే ఫ్యాన్ కి బైబై చెప్పి, సైకిలెక్కిన 50 కుటుంబాలు
- మంత్రి నిమ్మల పనితనానికి ఫిదా అయ్యామంటూ కితాబు



పాలకొల్లు (చైతన్యరథం): పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. రెండు రోజుల క్రితం చింతపర్రు గ్రామంలో 50కిపైగా కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరగా, తాజాగా పాలకొల్లు మండల మాజీ ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, మాజీ ఎంపీటీసీ చిట్టూరి ఏడుకొండలుతో పాటు పలువురు నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పాలకొల్లులోని మంత్రి కార్యాలయం వద్ద గురువారం మంత్రి నిమ్మల రామానాయుడు సమక్షంలో వారు పసుపు కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా కనకలక్ష్మి, ఏడుకొండలు దంపతులకు పార్టీ కండువాలు కప్పి మంత్రి నిమ్మల టీడీపీలోకి ఆహ్వానించారు.

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మంత్రి నిమ్మల రామానాయుడు పనితీరుకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు ఏడుకొండలు తెలిపారు. వైసీపీలో సుమారు 16 ఏళ్లపాటు కష్టపడి పనిచేసినా తగిన గుర్తింపు లభించలేదని, ఆక్వా వ్యాపారాన్ని సైతం వదులుకొని ఆర్థికంగా నష్టపోయానని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు, పాలకొల్లు అభివృద్ధికి మంత్రి చేస్తున్న కృషిని గుర్తించి టీడీపీలో చేరినట్లు వెల్లడించారు. పార్టీ సీనియర్ నాయకులు, కూటమి శ్రేణులను కలుపుకొని పనిచేస్తానన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, వైసీపీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఏడుకొండలు, కనకలక్ష్మి దంపతులు టీడీపీలో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు గత రెండున్నరేళ్లలో కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని నిధులు సాధించి గ్రామాలు, పట్టణ వార్డుల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేలా అహర్నిశలు పనిచేస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలనను చూసి వైసీపీ నాయకులు టీడీపీలో చేరడం శుభపరిణామమన్నారు.

మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ, వైసీపీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లభించకపోగా, పార్టీ కారణంగా ఆర్థికంగా నష్టపోయిన ఏడుకొండలు దంపతులు టీడీపీలో చేరడం సమంజసమన్నారు. కనకలక్ష్మి మాట్లాడుతూ తాను ఎవరినీ విమర్శించదలచుకోలేదని, వైసీపీలో తగిన గౌరవం లభించకపోవడంతో పాటు ఎంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు టీడీపీ అధ్యక్షుడు పాముల రజనీకుమార్, నాయకులు మేడిద డేవిడ్ జాన్‌రాజు, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి పెద్దిరాజు, కడలి గోపాలరావు, ఆరుమిల్లి చిన్ని, బోనం నాని, పొట్టూరి శ్రీనివాస్, బిరుదుకోట శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్లు అడ్డుకున్నారంటూ గొడ్డలిపార్టీ దొంగ ఏడుపులు

- ఓటమి భయంతోనే వైసీపీ నాయకుల విధ్వంసం
- రాష్ట్రంలో అల్లర్లకు తాడేపల్లి ప్యాలెస్ నుంచే వ్యూహ రచన
- రాష్ట్రంలో అన్నిచోట్ల ప్రశాంతంగా నామినేషన్లు
- పెద్దిరెడ్డి, చెవిరెడ్డి, అవినాష్ రెడ్డి ఉన్న చోట్లే అల్లర్లు ఎందుకు?
- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



అమరావతి (చైతన్యరథం): స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతో ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో గొడ్డలిపార్టీ అల్లర్లు, అలజడులు సృష్టిస్తోందని శ్రీకాకుళం జిల్లా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆరోపించారు. ఒకవైపు నామినేషన్లను అడ్డుకుంటున్నారని దొంగ ఏడుపులు ఏడుస్తూనే మరోవైపు కూటమి పార్టీలకు పోటీగా అన్ని చోట్ల నామినేషన్లు వేస్తున్నారని పేర్కొన్నారు. ఓటమి భయంతో ఇలాంటి నీచ రాజకీయాలు చేయటం ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అన్నిచోట్ల ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ జరుగుతుంటే కేవలం దర్శి, పుంగనూరు, రాయచోటి, కడప, పులివెందుల వంటి ప్రాంతాల్లోనే అల్లర్లు జరగడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. ఇక్కడ గొడవలకు కారణం వైసీపీ నేతలు మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు అవినాష్ రెడ్డి, మిథున్ రెడ్డి ముఠాలేనని ఘాటుగా విమర్శలు గుప్పించారు. ఆ ఆకృత్యాలు కూటమి ప్రభుత్వంలో చెల్లవని.. శాంతి భద్రతల విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఎక్కడా తగ్గరని స్పష్టం చేశారు.

**వైసీపీ దొంగ ఏడ్పులు**

వైసీపీ నాయకులు 19 చోట్ల వారిని నామినేషన్లు వెయ్యినియ్యలేదు అంటున్నారు. అభ్యర్థుల తుదిజాబితాలు వెల్లడయ్యాక నిజానిజాలు బయట పడతాయి. వైసీపీ దొంగ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి వైసీపీకి బుద్ధి చెప్పడం ఖాయం. రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లకు తాడేపల్లి ప్యాలెస్, బెంగళూరు ప్యాలెస్ నుంచి స్క్రిప్ట్ వస్తోంది.

వైసీపీ హయాంలో స్థానిక ఎన్నికల్లో జరిగిన అరాచకాలను ప్రజలు మర్చిపోలేదు. మాచర్లలో టీడీపీ నేతలు బుద్దా వెంకన్న, బొండా ఉమాపై తురక కిషోర్ అనే వ్యక్తి ఇనుప రాడ్డతో చేసిన హత్యాయత్నంలో వారు త్రుటిలో తప్పించుకున్నారు. నామినేషన్లు వేయడానికి వెళ్తున్న మహిళల చీరలను లాగేసిన ఘటనలు చూశాం. ఆ రోజు పుంగనూరులో అంజిరెడ్డి తాతను ఇబ్బంది పెడితే ధైర్యంగా పోరాడి మా కార్యకర్తలకు స్ఫూర్తిని నింపారని శిరీష గుర్తుచేశారు.

**కోర్టు తీర్పులను సైతం వక్రీకరిస్తున్నారు**

మున్సిపల్ ఎన్నికలను ఆపేసిందంటూ సుప్రీంకోర్టు తీర్పును వక్రీకరించి వైసీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఒకటి రెండు రోజుల వ్యవధిలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరుగుతాయి. దొంగ ఏడుపులు ఏడుస్తూ ఎన్నికలకు అడ్డుపడుతున్న వైసీపీ నాయకుల తీరును ప్రజలు అర్థం చేసుకోవాలి. స్థానిక ఎన్నికలను జరగనీయకుండా చేసి 16వ ఆర్థిక సంఘ నిధులు అడ్డుకోవాలని జగన్మోహన్ రెడ్డి చూస్తున్నారు.

దేశాభివృద్ధికి మూలమైన పంచాయతీల అభివృద్ధిని అడ్డుకునేందుకు జగన్ బ్యాచ్ విశ్వప్రయత్నాలు చేస్తోంది. సర్, రిజర్వేషన్లు, నామినేషన్లు ఇలా అనేక వాటిపై కేసులు వేశారు. వైసీపీ కేసులను సమర్థంగా ఎదుర్కొంటాం. అనుకున్న సమయానికే ఎన్నికలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వ నిధులను కాపాడుకుంటామని ఎమ్మెల్యే శిరీష విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఆడలేక మద్దెల ఓడు.. అన్నట్లుగా వైసీపీ వికృత చేష్టలు

- గ్రామాల అభివృద్ధిని అడ్డుకునేందుకు గొడ్డలిపార్టీ కుట్రలు
- 16వ ఆర్థికసంఘం నిధులు రాకుండా చేసేందుకు పన్నాగాలు
- స్థానిక ఎన్నికలను అడ్డుకోవడానికి 56 పిటిషన్లు
- సుప్రీంకోర్టు తీర్పునూ వక్రీకరించి ప్రచారం
- ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

అమరావతి (చైతన్యరథం): రాజ్యాంగబద్ధంగా రాష్ట్రానికి రావలసిన 16వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.12,500 కోట్లు త్వరగా వచ్చేలా చేసి గ్రామాలు, పురపాలక సంఘాల అభివృద్ధికి ఉపయోగపడేలా ఈ ఎన్నికలను ప్రశాంతంగా, కట్టుదిట్టమైన భద్రతా చర్యలతో నిర్వహించాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పమని గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్రకార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే అనేక చోట్ల నామినేషన్లు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. అయితే "ఆడలేక మద్దెల ఓడు" అన్నట్టు వైసీపీ పార్టీ వికృత చేష్టలకు పాల్పడుతూ ఇప్పటికే 56 లిటిగేషన్ పిటిషన్లు వేసి స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవాలని ప్రయత్నిస్తోంది. ఎన్నికలను వాయిదా వేయరాదని సుప్రీంకోర్టు స్పష్టంగా తీర్పు ఇచ్చిన తర్వాత కూడా ఇద్దరు ఎంపీలు అవినాష్ రెడ్డి, మిథున్ రెడ్డి మూడు జిల్లాల్లో దౌర్జన్యకర సంఘటనలకు పాల్పడుతున్నారు. బెంగళూరు, పంజాబ్ నుంచి రౌడీలను తీసుకొచ్చి ఓటర్లపై బలప్రయోగం చేయడం ఏమాత్రం సబబు కాదు. 26 జిల్లాల్లో 23 జిల్లాల్లో ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ సాగుతుండగా కేవలం ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లోనే హింస జరగడం యాదృచ్ఛికం కాదు. ఇది వైసీపీ నాయకుల ప్రోద్బలంతోనే జరుగుతోందని ప్రజలు గ్రహించారు. దీనికి జగన్మోహన్ రెడ్డి సూటిగా సమాధానం చెప్పాలని రామాంజనేయులు డిమాండ్ చేశారు.

**గతం మరిచి నీతులు**

గతంలో వైసీపీ హయాంలో స్థానిక ఎన్నికల సందర్భంగా టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు చించివేసిన విషయం ప్రజలు మర్చిపోలేదు. నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గమైన కుప్పం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురంలో వైసీపీ నాయకులు స్వేచ్ఛగా నామినేషన్లు వేశారు. మేము అడ్డుకోలేదు. అయినా వారే అల్లర్లు సృష్టించుకొని పోలీసులు, ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారు.



2020-21 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ పాలనలో 322 అక్రమ కేసులు, 1,045 బలవంతపు నామినేషన్ ఉపసంహరణలు, 182 ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు, 3 హత్యలు, 48 హత్యాయత్నాలు, 160 దాడులు, 48 కిడ్నాప్‌లు, 241 బెదిరింపులు, 118 ఆస్తుల విధ్వంసం ఘటనలు జరిగాయి. పుంగనూరులో 85కి 84, మాచర్లలో 77కి 74, పూతలపట్టులో 52కి 46, తంబళపల్లెలో 102కి 30, శ్రీకాళహస్తిలో 121కి 71, చంద్రగిరిలో 72కి 34, పులివెందులలో 108కి 90, బనగానపల్లెలో 102కి 46 బలవంతపు ఏకగ్రీవాలు జరిగాయి. ఈ ఎనిమిది నియోజకవర్గాల్లోనే దాదాపు 476 బలవంతపు ఏకగ్రీవాలు జరిగాయి. వీటిపై అప్పటి స్టేట్ ఎలక్షన్ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్.. కేంద్ర హోం శాఖకు లేఖ రాసి వైసీపీ దౌర్జన్యాలు, హింస కారణంగా ఎన్నికలు ప్రమాదంలో పడ్డాయని, కలెక్టర్లు, ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలపై ఒత్తిడి తెచ్చారని, తనకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 2014లో టీడీపీ పాలనలో ఏకగ్రీవాలు చాలా తక్కువగా ఉండగా 2021లో వైసీపీ పాలనలో భారీగా పెరిగాయని ఆ లేఖలోనే ఉదాహరించారన్నారు. నేడు ఆళ్లగడ్డలో దళితులను వైసీపీ నేత సుధాకర్‌రెడ్డి కులాల పేర్లతో తిట్టినా ఈ పార్టీ నాయకత్వం చర్యలు తీసుకోలేదు. గతంలో దళిత యువకులపై జరిగిన దాడుల్లోనూ వైసీపీ ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకోలేదు. దాడులు చేసినవారికి పదవులు, ఊరేగింపులు ఇచ్చిన చరిత్ర ఉంది. ప్రజాస్వామ్యం గురించి, బలహీన వర్గాల గురించి మాట్లాడే ముందు మీ గత చరిత్రను గుర్తు చేసుకోండి. ఇప్పుడు ప్రశాంతంగా జరుగుతున్న ఎన్నికలను అడ్డుకోవడం అంటే రాష్ట్ర అభివృద్ధిని, 16వ ఫైనాన్స్ నిధులను, గ్రామీణ ప్రజల మౌలిక వసతులను అడ్డుకోవడమే. కూటమి ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలుగా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గమనించి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు అఖండ మెజారిటీ ఇవ్వాలని కోరుతున్నాను. అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలను ప్రజలు తప్పకుండా తిరస్కరిస్తారని ఎమ్మెల్యే రామాంజనేయులు స్పష్టం చేశారు.

# పథకం ప్రకారమే వైసీపీ విధ్వంసం

- ఆర్గనైజ్డ్ క్రైమ్‌తో స్థానిక ఎన్నికలు ఆపడమే గొడ్డలి పార్టీ లక్ష్యం
- ఓటమి ఖాయమనే ఫ్రస్టేషన్‌లో అల్లర్లు
- కేవలం వైసీపీ ఫ్యాక్షన్ ముఠాలు తిష్టవేసిన ప్రాంతాల్లోనే హింస
- టీడీపీ సీనియర్ నేత ఎస్‌వీఎస్ఎన్ వర్మ



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో స్థానిక ఎన్నికల కోడ్ కూయగానే వైఎస్ జగన్ రెడ్డి గుండెల్లో వణుకు మొదలైందని, ప్రజల తిరుగుబాటును చూసి తట్టుకోలేక ఎన్నికలను ఏదో ఒక రకంగా ఆపేందుకు గొడ్డలి పార్టీ కుట్రలు పన్నుతోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ ధ్వజమెత్తారు. ఆర్గనైజ్డ్ క్రైమ్ ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే జగన్ అండ్ కో అసలు నైజమని మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలంతా ప్రస్తుత పరిస్థితులను లోతుగా గమనించాలని కోరారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అడ్డుకోవడానికి వైకాపా ముఠా విశ్వప్రయత్నాలు చేస్తోంది. దీని వెనుక ఉన్న అసలు కారణం స్పష్టంగా కనిపిస్తోంది. బూత్‌ల స్థాయిలో గతంలో చేసిన ట్యాంపరింగ్ బండారం బయటపడుతుందని, చనిపోయిన వ్యక్తుల పేర్లతో దొంగ ఓట్లు వేయించుకునే దుర్మార్గం ఇక సాగదని, యథేచ్ఛగా రిగ్గింగ్ చేయడం సాధ్యం కాదని జగన్ రెడ్డికి బాగా తెలుసు. అందుకే ఓటర్ల జాబితా ప్రక్షాళనను చూసి గిలగిలా కొట్టుకుంటున్నారని వర్మ మండిపడ్డారు.

గ్రామీణ ప్రాంతాలు స్వయం సమృద్ధి సాధించకుండా, స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా, పంచాయతీలకు నిధులు రాకుండా అడ్డుకునేందుకు వైకాపా నాయకులు కోర్టుల్లో ఏకంగా 59 కేసులు వేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. బడుగు, బలహీన వర్గాల రాజకీయ ఎదుగుదలను మొదటి నుంచీ అణచివేయడమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నైజం. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని వారి హక్కులను కాలరాసింది జగన్ కాదా? కానీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మొదటి నుంచీ బీసీల పక్షపాతిగా నిలిచారు. ఎంతో చిత్తశుద్ధితో స్థానిక సంస్థల్లో సైతం బీసీలకు 34 శాతానికి పైగా స్థానాలు కేటాయించి, వారిని చట్టసభలు, స్థానిక పాలనలో అగ్రపీఠాన నిలబెట్టిన ఘనత ముమ్మాటికీ తెలుగుదేశం పార్టీదేనని వర్మ స్పష్టం చేశారు.

### ఉనికి కోసమే గొడ్డలి పార్టీ హింసాకాండ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం పూర్తిగా అడుగంటింది. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన తీరును చూసిన ప్రజలు ఆ పార్టీని పూర్తిగా మరిచిపోతున్నారు. దీంతో ఉనికి కోల్పోతామనే భయంతో దాడులకు దిగుతూ వార్తల్లో నిలిచేందుకు తాపత్రయపడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడ చిన్న గొడవ జరిగినా, ఎక్కడ హింస చెలరేగినా అది పక్కా ప్లాన్ ప్రకారం స్థానిక ఎన్నికలు ఆపేందుకు వైకాపా పన్నుతున్న వ్యూహంలో భాగమేనని ప్రజలు స్పష్టంగా గ్రహిస్తున్నారు. రాష్ట్రం మొత్తం ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగుతుంటే.. కేవలం గొడ్డలి పార్టీ రౌడీలు, ఫ్యాక్షన్ ముఠాలు తిష్టవేసిన రాయలసీమలోని 15 సమస్యాత్మక ప్రాంతాలు, ప్రకాశం, పల్నాడు ప్రాంతాల్లో మాత్రమే ఎందుకు హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయి? ఇది ముమ్మాటికీ ఆర్గనైజ్డ్ క్రైమ్ కాదా? విచిత్రమేమిటంటే ఎన్నికల సంఘం ఏర్పాట్లను, ప్రక్రియను వైసీపీ సీనియర్ నేత కోన రఘుపతి బహిరంగంగా ప్రశంసిస్తుంటే.. జగన్ పెంపుడు మూకలు మాత్రం కావాలనే ఎన్నికల వ్యవస్థపై విషం చిమ్ముతూ దురుద్దేశపూర్వకంగా మాట్లాడుతున్నారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వైకాపా చేసిన దుర్మార్గాలు ఎవరూ మరిచిపోలేదు. టీడీపీ అభ్యర్థులను భయపెట్టి, వారి ఇళ్లపై దాడులు చేసి, పోలీసులతో అక్రమ కేసులు బనాయించి వెయ్యికి పైగా నామినేషన్లను బలవంతంగా ఉపసంహరింపజేశారు. పుంగనూరు, తంబళ్లపల్లె, చంద్రగిరి, పులివెందుల, మాచర్ల, శ్రీకాళహస్తి వంటి మున్సిపాలిటీల్లో ప్రత్యర్థుల నామినేషన్ పత్రాలను చింపేసి, అడ్డగోలు దాడులతో బలవంతపు ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర ఈ గొడ్డలి ముఠాది. పిఠాపురంలో నడిరోడ్డుపై బ్యాలెట్ బాక్సులను ఎత్తుకెళ్లి ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేసిన ఘటన చరిత్రలోనే చీకటి రోజుగా వర్మ అభివర్ణించారు.

### వైసీపీ బరితెగింపు

తాజాగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో నామినేషన్ల దాఖలు చేసేందుకు వెళ్లే అభ్యర్థి వెంట కేవలం ముగ్గురికి మాత్రమే అనుమతి ఉంటే, వైసీపీ వాళ్లు మాత్రం ఏకంగా 500 మంది గూండాలను వెంటేసుకుని వచ్చి సామాన్య ప్రజలపై, విధుల్లో ఉన్న పోలీసులపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి సోదరుడే స్వయంగా వీధుల్లోకి వచ్చి గూండాయిజం చేస్తూ దాడులకు తెగబడటం సిగ్గుచేటు. అధికారం కోల్పోయినా వైకాపా నేతల ఫ్యాక్షన్ బుద్ధి, బరితెగింపు ఏమాత్రం తగ్గలేదని.. విధుల్లో ఉన్న పోలీసు అధికారులపై మాజీ మంత్రి ఆర్.కె. రోజా దురుసు ప్రవర్తన, దౌర్జన్యం తీవ్ర ఖండనీయమని ధ్వజమెత్తారు. ఎన్నికల నిబంధనలు, చట్టబద్ధమైన ఆదేశాలను అమలు చేస్తున్న పోలీసు సిబ్బందిపై చిందులు తొక్కడం, బెదిరింపులకు దిగడం వైకాపా గూండా మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇలాంటి ఫ్యాక్షన్ రాజకీయాలు, గూండా సంస్కృతిని రాష్ట్ర ప్రజలు ఇక ఏమాత్రం సహించబోరు. జగన్ రెడ్డి చీకటి కుట్రలను ప్రజలు ఇప్పటికే గుర్తించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగాల్సిందే. అశాంతిని సృష్టించే వైకాపా మూకలపై ఎన్నికల సంఘం, పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజల తిరుగుబాటు ముందు గొడ్డలి పార్టీ కుట్రలు కొట్టుకుపోవడం, ప్రజాస్వామ్యం గెలవడం ఖాయమని వర్మ స్పష్టం చేశారు.

# ప్రజల మద్దతు కరువు.. హింసనే నమ్ముకున్న వైసీపీ

- స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు గొడ్డలిపార్టీ కుట్రలు
- రాష్ట్రమంతా నామినేషన్లు ప్రశాంతం, వైసీపీ ప్రాబల్య ప్రాంతాల్లోనే అల్లర్లు
- ఈ విధ్వంసం వెనుక ఉన్నదెవరో అందరికీ తెలుసు
- పుంగనూరు, తంబళ్లపల్లె, సదుం, చౌడేపల్లి ప్రాంతాల్లో టీడీపీ క్యాడర్‌పై దాడులు
- చౌడేపల్లిలో టీడీపీ వాహనాల ధ్వంసం, నిప్పంటించడం అత్యంత దుర్మార్గం
- మార్కాపురం, కనిగిరి, ఎర్రగొండపాలెంలో విధుల్లో ఉన్న పోలీసులపై దాడులు దారుణం
- బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం
- ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్, నీలాయపాలెం విజయ్ కుమార్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు సృష్టిస్తున్న అరాచకాలు, హింసాత్మక ఘటనలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్, నీలాయపాలెం విజయ్ కుమార్ అన్నారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల మద్దతు లేకపోవడంతో భయభ్రాంతులు సృష్టించి ఎన్నికలను ప్రభావితం చేయాలనే దురాలోచనతో వైసీపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

పుంగనూరు నియోజకవర్గంలో ఎంపీ మిథున్ రెడ్డి నేతృత్వంలో మొదలైన అరాచకాలు చౌడేపల్లి, సదుం, తంబళ్లపల్లి, కనిగిరి, ఎర్రగొండపాలెం, మార్కాపురం వంటి ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. చౌడేపల్లిలో టీడీపీ కార్యకర్తల వాహనాలు ధ్వంసం చేసి నిప్పంటించడం, విచక్షణారహితంగా దాడులు చేయడం, తంబళ్లపల్లిలో పెట్రోల్ బాంబులు విసరడం, సదుం మండలంలో టీడీపీ అభ్యర్థి పవన్ కుమార్ రెడ్డిపై సుధీర్ రెడ్డి (ఎమ్మెల్యే పెద్దిరెడ్డి బంధువు) నేతృత్వంలో రక్తం కారేలా దాడి చేసి గాయపరచడం వంటి ఘటనలు జరిగాయి. కనిగిరి, ఎర్రగొండపాలెంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులపై, ఎన్నికల అధికారులపై దాడులు జరిగాయి. ఇవన్నీ కేవలం వైసీపీ బలం ఉన్న కొన్ని నియోజకవర్గాలకు (పుంగనూరు, పులివెందుల, రాయచోటి, రాజంపేట, కడప ప్రాంతాలు) పరిమితమై ఉన్నాయి. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో నామినేషన్ ప్రక్రియ అత్యంత ప్రశాంతంగా సాగుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో దాదాపు 23,000కు పైగా నామినేషన్లు దాఖలైతే అందులో సుమారు 8,700కు పైగా వైసీపీ అభ్యర్థులవే. ఒక పక్క నామినేషన్లు వేస్తూనే మరోక పక్క హింసను మాత్రం మానటం లేదు. ప్రజల మద్దతు లేదు కాబట్టి హింసే ఆయుధం అనే విధానాన్ని వైసీపీ నమ్ముకున్నట్లు స్పష్టమవుతోందని విజయ్ కుమార్ విమర్శించారు.

### అధికారం కోల్పోయినా..

2021లో వైసీపీ పాలనలో స్థానిక ఎన్నికల్లో జరిగిన అరాచకాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అప్పుడు అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ వారిని నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నట్లే, ఇప్పుడు అధికారం కోల్పోయినా వైసీపీ నేతలు అదే ధోరణి కొనసాగిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి లాంటి నాయకులు పోలీసులను హెచ్చరిస్తూ రక్త కన్నీళ్లు చూస్తాను అని మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు పూర్తి విరుద్ధం. వైసీపీ నేత, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి స్వయంగా నామినేషన్ ప్రక్రియ చాలా ప్రశాంతంగా సాగుతోందని చెప్పారు. దీన్ని బట్టి ఒక విషయం స్పష్టమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా నామినేషన్లు వేస్తుంటే.. కేవలం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే జరుగుతున్న అల్లర్లు వైసీపీ కావాలని సృష్టిస్తున్నవి మాత్రమే. వీటి ద్వారా సుప్రీంకోర్టు దాకా విషయాన్ని తీసుకెళ్లి ఎన్నికలను వాయిదా వేయించాలనే దురాలోచన స్పష్టంగా కనిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ ఈ హింసాత్మక ఘటనలను తీవ్రంగా ఖండిస్తోంది. ఎన్నికల సంఘం ఇప్పటికే నివేదికలు స్వీకరించి చర్యలు చేపట్టింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 19 ప్రాంతాల్లో అసెస్‌మెంట్ జరుగుతోంది. హింస వెనుక ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, శాంతిభద్ర తలను కాపాడాలని కోరుతున్నాం. ప్రజలు ఈ కృత్రిమ అల్లర్లను పట్టించుకోకుండా ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించాలి. ప్రజాస్వామ్య బద్ధంగా, అభివృద్ధి, మంచి పాలన కోసం పని చేసే శక్తులకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. 2021లాంటి అన్యాయాలు, అరాచకాలు ఈసారి జరగనీయం. స్థానిక ఎన్నికలు అత్యంత పకడ్బందీ గా, నిష్పక్షంగా జరిపించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని విజయ్ కుమార్ స్పష్టం చేశారు.



## సీఎస్ సాయి ప్రసాద్ పదవీకాలం మరో 6 నెలలు పొడిగింపు

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జీ సాయి ప్రసాద్ పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ, సిబ్బంది, శిక్షణ విభాగం (డీఓపీటీ)ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు సీఎస్ పదవీ కాలాన్ని 2027 మే 31 వరకూ కేంద్రం పొడిగించింది. 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సాయి ప్రసాద్ ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తుండగా ఇప్పటికే గత జూన్ 1 నుండి నవంబరు 30 వరకూ 6 నెలలు ఆయన పదవీ కాలాన్ని పొడిగించగా వచ్చే నెల 30వ తేదీన ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే సీఎస్ పదవీ కాలాన్ని మరోసారి పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం గత నెల 29న రాసిన లేఖను కేంద్రం ప్రభుత్వం ఆమోదించి ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

చైతన్యరథం

# విధ్వంసం సృష్టించి బాధితుల మాదిరి పెడబొబ్బలు

- అదే గొడ్డలిపార్టీ కపట రాజకీయం
- అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలపై అక్రమ కేసులు.. ఇప్పుడు ప్రజాస్వామ్యం పేరుతో గగ్గోలు
- గంజాయి బ్యాచ్‌లు, రౌడీ మూకలతో ఎన్నికల్లో అల్లర్లు సృష్టించేందుకు కుట్రలు
- బీసీలకు 16,800 రాజకీయ పదవులు దూరం చేసిన వైసీపీ
- కూటమి పాలనలో సామాజిక న్యాయానికి పెద్దపీట
- సంక్షేమం, అభివృద్ధితో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం
- జగన్‌కు మరో అవకాశం అనేది లేదు, రాదు
- మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి ధ్వజం

అమరావతి (చైతన్యరథం): విధ్వంసం సృష్టించి, ఆ తర్వాత బాధితులుగా నటించడమే వైసీపీ రాజకీయమని మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి విమర్శించారు. గురువారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఐదేళ్ల పాలనలో ప్రతిపక్షాలను అణచివేసి, అక్రమ కేసులతో వేధించిన వైసీపీ ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసినా సైకో రెడ్డి రాజకీయ వైఖరిలో మార్పు రాలేదని దుయ్యబట్టారు. జగన్ పాలనలో ఫ్యాక్షన్ రాజకీయాలు, అవినీతి, అక్రమాలను ప్రజలు గమనించి తీర్పు ఇచ్చారని, అయినప్పటికీ ఆయన పాత పద్ధతులనే కొనసాగిస్తున్నారన్నారు. బాబాయి హత్య కేసులో గొడ్డలిని ఎవరు సరఫరా చేశారనే ప్రశ్నకు సమాధానం చెప్పలేని వారు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. ఖూనీ అనే పదాన్ని పదేపదే ప్రస్తావించడం ద్వారా ప్రజలకు వైఎస్ కుటుంబ రక్తచరిత్రని గుర్తుకు చేసుకుంటున్నారు. ప్రపంచం క్వాంటం యుగం వైపు అడుగులు వేస్తూ కొత్త పరిశ్రమలు, ఆధునిక ఉత్పత్తులు, యువతకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగాల కల్పనపై దృష్టి పెడుతుంటే వైసీపీ మాత్రం పాతకాలపు ఫ్యాక్షన్ రాజకీయాలను వదలడం లేదని విమర్శించారు. గతంలో బాంబుల సంస్కృతితో సాగిన రాజకీయాలను ఇప్పుడు కూడా కొనసాగిస్తూ ఎన్నికల సమయంలో అరాచకాలు, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎంపీ మిథున్ రెడ్డికి స్థానిక ఎన్నికలతో సంబంధం ఏమిటని శ్రీదేవి ప్రశ్నించారు. పదిహేను నుంచి ఇరవై కార్లతో కూడిన కాన్వాయ్‌తో నామినేషన్ల సమయంలో పుంగనూరు వచ్చి ఘర్షణలకు కారణమయ్యారని ఆరోపించారు. ఈ ఘటనలో 17 మంది టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయని, మంజునాథ్ అనే అతని చేయి విరిగిందని పేర్కొన్నారు. మోహన్ రెడ్డి, మధురాయల్‌పై దాడి చేసి తలలు పగలగొట్టారని, సోహైల్ భాషాపైకి కారు పోనిచ్చారని గుర్తు చేశారు. ఎవరైనా అడ్డొస్తే నరికేస్తాం, చంపేస్తాం, లేపేస్తాం అనే ధోరణితో వ్యవహరించడం వైసీపీ నాయకుల రాజకీయ భాషగా మారిందని విమర్శించారు. నోరు తెరిస్తే బూతులు మాట్లాడటం, భయభ్రాంతులకు గురిచేయడం ద్వారా ప్రజలకు ఎలాంటి సంకేతాలు ఇస్తున్నారని ప్రశ్నించారు. ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరఫున విద్యావంతులు పోటీ చేస్తుంటే, వైసీపీ తరఫున రౌడీ మూకలు, నేరచరిత్ర ఉన్నవారు బరిలోకి దిగుతున్నారని శ్రీదేవి ఆరోపించారు.



## బీసీలకు పెద్దపీట

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కూటమి 67.6 శాతం సీట్లు కేటాయించిందని తెలిపారు. బీసీలతో పాటు మహిళలకు రాజకీయంగా రాజ్యాధికారం కల్పించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పిస్తున్నామని, డ్వాక్రా మహిళలకు ఆర్థిక స్వావలంబన కోసం వడ్డీలేని రుణాలు అందించామని చెప్పారు. కార్పొరేటర్లు, మేయర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల వంటి స్థానాల్లో బీసీలకు దాదాపు 34 శాతం రిజర్వేషన్లు కల్పించామని శ్రీదేవి తెలిపారు. వైసీపీ హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి 16,800 మంది బీసీలను రాజకీయ పదవులకు దూరం చేశారని విమర్శించారు. తొలుత అన్న ఎన్టీఆర్ బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, 1995లో చంద్రబాబు నాయుడు 34 శాతానికి పెంచి బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని ముందుకు తీసుకెళ్లారని గుర్తుచేశారు. జగన్ పదేపదే ‘నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనారిటీలు’ అంటూ మాట్లాడటాన్ని ప్రస్తావిస్తూ, మాటల్లో సామాజిక న్యాయం చెప్పడం కాకుండా చేతల్లో చూపించాలని శ్రీదేవి హితవు పలికారు. ఐదేళ్లుగా రాజకీయ పదవుల కోసం ఎదురు చూస్తున్న బీసీలకు కూటమి బీ-ఫారాలు ఇచ్చి పోటీకి నిలబెడుతోందని తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే ప్రయత్నాలను అడ్డుకునేందుకు ఆయా ప్రాంతాల్లో వైసీపీ నేతలు గొడవలు సృష్టిస్తున్నారని శ్రీదేవి ఆరోపించారు. వైసీపీ గత పాలనలో స్థానిక ఎన్నికల నిర్వహణను కూడా వివాదాస్పదం చేశారని శ్రీదేవి విమర్శించారు. కరోనా రెండో దశలో పరిస్థితులు తీవ్రంగా ఉన్నప్పుడు ఎన్నికలను వాయిదా వేయాలని నిర్ణయించిన ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌పై వైసీపీ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందని, రాత్రికి రాత్రే ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఆయన పదవిని తొలగించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు.

పుంగనూరు, తంబళ్లపల్లి ప్రాంతాల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి రియల్ ఎస్టేట్, అక్రమ మైనింగ్, అటవీ భూములు, కాంట్రాక్టులు కట్టబెట్టారని శ్రీదేవి ఆరోపించారు. ఈ వ్యవహారాలపై వైసీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి, అతని కొడుకు నామినేషన్ పత్రాలను లాక్కొని చించేసిన ఘటనలను ప్రస్తావిస్తూ, బెంగళూరు నుంచి హడావుడిగా వచ్చి కొద్దిసేపు ఉండి, అసలు బాధితులను పక్కనబెట్టి తామే బాధితులమన్నట్లు జగన్, వైసీపీ నాయకులు మొసలి కన్నీరు కారిస్తే రాష్ట్ర ప్రజలు ఇలాంటి ద్వంద్వ వైఖరిని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బెంగళూరు, పంజాబ్ ప్రాంతాల నుంచి గంజాయి బ్యాచ్‌లను, రౌడీ మూకలను, నేరచరిత్ర ఉన్నవారిని తీసుకొచ్చి తిరుపతి, రాయచోటి, పులివెందుల, పుంగనూరు ప్రాంతాల్లో అల్లర్లు సృష్టిస్తున్నారన్నారు. అనంతరం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని, లేదంటే కేంద్ర బలగాలను దించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారని శ్రీదేవి విమర్శించారు.

## నాటి బీభత్సం మరిచి నీతులు

గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన స్థానిక ఎన్నికల తీరును కూడా శ్రీదేవి ప్రస్తావించారు. 2020లో ఎన్నికల సమయంలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా గ్రామాల్లో కాంక్రీట్ గోడలు నిర్మించలేదా అని ప్రశ్నించారు. గుంటూరు జిల్లాలోని కారంచేడులో సామూహిక రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, సత్తెనపల్లిలో పేదల ఇళ్లను ప్రొక్లెయినర్లతో కూల్చేశారని ఆరోపించారు. అనంతపురం జిల్లాలో సర్పంచ్ భర్తను అడవుల్లోకి తీసుకెళ్లి అన్నంలో పేడ కలిపి పెట్టిన ఘటనను ప్రస్తావిస్తూ, ఇలాంటి చర్యలు శాడిజానికి, సైకో మనస్తత్వానికి నిదర్శనమని విమర్శించారు. తాము చేసిన పనులను ఇతరులపై నెట్టి, బాధితులుగా నటించడం వైసీపీ నాయకుల నైజమన్నారు. వైసీపీ పాలనలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వెయ్యి మందికి పైగా నామినేషన్లు వేసినవారిని ఒత్తిళ్లతో ఉపసంహరించుకునేలా చేశారని, 300కు పైగా అక్రమ కేసులు పెట్టారని శ్రీదేవి ఆరోపించారు. ముగ్గురిని హత్య చేయించారని, 182 కేంద్రాల్లో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని, సుమారు 50 కిడ్నాప్ ఘటనలు జరిగాయని పేర్కొన్నారు. 122 కేంద్రాల్లో ఆస్తుల విధ్వంసం జరిగిందని ఆరోపించారు. ఈ ఘటనలన్నింటికీ బాధ్యత వహించాల్సిన వైసీపీ నాయకులు ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారని ఎద్దేవా చేశారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనబెట్టి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేసినట్లుగా వ్యవహరించి రక్తాలు పారించిన రాజకీయ సంస్కృతిని ప్రజలు గమనించబట్టే వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారని శ్రీదేవి పేర్కొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం కూటమి మంత్రం

ఎన్నికల్లో గెలవాలంటే సంక్షేమం, అభివృద్ధి ద్వారా ప్రజల మద్దతు పొందాలని శ్రీదేవి అన్నారు. భయ భ్రాంతులతో గెలుస్తామని భావిస్తే అది వైసీపీ భ్రమేనని పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ట్రిపుల్ ఇంజిన్ వేగంతో ముందుకు సాగుతోందని, ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టిన తర్వాత 150 రోజుల్లోనే ప్రక్రియను పూర్తి చేసి 16 వేల మందికి పైగా ఉద్యోగాలు కల్పించామని శ్రీదేవి తెలిపారు. రెండో డీఎస్సీని కూడా ప్రకటించామని, దాని ద్వారా మరో రెండు వేలకుపైగా ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ 20 లక్షల ఉద్యోగాల కల్పనకు హామీ ఇచ్చారని, ఇప్పుడు దానికంటే ఎక్కువగా 26 లక్షల ఉద్యోగాల కల్పనకు దోహదపడే పెట్టుబడులను తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. దాదాపు రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాల ద్వారా రాష్ట్రానికి పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు రానున్నాయని వివరించారు. పరిమిత ఉపాధి అవకాశాలకే పరిమితం కాకుండా, ఆధునిక పరిశ్రమలు, క్వాంటం సాంకేతికతకు సంబంధించిన రంగాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తోందని శ్రీదేవి అన్నారు. అమరావతి అభివృద్ధి పనులు, పోలవరం ప్రాజెక్టు, పారిశ్రామిక అభివృద్ధి వేగంగా ముందుకెళ్తున్నాయని తెలిపారు. అమరావతిలో స్టీల్ బ్రిడ్జి, నాలుగు వరుసల రహదారి నిర్మాణం వల్ల సచివాలయం, అసెంబ్లీ, ఐకానిక్ బ్రిడ్జి వైపు ప్రయాణం సులభమవుతుందని శ్రీదేవి చెప్పారు. విజయవాడలోకి వెళ్లకుండానే ప్రయాణ సమయాన్ని తగ్గించుకునే అవకాశం ఏర్పడుతోందన్నారు. గతంలో అమరావతి అభివృద్ధిని విమర్శించిన వైసీపీ నాయకులు ఇప్పుడు జరుగుతున్న పనులను గమనించాలని శ్రీదేవి సూచించారు.

## దేవాలయాల అపవిత్రం

తిరుమల లడ్డూ ప్రసాదం అంశాన్ని ప్రస్తావిస్తూ, దేవుళ్లను, దేవాలయాలను, ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైసీపీ పాలకులు ప్రజల మనోభావాలను దెబ్బతీశారన్నారు. ఇటీవల తిరుమల బ్రహ్మోత్సవాలకు వెళ్లినప్పుడు స్వచ్ఛమైన నెయ్యితో తయారైన లడ్డూ ప్రసాదాన్ని స్వీకరించామని చెప్పారు. దేవుడికి సమర్పించే నైవేద్యం విషయంలో కూడా వివాదాలు సృష్టించినందుకే ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. లక్షలాది మందిని తీసుకొచ్చి పేడ్, గంజాయి బ్యాచ్‌లను తీసుకువచ్చి సీఎం, సీఎం అంటూ నినాదాలు చేయడం ద్వారా జగన్ ముఖ్యమంత్రి అయిపోరని, ప్రజలు ఎన్నుకున్న చంద్రబాబు నాయుడే ముఖ్యమంత్రి అని స్పష్టం చేశారు. సైకోయిజం, శాడిజంతో కూడిన రాజకీయాలను వైసీపీ మానుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతున్నాయని, సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు.

వైసీపీ హయాంలో అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి, రూ.13 వేలు మాత్రమే ఇచ్చారని, కరోనా సమయంలో ఒక సంవత్సరం సాయం అందించలేదని శ్రీదేవి విమర్శించారు. దీనివల్ల ప్రజలకు రూ.96 వేల కోట్ల నష్టం జరిగిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. సామాజిక భద్రత పెన్షన్ల విషయంలోనూ వైసీపీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని శ్రీదేవి విమర్శించారు. మాట తప్పడు, మడమ తిప్పడు అని చెప్పిన జగన్ ప్రతి పథకంలోనూ మాట తప్పుతాడు, మడమ అష్ట వంకర్లుగా తిప్పుతాడని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, దీపం-2 వంటి పథకాలను అమలు చేస్తోందని శ్రీదేవి తెలిపారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.20 వేలు అందిస్తున్నామని, దీపం-2 పథకం కింద అర్హులైన మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం అమలు సాధ్యమేనా అని గతంలో ప్రశ్నించిన వారికి సమాధానంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని శ్రీదేవి అన్నారు. మేనిఫెస్టోలోని హామీలను అమలు చేస్తూ ప్రజలకు ప్రయోజనాలు అందిస్తున్నామని తెలిపారు. పెన్షన్ల నుంచి యువతకు ఉపాధి కల్పన వరకు, పరిశ్రమల స్థాపన నుంచి అభివృద్ధి కార్యక్రమాల వరకు రాష్ట్రం ముందుకు సాగుతోందని చెప్పారు. విజయవాడ ఉత్సవ్ వంటి కార్యక్రమాలను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించామని శ్రీదేవి పేర్కొన్నారు.

నాడు జగన్ రెడ్డి తన శాడియిజంతో చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసినా, ఆ చర్యలతో ఆయన అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని శ్రీదేవి వ్యాఖ్యానించారు. వైసీపీ చేసే ప్రతి తుగ్లక్ చర్య ఆ పార్టీకి నష్టమే కలిగిస్తుందని అన్నారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని శ్రీదేవి తెలిపారు. ప్రజలు సహకరించి, వైసీపీ సృష్టించే భ్రమలకు లోనుకాకుండా ఎన్డీఏ కూటమికి మద్దతు పలకాలని కోరారు. అల్లర్లు, విధ్వంసాలు సృష్టించే మూకలతో పాటు వాటి వెనుక ఉన్న ఫ్యాక్షన్ నాయకులపై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. అభివృద్ధి, సంక్షేమంతో ముందుకెళ్తున్న కూటమి ప్రభుత్వానికి అల్లర్లు సృష్టించాల్సిన అవసరం లేదన్నారు. గతంలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులు, కార్పొరేటర్లకు రూ.5 లక్షల నజరానా ఇస్తామని ప్రకటించిన వైసీపీ, ఇప్పుడు ఎక్కువ ఏకగ్రీవాలు సాధించిన ప్రాంతాలకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇవ్వబోమని చెబుతోందని శ్రీదేవి విమర్శించారు. పులివెందుల, పుంగనూరులో పలుచోట్ల ఏకగ్రీవాలు జరిగిన నేపథ్యంలో ఈ సారి సాధారణ ఎన్నికల్లో జగన్‌రెడ్డి, పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డిలకు టికెట్లు ఉండవా అని శ్రీదేవి ఎద్దేవా చేశారు. కుటుంబ ఆస్తుల వివాదాలు, తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలతో జగన్ వ్యవహరిస్తున్న తీరుపైనా శ్రీదేవి విమర్శలు చేశారు. ఆస్తుల విషయంలో కుటుంబ సభ్యులకే న్యాయం చేయలేని వారు రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. సొంత తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని వారు రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తారో ప్రజలు ఆలోచించాలన్నారు. వైసీపీ నాయకులు వంకర బుద్ధి, మాయమాటలు, గారడీ మాటలు మానుకుని ప్రజలకు మేలు చేసే విధానాలను ప్రకటించాలని హితవు పలికారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌కు ప్రజలు మరో అవకాశం ఇవ్వబోరని, ముఖ్యంగా మహిళలందరూ ఇదే అభిప్రాయంతో ఉన్నారని శ్రీదేవి అన్నారు. ఎన్నికల సమయంలో విధ్వంసాలు, అల్లర్లు సృష్టించకుండా ఎన్నికలు సజావుగా సాగేందుకు వైసీపీ సహకరించాలని కోరారు.

చైతన్యరథం

# రోడ్డు విస్తరణలో పరిహారం ఎగ్గొట్టి బెదిరిస్తున్న అధికారులు

- **కౌలుకిచ్చిన భూమిని కాజేసే యత్నం**
- **మతిస్థిమితం లేని తండ్రిని మోసం చేసి భూమి అక్రమ రిజిస్ట్రేషన్**
- **ప్రభుత్వం ఇచ్చిన స్థలానికే ఎసరు.. కంచె కూల్చి కబ్జా యత్నం**
- **న్యాయం కోసం టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాధితుల వినతులు**
- **అర్జీలు స్వీకరించిన గ్రీవెన్స్ మేనేజర్**

అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి తరలి వచ్చిన ప్రజల నుంచి కార్యాలయ గ్రీవెన్స్ మేనేజర్ అర్జీలు స్వీకరించారు.

తిరుపతి జిల్లా పాకాల మండలం కొనపరెడ్డిపల్లికి చెందిన మురళీ ప్రసాద్ అభ్యర్థిస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం. 744 గ్రామకంఠం భూమిలో హైవే పక్కన సుమారు 3 సెంట్ల స్థలం తమ కుటుంబ ఆధీనంలో ఉందన్నారు. 1940 కాలం నుంచే తమ తండ్రి దివంగత ఈ. వెంకటరామ నాయుడు అక్కడ చిన్న కొట్టు నడుపుతూ జీవనం సాగించేవారు. తండ్రి మరణానంతరం, అంధుడైన తాను, మూగవాడైన తన తమ్ముడు ఇద్దరం ఆ స్థలంలో పశువుల పాక వేసుకుని, కొబ్బరి మొక్కలు పెంచుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. కుక్కలపల్లె - మల్లవరం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఈ స్థలం రోడ్డులోకి వెళ్లింది. అప్పట్లో తహశీల్దార్, సర్వేయర్, వీఆర్వో, హైవే అధికారులు స్వయంగా పరిశీలించి, తమ పేరును నమోదు చేసి 'అవార్డు కార్డు' కూడా మంజూరు చేశారు. అయితే గ్రామంలోని కొందరు స్థానిక వ్యక్తులు అక్రమంగా తప్పుడు పత్రాలు సృష్టించి పరిహారం అందకుండా అడ్డుకున్నారు. పరిహారం ఇవ్వకుండా రోడ్డు పనులు చేపట్టడాన్ని ప్రశ్నించగా, "తప్పకుండా పరిహారం ఇప్పిస్తాం" అని నమ్మబలికి అధికారులు పశువుల పాకను, కొబ్బరి చెట్లను తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. నష్టపరిహారం అందకపోవడంతో స్పందనలో అర్జీ సమర్పించాను. విచారణ పేరుతో కార్యాలయానికి పిలిపించిన స్థానిక రెవెన్యూ అధికారులు, గ్రామకంఠం స్థలానికి రికార్డులు ఎక్కడి నుంచి వస్తాయని అడిగినందుకు దురుసుగా ప్రవర్తించారు. అప్పటి అధికారులు ఇచ్చిన అవార్డు కాపీ, గ్రామస్థుల వాంగ్మూలాలు, ఆధారాలు సమర్పించినప్పటికీ.. "నీకు పరిహారం రాదు, ఏమీ లేదు" అంటూ భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా సంతకాలు తీసుకున్నారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.



గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఉప్పులపాడు గ్రామానికి చెందిన జమ్ముల జయలక్ష్మి విజ్ఞప్తి చేస్తూ..అచ్చంపేట మండలం నిండుజర్ల గ్రామంలో సర్వే నెం. 256-1సి లో సుమారు 2.00 ఎకరాల భూమిని ప్రభుత్వం నుండి 2006లో పొందామన్నారు. 2006 నవంబర్ 17న ప్రభుత్వం పాస్ పుస్తకం మంజూరు చేయగా, 2020 వరకు తన భర్త జమ్ముల నాగేశ్వరరావు సదరు భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నాం. 2022 సంవత్సరంలో ఈ రెండు ఎకరాల భూమిని ఒక వ్యక్తికి కౌలుకు ఇచ్చాము. అయితే సదరు వ్యక్తి ఒక సంవత్సరం మాత్రమే కౌలు చెల్లించి, ఆ తర్వాత నుంచి కౌలు సొమ్ము ఇవ్వకుండా మోసం చేస్తున్నాడు. కౌలు డబ్బులు అడిగితే ఇవ్వకపోగా, రెండు ఎకరాల్లో ఒక ఎకరం భూమిని తన పేరిట రాసివ్వాలని డిమాండ్ చేస్తూ తమను బెదిరింపులకు గురిచేస్తున్నాడు. అంతేకాకుండా తమను సొంత పొలంలోకి కూడా అడుగుపెట్టకుండా అడ్డుకుంటున్నారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

చిత్తూరు జిల్లా ఐరాల మండలం భీమినేనివారి పల్లికి చెందిన జమునారాణి విజ్ఞప్తి చేస్తూ.. తన తండ్రి ఎ. కృష్ణం నాయుడుకు తాను ఏకైక కుమార్తెనని తెలిపారు. వివాహం అనంతరం తన కుటుంబంతో జీవిస్తుండగా, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు తన బంధువు ఇంట్లో ఉండేవారు. సుమారు 17 ఏళ్ల క్రితం తన తండ్రి తీవ్ర అనారోగ్యానికి గురై, నడవలేని స్థితికి చేరడంతో పాటు మతిస్థిమితం కూడా కోల్పోయి మంచానికే పరిమితమయ్యారు. ఆ సమయంలో తరచూ వెళ్లి తండ్రి బాగోగులు చూసుకునేవాళ్లం. అయితే తన తండ్రి మానసిక, శారీరక స్థితిని ఆసరాగా చేసుకున్న సదరు బంధువు కుట్ర పన్ని, తన తండ్రి పేరిట ఉన్న 3 ఎకరాల 80 సెంట్ల వ్యవసాయ భూమిని అతడి కుమారురుల పేర్ల మీదకు రహస్యంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ తర్వాత కొద్ది రోజులకే తన తండ్రి మృతి చెందారు. ఈ మోసం గురించి 2026 జనవరిలో తనకి సమాచారం తెలిసింది. దీంతో తహసీల్దార్ కార్యాలయం, మీ-సేవ కేంద్రాల్లో వివరాలు పరిశీలించగా... 1-బి, అడంగల్‌లో ఇప్పటికీ తన తండ్రి కృష్ణం నాయుడు పేరే ఉన్నప్పటికీ, ఈసీలో మాత్రం సదరు బంధువు కుమారుల పేర్లు ఉన్నట్లు బయటపడింది. దీనిపై అతడిని నిలదీయగా తప్పించుకుంటూ కుంటిసాకులు చెబుతున్నారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం ఆర్ కాలనీకి చెందిన లక్ష్మీకాంతమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తన భర్త దివంగత ఇ. శంకర్ రెడ్డి గతంలో చంద్రగిరిలో పాత్రికేయుడిగా సేవలందించారన్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించి గతంలో ప్రభుత్వం చంద్రగిరిలోని మురళీకృష్ణ గుడి వెనుక భాగంలో సర్వే నంబర్ 1977 లో 2 సెంట్ల ఇంటి స్థలాన్ని మంజూరు చేసింది. అయితే 2014 మే 15న తన భర్త ఆకస్మికంగా మృతి చెందారు. భర్త మరణం తర్వాత ఒంటరినైన తనకు ప్రభుత్వం ఇచ్చిన ఆ స్థలానికి రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాం. అయితే స్థానిక కొందరు వ్యక్తులు ఆ కంచెను కూల్చివేసి స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రకాశం జిల్లా కంభం గ్రామానికి చెందిన షేక్ హుమాయున్ విజ్ఞప్తి చేస్తూ.. జీవనోపాధి కోసం గుంటూరు జిల్లా పెదవడ్లపూడి గ్రామానికి వలస వచ్చామని తెలిపారు. భార్య, చిన్న కుమారుడితో కలిసి ఓ చిన్న అద్దె ఇంట్లో ఉంటూ రోజువారీ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. నిరుపేద కుటుంబానికి ఆసరాగా నిలిచే తెల్ల రేషన్ కార్డు కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవడానికి వెళ్లగా, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో మీ వివరాలు కంభంలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న తండ్రి కుటుంబంతో కలిపి ఉన్నాయి. దీంతో తమ కుటుంబానికి రేషన్ కార్డు వర్తించడం లేదని చెప్పారు. గత రెండేళ్లుగా తన కుటుంబాన్ని తండ్రి వివరాల నుండి వేరు చేసేందుకు సచివాలయానికి ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకపోయింది. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# మీరేమైనా మహాత్మా గాంధీ వారసులా?

2020-21లో స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల్లో మీరేమైనా మహాత్మా గాంధీ కుటుంబ వారసులని ప్రజలు స్వచ్ఛందంగా మిమ్మల్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారా ఆనాడు? ఏకగ్రీవం అనేది ప్రజల హృదయాల నుంచి, నాయకుడిపై ఉన్న అపారమైన నమ్మకం నుంచి జరగాల్సిన అద్భుతమైన ప్రక్రియ. ప్రజాబలం ఉంటే ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల్లో గెలిచి చూపించాల్సిన అధికార పార్టీ వైసీపీ నాయకులు చేసిన దురన్యాయాలు, దురాగతాలు ఒకటా.. రెండా? ఆనాడు జగన్ రెడ్డి హయాంలో స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికలు తీరు చూస్తే శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు నానా రకాల కుత్సితాలు, కుతంత్రాలు, బెదిరింపులు, దౌర్జన్యాలు, కొనుగోళ్ళు నిర్లజ్జగా సాగించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని, నిబంధనలను బే ఖాతరు చేస్తూ ధనబలం, అధికార బలం, పోలీసు బలంతో బరి తెగించి ప్రజాస్వామ్య పీక నులిమిన వైసీపీ నాయకులు నేడు తాము ఏదో ఆదర్శంగా పాలించినట్లు, శాంతి కాములుగా నటనా చాతుర్యం ప్రదర్శిస్తూ ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్కడక్కడ జరుగుతున్న సంఘటనలపై ఏదో జరిగిపోతున్నట్లు గగ్గోలు పెడుతున్నారు. ఆనాడు గెలుపే లక్ష్యంగా అధికార పార్టీ వైసీపీ సాగించిన అరాచకం సామాన్యమైనది కాదు. ఆ పార్టీ సృష్టించిన అడ్డంకులు, దాడుల మూలంగా అనేక చోట్ల పంచాయితీ, పురపాలక, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రతిపక్షాలు నామినేషన్ కూడా వెయ్యలేకపోయాయి. బెదిరింపులతో, వేధింపులతో పెద్ద ఎత్తున ఏకగ్రీవాలు చేసుకున్నారు. కొందరు పోలీసులు కూడా ప్రతిపక్ష అభ్యర్థులను పోలీసు స్టేషన్ల కు పిలిపించి నామినేషన్స్ ఉపసంహరింప చేశారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే ఎన్నికల్లో పై చేయి సాధించడం సాధ్యం కాదన్న భయం అధికార పక్షం వైసీపీని వెంటాడింది. అందుకే బెదిరింపులకు, ప్రలోభాలకు, దౌర్జన్యాలకు, నిర్బంధాలకు దిగి భయభ్రాంతులకు గురిచేసారు. రాష్ట్రంలో ఫ్యాక్షనిజం ఇనుప పాదాలకింద ప్రజాస్వామ్యం అణగ దొక్కబడింది. భారత దేశంలో అటువంటి దగాకోరు, దమనకాండ ఎన్నికలను ప్రజలు చూసి వుండరు. రాష్ట్రంలో తమ పార్టీ తప్ప మరొక పార్టీ ఉండకూడదు అన్న విధంగా వ్యవహరించారు వైసీపీ నాయకులు.

2020-2021లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీ-ఎంపీటీసీ-జడ్పీటీసీ- మున్సిపాలిటీలలో భారీగా ఏకగ్రీవాలు జరిగాయి. ఇందులో ప్రతిపక్షాల అభ్యర్థులను బెదిరించి,



బలవంతంగా నామినేషన్లు ఉపసంహరింప జేసి ఏకగ్రీవాలు చేసుకున్నారని రాష్ట్ర ఎన్నికల సంఘానికి, హైకోర్టులో పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశాయి ప్రతిపక్షాలు. ఆనాడు వివిధ స్థాయిల్లో జరిగిన ఏకగ్రీవాల వివరాలు పరిశీలిస్తే 2021 లో మొత్తం 13,097 గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగగా అందులో వైసీపీ ఏకగ్రీవం చేసుకొన్న పంచాయతీలు సర్పంచ్ స్థానాలు 2,197. అంటే 16.77 శాతం స్థానాలు ఏకగ్రీవం చేశారు. మొత్తం 1,31,894 వార్డులలో దాదాపు 48,000 వేలకు పైగా వార్డులు ఏకగ్రీవం చేసుకొన్నారు. నామినేషన్ దాఖలు చేయకుండా అడ్డుకొని, నామినేషన్ పత్రాలను చింపేసారు వైసీపీ నాయకులు. 2020లో ఎంపీటీసీ-జెడ్పీటీసీ ఎన్నికలు జరిగాయి. నామినేషన్ల ఉపసంహరణ సమయంలో బెదిరించి నామినేషన్లు ఉపసంహరింపచేసి అత్యధికంగా ఏకగ్రీవాలు చేసుకొన్నారు అధికార వైసీపీ నాయకులు. ఎంపీటీసీలు మొత్తం 9,800 స్థానాలకు గాను 2,371 స్థానాలను ఏకగ్రీవం చేసుకొన్నారు. జడ్పీటీసీ స్థానాలు మొత్తం 659 స్థానాలకు గాను 126 స్థానాలను ఏకగ్రీవం చేసుకొన్నారు.

2021లో మున్సిపల్, నగరపాలక సంస్థల ఎన్నికల్లో 100కు పైగా ఏకగ్రీవం చేసుకొన్నారు. నాలుగు దశల్లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో వైసీపీ అక్రమాలను ఒకసారి చూస్తే చిత్తూరు జిల్లా పుంగనూరులో 85 పంచాయితీలు వుంటే 85 పంచాయితీలను బలవంతంగా ఏకగ్రీవాలు చేసుకొన్నారు. గుంటూరు జిల్లా మాచర్లలో 77 పంచాయితీలుంటే 74 చోట్ల బలవంతంగా ఏక గ్రీవాలు చేసుకొన్నారు. చిత్తూరు జిల్లా పూతలపట్టులో 152 పంచాయితీలుంటే 46 పంచాయితీలు ఏక గ్రీవం చేసుకొన్నారు. తంబళ్లపల్లిలో 102 పంచాయితీలుంటే 30 ఏకగ్రీవం చేసుకొన్నారు. శ్రీకాళహస్తిలో 121 పంచాయితీలకు 71 ఏకగ్రీవం చేసుకొన్నారు. చంద్రగిరిలో 72 పంచాయితీలకు 34, పులివెందులలో 108 పంచాయితీలుంటే 90, బనగాన పల్లిలో 102 పంచాయితీలుంటే 46 ఏకగ్రీవం చేసుకొన్నారు. ప్రతిపక్షాల పై రాష్ట్ర వ్యాప్తంగా 350 అక్రమ కేసులు బనాయించారు. 190 సార్లు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడ్డారు. 50 హత్యాయత్నాలు జరిగాయి. ముగ్గురిని హత్యచేశారు. 48 కిడ్నాప్ లు, 250 బెదిరింపులు, 120 చోట్ల ప్రజల ఆస్తుల విధ్వంసం చేశారు. ఈ విధంగా దాదాగిరి చేసి పెద్ద ఎత్తున ఏకగ్రీవాలు చేసుకొన్నారు వైసీపీ నాయకులు.

2020-21 స్థానిక ఎన్నికల్లో వైసీపీ నాయకులు చెప్పుకున్న గొప్ప ఏకగ్రీవాలు ప్రజల ఆమోదంతో వచ్చినవి కావు. ఓటమి భయంతో దమన కాండ, దౌర్జన్యంతో రుద్దినవి. వైసీపీ మాత్రమే జనోద్దారక పార్టీ అని, మాకు వేరే పార్టీ వద్దు, మీరే కావాలని ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి మీరు ఏమైనా గాంధీ వారసులా? లేక ప్రజల కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తూ ప్రజలను ఉద్ధరించి త్యాగాలు చేసిన త్యాగధనులా అంటున్నారు ప్రజలు. నిజానికి ప్రజాభిమానంతో జరిగిన ఏకగ్రీవాలు కావవి. నామినేషన్లు వేయడానికి వచ్చిన ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్ పత్రాలు చింపేసి, గొంతుపై కత్తి పెట్టి, పోలీసు స్టేషన్లకు పిలిపించి భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా చేయించుకున్న దౌర్జన్య, దమన కాండ ఏకగ్రీవాలని, జనం ఓటు హక్కును కాలరాసి, తమ పాలన చూసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని గొప్పలు చెప్పుకోవడం, ప్రజాస్వామ్యాన్ని ఏకగ్రీవ వ్యవస్థను పరిహాసం చేయడమే అవుతుంది అంటున్నారు ప్రజలు.

- నీరుకొండ ప్రసాద్

# విశాఖ అభివృద్ధి కూటమితోనే సాధ్యం.. సైకిల్ గుర్తుపై ఓటేసి అభ్యర్థులను గెలిపించండి

**● ప్రచారం చేపట్టిన ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్.నాయుడు**



విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్న తరుణంలో, విశాఖపట్నం మరింత పురోగతి సాధించాలంటే జీవీఎంసీలో కూడా కూటమి పాలనే రావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్.నాయుడు (గణబాబు) స్పష్టం చేశారు. గురువారం విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 77వ వార్డు (చింతలలోవ నుండి దుర్గానగర్ వరకు), అలాగే 78వ వార్డు మల్కాపురంలో ఎన్నికల ప్రచారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 77వ వార్డు కూటమి కార్పొరేటర్ అభ్యర్థిని మజ్జి ప్రమీల, 78వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థిని సత్యాల అనురాధ, అలాగే జీవీఎంసీ మేయర్ అభ్యర్థిని డాక్టర్ ముక్కా శ్రావణికి మద్దతుగా కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ... కేంద్ర సహకారంతో పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని, రాష్ట్రం అగ్రగామిగా మారేందుకు చంద్రబాబునాయుడు నాయకత్వంలో అనేక చర్యలు తీసుకుంటున్నామని గణబాబు తెలిపారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీయే కూటమి అధికారంలో ఉన్నట్లే, జీవీఎంసీలో కూడా కూటమి కార్పొరేటర్లు, మేయర్ ఉంటేనే విశాఖకు అవసరమైన పూర్తిస్థాయి నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు సాధ్యమవుతాయని చెప్పారు.

**పారిశ్రామిక నగరం - ఉపాధి కల్పన:**

పశ్చిమలోని మల్కాపురం, గాజువాక నియోజకవర్గ ప్రాంతాలు రాష్ట్ర ఆర్థిక ఆదాయంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని, గతంలో పరిశ్రమలను తరిమేసిన పరిస్థితుల నుంచి నేడు మళ్లీ భారీ పెట్టుబడులు, అంతర్జాతీయ పరిశ్రమలు విశాఖకు తరలివస్తున్నాయని వివరించారు. కూటమి ప్రభుత్వ చొరవతో రాబోయే కాలంలో యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని హామీ ఇచ్చారు.

**సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా:**

దేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్లను రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000, అవసరమైన రోగులకు రూ.10,000 నుండి రూ.15,000 వరకు పెంచి అందిస్తున్నామని గుర్తుచేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించి 'ప్రయాణ స్వాతంత్ర్యం' ఇచ్చామని, 'తల్లికి వందనం' ద్వారా చదువులకు ఆసరాగా నిలుస్తున్నామని పేర్కొన్నారు.

**యువ నాయకత్వం -ముక్కా శ్రావణికి మద్దతు:**

గత జీవీఎంసీ ఎన్నికల్లో గెలిచి కౌన్సిల్‌లో ప్రజా సమస్యలపై నిలదీసిన పోరాట పటిమ గల డాక్టర్ ముక్కా శ్రావణిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మేయర్ అభ్యర్థిగా ప్రకటించారని, ఆమెతో పాటు స్థానిక కార్పొరేటర్లను గెలిపించి కార్పొరేషన్‌లో కూటమి జెండా ఎగరేయాలని కోరారు.

**అభ్యర్థుల అభ్యర్థన**

ఈ సందర్భంగా 77వ వార్డు అభ్యర్థిని మజ్జి ప్రమీల, 78వ వార్డు అభ్యర్థిని సత్యాల అనురాధ మాట్లాడుతూ, వార్డుల పరిధిలోని డ్రైనేజీ, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలను పరిష్కరించి ఆదర్శ వార్డులుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తమకు సైకిల్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయజయధ్వానాలు చేశారు.

## జీవీఎంసీపై కూటమి జెండా ఎగురవెయ్యాలి: పట్టాభిరామ్



విశాఖపట్నం (చైతన్యరథం): జీవీఎంసీ ఎన్నికల్లో భాగంగా 21వ వార్డు ఆదర్శనగర్‌లో విశాఖ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్ స్థానిక కార్పొరేటర్ అభ్యర్థి కాళ్ల లలిత శంకర్‌తో కలిపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సైకిల్‌కి ఓటు వేయాలని కోరారు, ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ... ఎక్కడ చూసినా కూటమి గాలి వీస్తుందని, కూటమి ప్రభుత్వం చేసిన మంచి మన అభ్యర్థులను గెలిపిస్తుంది అని చెప్పారు, ఈ కార్యక్రమంలో 21వ వార్డు టీడీపీ అధ్యక్షుడు సత్తిబాబు, జనసేన ఇంచార్జి శ్రీనివాస్ పట్నాయక్, నాయకులు వర, రాము, కృష్ణ, పరమేశ్, గోపమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అభ్యర్థులకు ఫారం -ఏ అందజేసిన కిడారి శ్రావణ్

పార్వతీపురం (చైతన్యరథం): రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ నిశాంతికి, పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ వైశాలికి ఫారం–ఏ అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి పార్టీ అధికారిక గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఈ ఫారాలను సమర్పించారు.

# అభివృద్ధి, సంక్షేమ పాలనకు కూటమి ప్రభుత్వం నమూనాగా నిలిచింది

**● విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ 55, 56 వార్డుల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం**



విశాఖపట్నం (చైతన్యరథం): జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 55, 56 వార్డుల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తమ మద్దతు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. తొలుత 56వ వార్డు పరిధిలోని కప్పరాడలో స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో కలిసి కూటమి అభ్యర్థి కొల్లా బత్తుల ప్రసూనకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. ఓపెన్‌టాప్ వాహనంపై నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని, ప్రజలను కలుసుకుంటూ కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అనంతరం 55వ వార్డులో టీడీపీ అభ్యర్థి పుక్కళ్ల లావణ్యతో కలిసి కైలాసపురం సంజీవయ్య కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలను కలిసి కూటమి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ... అభివృద్ధి, సంక్షేమ పాలనకు కూటమి ప్రభుత్వం ఒక నమూనాగా నిలిచిందనిలి అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. నగర అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే జీవీఎంసీలోనూ కూటమి బలపడాలని ఆకాంక్షించారు. విశాఖ మేయర్ అభ్యర్థిగా కూటమి బలపరిచిన డాక్టర్ ముక్కా శ్రావణితో పాటు, 55వ వార్డు అభ్యర్థి పుక్కళ్ల లావణ్య, 56వ వార్డు అభ్యర్థి కొల్లా బత్తుల ప్రసూనలను గెలిపించుకునేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని శ్రీభరత్ పిలుపునిచ్చారు. ప్రజల ఆశీస్సులతో కూటమి అభ్యర్థులు విజయం సాధించి నగర అభివృద్ధికి మరింతగా కృషి చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# జడ్పీటీసీ అభ్యర్థిగా రంపచోడవరం ఎమ్మెల్యే భర్త నామినేషన్



రంపచోడవరం (చైతన్యరథం): పోలవరం జిల్లా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి భర్త మఠం విజయభాస్కర్ జడ్పీటీసీ బరిలో నిలిచారు. రాజవొమ్మంగి జడ్పీటీసీ అభ్యర్థిగా గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఎస్టీ వాల్మీకి తెగకు చెందిన విజయభాస్కర్ తెలుగుదేశం పార్టీలో చురుకుగా ఉన్నారు. పోలవరం జిల్లాలో జడ్పీ ఛైర్పర్సన్ పోస్టును ఎస్టీ మహిళలకు, వైస్ చైర్మన్ పదవిని ఎస్టీ జనరల్కు కేటాయించారు. దీంతో జడ్పీటీసీగా నెగ్గి.. వైస్చర్మన్ పదవిని కైవసం చేసుకోవడానికి విజయ భాస్కర్ ప్రయత్నిస్తున్నారు. ఆయన నామినేషన్ వేసే సమయంలో పక్కన ఎమ్మెల్యే శిరీష దేవి ఉన్నారు.

# కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి : ఎమ్మెల్యే అదితి



విజయనగరం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం బలపరిచిన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఓటర్లను కోరారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలుగా పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థులకు ఆమె బీఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెండేళ్ల కాలంలో అన్ని పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అతి తక్కువ కాలంలో కొట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, కూటమి అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అభ్యర్థి వేచలపు శ్రీనివాసరావు, టీడీపీ కార్యదర్శి పూసపాటి రాజేష్ బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు గంటా పోలినాయుడు, ఎంపీటీసీ అభ్యర్థులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో సీట్లన్నీ గెలుస్తాం : ఎమ్మెల్యే కోండ్రు మురళీ



రాజాం (చైతన్యరథం): స్థానిక ఎన్నికల్లో నూటికి నూరుశాతం రాజాం నియోజక వర్గంతో పాటు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో విజయం సాధిస్తామని, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల సందర్భంగా గురువారం రాజాం పట్టణ పరిధి కొండంపేట జంక్షన్ నుంచి పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవాలయం వరకు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆయన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే కోండ్రు మాట్లాడుతూ.. నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధిని, ప్రజలకు అందిస్తున్న సంక్షేమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మాకు మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని చూపిస్తూ మీ ముందుకు వస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన అంశాల్లో దాదాపు 90 శాతం హామీలను కేవలం ఈ 27 నెలల పరిపాలనా కాలంలోనే విజయవంతంగా అమలు చేశామని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో దేశంలోనే అత్యధికంగా పెట్టుబడులను ఆకర్షించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందన్నారు. దేశంలోకి వచ్చే ప్రతి లక్ష కోట్ల రూపాయల పెట్టుబడిలో ఏకంగా రూ.25,000 కోట్లు (25 శాతం) ఒక్క ఆంధ్రప్రదేశ్కు దక్కడం సరికొత్త రికార్డు అని పేర్కొన్నారు. విశాఖపట్నంలో భారీ డేటా సెంటర్లు, జేఎస్ డబ్ల్యూ స్టీల్ ప్లాంట్, కడప స్టీల్ ప్లాంట్-శ్రీసిటీలో పారిశ్రామిక హబ్ల విస్తరణ, రాయలసీమలో లక్ష కోట్ల రూపాయలతో భారీ 'హార్ద్ కల్చర్ హబ్' వీటన్నింటి ఫలితంగా ఇప్పటికే దాదాపు 9 నుంచి 10 లక్షల ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చాయన్నారు.

## ఆముదాలవలస జడ్పీటీసీ అభ్యర్థిగా తమ్మినేని సుజాత



ఆమదాలవలస (చైతన్యరథం): ఆమదాలవలస మండల కూటమి జడ్పీటీసీ అభ్యర్థిగా తోగారం గ్రామానికి చెందిన తమ్మినేని సుజాత పేరు ఖరారైంది. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆమె పేరును ప్రకటించారు. ప్రస్తుతం ఆమె టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థిత్వం ఖరారు కావడంతో పార్టీ శ్రేణులు తమ్మినేని సుజాతకు అభినందనలు తెలిపారు.

# డ్రగ్స్, గంజాయి మాఫియాతో కాకినాడను సర్వనాశనం చేసిన ద్వారంపూడి

● ఎంతటి మాఫియా శక్తులైనా సరే చట్టం ముందు మోకరిల్లక తప్పదు : ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



కాకినాడ (చైతన్యరథం): వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అరాచకాలు, అక్రమ దందాలపై కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడే కాక, గద్దె దిగాక కూడా డ్రగ్స్, గంజాయి మాఫియాతో కాకినాడ యువత భవితవ్యాన్ని ద్వారంపూడి నాశనం చేశారని మండిపడ్డారు. కొచ్చిలో బయటపడిన భారీ డ్రగ్స్ రాకెట్ వెనుక అసలు సూత్రధారి ద్వారంపూడేనని, ఆయన అనుచరుల ప్రమేయం పక్కాగా ఉందని స్పష్టం చేశారు. డ్రగ్స్ వ్యవహారంలో ఆధారాలతో సహా దొరికిపోయి, సమాధానం చెప్పలేక ప్రజలను పక్కదారి పట్టించే నీచ రాజకీయాలకు తెరతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్వారంపూడి కుటుంబ చరిత్ర మొత్తం బ్లాక్ టికెట్లు, కల్తీ మద్యం, దొంగ నోట్లు, రేషన్ బియ్యం మాఫియాతోనే నిండిపోయిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రేషన్ బియ్యం దొంగ దందాకు అడ్డుకట్ట పడటంతోనే ఇతర రాష్ట్రాలకు పారిపోయి చీకటి వ్యాపారాలు సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాకినాడ పోర్టు పనులపై ద్వారంపూడి చేస్తోన్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టారు. 2024లో 74 నౌకల ద్వారా 28 లక్షల టన్నుల సరుకు రవాణా జరిగితే, కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు 107 నౌకల ద్వారా ఏకంగా 38 లక్షల టన్నుల రవాణా జరిగిందని లెక్కలతో సహా నిరూపించారు. పోర్టు కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించి, ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు పరిహారం ఇచ్చే వ్యవస్థను తీసుకొచ్చామని స్పష్టం చేశారు. తమ కుటుంబానిది కష్టార్జితమని, ఎన్నికల ఖర్చుల కోసం ఆస్తులు అమ్ముకున్న చరిత్ర తమదని తెలిపారు. ద్వారంపూడిలా అక్రమ సంపాదన, దోపిడీ సొమ్ముతో తాము బతకడం లేదని, ఆస్తులపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. జగన్నాథపురం స్పోర్ట్స్ స్టేడియం, మూడో వంతెన, ఫ్లైఓవర్ల నిర్మాణాలను తాము ప్రారంభిస్తే.. గత ఐదేళ్ల ద్వారంపూడి పాలనలో వాటన్నింటినీ నాశనం చేసి పక్కన పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే స్మార్ట్ సిటీ నిధులు తీసుకొచ్చి పాఠశాలలు, మౌలిక వసతుల పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ జాడ్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉక్కుపాదం మోపుతున్నారని హెచ్చరించారు. ప్రత్యేక 'ఈగిల్' బృందాలు రంగంలోకి దిగాయని, ఎంతటి మాఫియా శక్తులైనా సరే చట్టం ముందు మోకరిల్లక తప్పదని గట్టి హెచ్చరిక జారీ చేశారు.

# విజయవాడ ఉత్సవ్ విజేతలకు ఎంపీ కేశినేని బహుమతి ప్రధానం

● విద్యార్థులు, యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయి: ఎంపీ శివనాథ్



విజయవాడ: (చైతన్యరథం): సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో, కేశినేని ఫౌండేషన్ మరియు జిజ్ఞాస ఆర్ట్స్ వర్క్స్ సంయుక్తంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గురువారం రామవరప్పాడు రింగ్ వద్ద సర్వీసు రోడ్‌లో ఉన్న ఎం కన్వెన్షన్ నందు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొని, వివిధ పోటీల్లో విజయం సాధించిన విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా మొత్తం ఏడు విభాగాల్లో వందకు పైగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రతిభావంతులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారిని ఎంపీ కేశినేని చిన్ని అభినందించి, బహుమతులు అందజేశారు.

**ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని మాట్లాడుతూ...** విజయవాడ నగరంలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు, విద్యార్థులు, యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా వివిధ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. విజయవాడ నగరాన్ని సాంస్కృతిక, కళా, క్రీడా రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ, కేశినేని ఫౌండేషన్, జిజ్ఞాస ఆర్ట్స్ వర్క్స్ సంయుక్తంగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పోటీల్లో విజయం సాధించిన వారితో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరూ అభినందనీయులేనని తెలిపారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరిస్తూ, తమ ప్రతిభకు మరింత పదును పెట్టుకోవాలని విజేతలకు సూచించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, విజయవాడ నగరానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజయవాడ ఉత్సవ్ ద్వారా నగర ప్రజలకు వినోదంతో పాటు కళలు, సంస్కృతి, సృజనాత్మకతకు సంబంధించిన అనేక కార్యక్రమాలను అందించగలిగామని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని సతీమణి జానకి లక్ష్మి, సొసైటీ ఫర్ వైబ్రేంట్ విజయవాడ సభ్యులు విజయవాడ ఉత్సవ్ సభ్యులు జిజ్ఞాస ఆర్ట్ వర్స్ సభ్యులు పాల్గొన్నారు.




# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి : టీడీపీ ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి అంటే తెలియజేశామని, స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ అభ్యర్థులను ఆశీర్వదించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ పిలుపునిచ్చారు. గురువారం తూర్పు నియోజకవర్గంలోని ఒకటో డివిజన్లో కూటమి బలపరిచిన మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ, కార్పొరేటర్ అభ్యర్థి కోట పిచ్చిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే నసీర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కు వచ్చిన నాయకులకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గత వైసీపీ పాలనలో నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల కాలంలో రూ.400 కోట్లతో అభివృద్ధి, సంక్షేమాన్ని అందించామని తెలిపారు. కేవలం రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించామని చెప్పారు. ప్రతి సమస్యకూ పరిష్కారాన్ని చూపిస్తున్నామని, ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. గుంటూరు నగరాన్ని అభివృద్ధిలో మోడల్ గా తీర్చిదిద్దేందుకు ముందడుగు వేశామని, రానున్న స్థానిక ఎన్నికల్లో కార్పొరేటర్ అభ్యర్థిగా కోట పిచ్చిరెడ్డిని, మేయర్ అభ్యర్థిగా లక్ష్మీ అపర్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మున్సిపాలిటీలో కూటమికి బలం చేకూర్చడం ద్వారా నగర అభివృద్ధి రెట్టింపు అవుతుందని చెప్పారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు.

# పాలకొల్లులో వైసీపీకి మరో షాక్

●టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ

●ఇటీవలే ఫ్యాన్‌కి బైబై చెప్పి, సైకిలెక్కిన 50 కుటుంబాలు

●నిమ్మల పనితనానికి ఫిదా అయ్యామంటూ కితాబు



పాలకొల్లు (చైతన్యరథం): పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. రెండు రోజుల క్రితం చింతపర్రు గ్రామంలో 50కిపైగా కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరగా, తాజాగా పాలకొల్లు మండల మాజీ ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, మాజీ ఎంపీటీసీ చిట్టూరి ఏడుకొండలుతో పాటు పలువురు నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పాలకొల్లులోని మంత్రి కార్యాలయం వద్ద గురువారం మంత్రి నిమ్మల రామానాయుడు సమక్షంలో వారు పసుపు కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా కనకలక్ష్మి, ఏడుకొండల దంపతులను పార్టీ కండువాలు కప్పి మంత్రి నిమ్మ సత్కరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మంత్రి నిమ్మల రామానాయుడు పనితీరుకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు ఏడుకొండలు తెలిపారు. వైసీపీలో సుమారు 16 ఏళ్లపాటు కష్టపడి పనిచేసినా తగిన గుర్తింపు లభించలేదని, ఆక్వా వ్యాపారాన్ని సైతం వదులుకొని ఆర్థికంగా నష్టపోయానని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు, పాలకొల్లు అభివృద్ధికి మంత్రి చేస్తున్న కృషిని గుర్తించి టీడీపీలో చేరినట్లు వెల్లడించారు. పార్టీ సీనియర్ నాయకులు, కూటమి శ్రేణులను కలుపుకొని పనిచేస్తానన్నారు.

**ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ...** వైసీపీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఏడుకొండలు, కనకలక్ష్మి దంపతులు టీడీపీలో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు గత రెండున్నరేళ్లలో కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని నిధులు సాధించి గ్రామాలు, పట్టణ వార్డుల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేలా అహర్నిశలు పనిచేస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలనను చూసి వైసీపీ నాయకులు టీడీపీలో చేరడం శుభపరిణామమన్నారు.

**మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ...** వైసీపీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లభించకపోగా, పార్టీ కారణంగా ఆర్థికంగా నష్టపోయిన ఏడుకొండలు దంపతులు టీడీపీలో చేరడం సమంజసమన్నారు.

# మాజీ మంత్రి యనమలకు స్వల్ప అస్వస్థత

● ఫోన్‌లో పరామర్శించిన సీఎం చంద్రబాబునాయుడు



తుని (చైతన్యరథం): మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కాకినాడలోని ట్రస్ట్ ఆస్పత్రిలో వైద్య చికిత్స అందిస్తున్నారు. ఇటీవల ఆయనకు గుండె శస్త్రచికిత్స చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో యనమలకు అమర్చిన స్టంట్లో స్వల్ప ఇబ్బందులు రావడంతో అస్వస్థతకు గురైనట్లు సమాచారం. ఆ తర్వాత తిరిగి వైద్యం అందించడంతో యనమల ఆరోగ్యం కుదుటపడింది. ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు ఆయనను తరలించారు. యనమలకు ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

**యనమల ఆరోగ్య పరిస్థితిపై సీఎం చంద్రబాబు ఆరా..**

కాగా, యనమల ఆరోగ్య పరిస్థితిపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. యనమల ఆరోగ్య పరిస్థితి గురించి తనకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సీఎం.. తెలుగుదేశం పార్టీ నేతలను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఎంపీ సానా సతీశ్ ట్రస్ట్ ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. యనమల ఆరోగ్య పరిస్థితి గురించి సీఎంకు సమాచారం అందజేశారు.

## కాకినాడలో ఘోర ప్రమాదం... స్కార్పియో ఢీకొని నలుగురు మృతి

కాకినాడ (చైతన్యరథం): తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శంఖవరం మండలం కత్తిపూడి జాతీయ రహదారిపై స్కార్పియో వాహనం ఢీకొని ఐదుగురు భవానీ భక్తులు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. విజయనగరం జిల్లా డెంకాడ నుంచి భవానీ భక్తులు బస్సులో విజయవాడకు బయలుదేరారు. అయితే, కత్తిపూడిలోని సత్తిబాబు పలావ్ సెంటర్ సమీపంలో బస్సు బ్రేక్‌డౌన్ అయింది. దీంతో టీ తాగేందుకు వారంతా వాహనం నుంచి దిగారు. ఐదుగురు భక్తులు రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా.. వెనుక నుంచి వేగంగా వచ్చిన స్కార్పియో వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో భక్తుడు తీవ్రంగా గాయపడ్డాడు.

# అభివృద్ధి చేతకాని వైసీపీకి ఓటు అడిగే హక్కు లేదు : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

● కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపు



వినుకొండ (చైతన్యరథం): మునిసిపల్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని 32, 33, 34 వార్డులలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. కూటమి బలపరిచిన చైర్మన్ అభ్యర్థి చెరుకుంపాలెం షమీం ఖాన్, వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని చీఫ్ విప్ జీవీ ఇంటింటికి తిరిగి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసిపి ఒక్క సీసీ రోడ్డు, డ్రైనేజీలు, ప్రజలకు మౌలిక వసతులు కల్పించలేని మీరు పుర ప్రజలను ఓటు అడిగే హక్కు లేదని అన్నారు. 2018లో 160 కోట్లు శాశ్వత త్రాగునీటి పథకానికి మేము నిధులు తీసుకొస్తే ఐదేళ్ల వైసిపి పాలనలో మీరు ఎందుకు పథకం పూర్తి చేయలేకపోయారు ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు నాడు 1200 టిట్కో ఇల్లు తీసుకువచ్చి 80% నిర్మాణం పూర్తి చేస్తే వైసిపి పాలనలో ఒక ఇటుక కూడా పెట్టకుండా పేద ప్రజలకు అన్యాయం చేసింది అన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో అరాచక వైసిపి పాలనకు ప్రజలు చరమగీతం పాడి 150 స్థానాల నుండి 11 స్థానాలకు పరిమితం చేశారో అదేవిధంగా మున్సిపల్ ఎన్నికల్లో పునరావృతం అవుతుందని స్పష్టం చేశారు. కరెంటు చార్జీలు, ఆర్టీసీ చార్జీలు పెంచి వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలను దోచుకున్నారని, ఎన్డీఏ కూటమిపాలనలో తల్లికి వందనం, స్త్రీ శక్తి ఉచిత బస్సు, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతు భరోసా అనేక సంక్షేమ పథకాలతో ప్రజలను ఆదుకుంటున్న కూటమి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. వినుకొండ పట్టణ అభివృద్ధి లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, 240 కోట్లతో శాశ్వత రక్షిత మంచినీటి పథకాన్ని ఏడాదిన్నరలో పూర్తిచేసి ప్రతిరోజు స్వచ్ఛమైన త్రాగునీరును అందిస్తామని చీఫ్ విప్ జీవి స్పష్టం చేశారు.

# గుడివాడ నియోజకవర్గంలో జడ్పీటీసీ నామినేషన్ల సందడి.. బరిలోకి టీడీపీ అభ్యర్థులు



గుడివాడ (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గుడివాడ నియోజకవర్గంలో రాజకీయ సందడి నెలకొంది. జడ్పీటీసీ స్థానాలపై పట్టు సాధించడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థులు ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఇందులో భాగంగా గుడివాడ రూరల్ మండల టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థిగా అంగడాల భారతి, నందివాడ మండల టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థిగా దుడ్ల రాజ్ ప్రదీప్ కుమార్ బుధవారం మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కార్యాలయ నామినేషన్ కేంద్రంలో తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇరువురు అభ్యర్థులు కూటమి శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల ఉత్సాహం మధ్య నామినేషన్లు దాఖలు చేయడంతో ఎన్నికల ప్రచారానికి ముందే కూటమి శ్రేణుల్లో సందడి కనిపించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మద్దతు కూడగట్టి విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని అభ్యర్థులు ధీమా వ్యక్తం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి



వేమూరు (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని చుండూరు, అమృతలూరు, వేమూరు, కొల్లూరు భట్టిప్రోలు మండలాల్లో తెలుగుదేశం పార్టీ (టీడీపీ), జనసేన పార్టీ కూటమి ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాలు పండుగ వాతావరణంలో, అట్టహాసంగా జరిగాయి. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నామినేషన్ ర్యాలీలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకుల నామినేషన్ ర్యాలీల్లో పాల్గొన్న వేమూరు శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న కూటమి ఐక్యతను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ చాటాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు.

# రక్తపాతంతో రాష్ట్రాన్ని అస్థిరపరిచి, అభివృద్ధిని అడ్డుకోవాలన్నదే జగన్ లక్ష్యం

●వైసీపీ తీరు.. మొగుణ్ని కొట్టి మొగసాలకెక్కినట్టుగా ఉంది

●ప్రభుత్వం, అధికారులు అడ్డుకుంటే 23వేలకు పైగా నామినేషన్లు ఎలా వేశారు?



చిలకలూరిపేట (చైతన్యరథం): "స్థానిక ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలో పోరాడే ధైర్యం లేకనే వైసీపీ నామినేషన్ల దశలోనే చేతులెత్తేసింది, తమ అసమర్థత, చేతగానితనంపై ప్రజల్లో చర్చ జరిగి, పార్టీ పరువు బజారున పడకూడదనే, ఆ పార్టీ నాయకులు ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నారు. నామినేషన్ల దాఖలులో వైసీపీ అభ్యర్థులు, ఆ పార్టీ ప్రధాన నాయకుల వైఖరి మొగుణ్ని కొట్టి మొగసాల కెక్కిన తీరుగా ఉంది. ఎన్నికల్లో పోటీచేయలేక.. నామినేషన్లు వేయకుంటే ప్రజల్లో నవ్వులపాలవుతామనే గొడ్డలిపార్టీ నేతలు డ్రామాలు ఆడుతూ. స్వేచ్ఛాయుతంగా పారదర్శకంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను అడ్డుకుంటున్నారు. పుంగనూరు, రాయచోటి ఘటనల్లో వైసీపీ కీలక నాయకుల హత్యా రాజకీయాలు, కుట్రల్ని పోలీసులు భగ్నం చేయడమే అందుకు నిదర్శనం, పంజాబ్ సహా ఇతర రాష్ట్రాల నుంచి కిరాయి మూకల్ని ఎవరు తీసుకొచ్చారో, వారితో ఎలాంటి కుట్రలకు ప్రణాళికలు వేశారో వైసీపీ అగ్ర నాయకత్వానికి తెలియదా? తమ ప్రత్యర్థుల్ని హతమార్చైనా తమ ప్రయోజనాలు నెరవేర్చాలన్నదే వైసీపీ నాయకుల పన్నాగం కాదా?

**ప్రభుత్వం అడ్డుకుంటే 23వేలకు పైగా నామినేషన్లు ఎలా వేశారు?**

కూటమి ప్రభుత్వం వైసీపీ అభ్యర్థుల్ని అడ్డుకుంటే.. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా వైసీపీసహా ఇతర పార్టీల నుంచి 23 వేలకు పైగా నామినేషన్లు దాఖలయ్యేవా? ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఒక్కరోజే 2 వేలకు పైగా నామినేషన్లు ఎలా వేశారు? రాజకీయం చేయాలన్న దురుద్దేశంతోనే కొన్నిచోట్ల నామినేషన్లు సరైన పద్ధతిలో నిబంధనల ప్రకారం సమర్పించకుండా.. నానాయాగీ చేశారు.

**నామినేషన్ల అడ్డగింత, హింసాత్మక ఘటనలు జగన్నాటకంలో భాగమే..**

స్థానిక ఎన్నికల్ని అడ్డుకోవాలన్న ఏకైక ఎజెండాతో వైసీపీ పనిచేస్తోంది. మొదట ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు అడ్డుతగలడం, తర్వాత బీసీ రిజర్వేషన్ల అమలుపై న్యాయస్థానాల్లో తప్పుడు కేసులు వేయడం, తాజాగా తమ అభ్యర్థులపై దాడికి పాల్పడ్డారంటూ సుప్రీంకోర్టులో మొసలి కన్నీరు కార్చి, సానుభూతి డ్రామాలాడటం వంటి చర్యలన్నీ ముమ్మాటికీ జగన్ నాటకంలో భాగమే.

**రాష్ట్రాన్ని అస్థిరపరిచి, రాజకీయ ప్రయోజనాల్ని నెరవేర్చుకోవడమే జగన్ లక్ష్యం..**

హత్యా రాజకీయాల్లో ఆరితేరిన జగన్.. స్థానిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరగడాన్ని భరించలేకపోతున్నాడు. ప్రభుత్వం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు సర్వ సన్నద్ధమైందని, అధికారయంత్రాంగం సమర్థవంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేస్తుందని గ్రహించే జగన్ ప్రజల్ని గందరగోళపరిచి, రాష్ట్రాన్ని అస్థిరపరచి, రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వంపై వ్యవస్థలపై బురదజల్లుతున్నాడు. అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికల్లో గెలుపుకోసం తాను అవలంభించిన రక్తపాత విధానాల్నే, జగన్ ఇప్పుడూ అమలు చేయాలని చూస్తున్నాడు." అని ప్రత్తిపాటి గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలి : బుద్ధా వెంకన్న

●38వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి పత్తి నాగేశ్వరరావు పార్టీ కార్యాలయం ప్రారంభం



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం భవానీపురం స్వాతి రోడ్డు శివాలయం సెంటర్‌లో 38వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి పత్తి నాగేశ్వరరావు పార్టీ కార్యాలయాన్ని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న, చెన్నుపాటి శ్రీను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ, విజయవాడ నగర అభివృద్ధిలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు కీలకమైనవని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, డివిజన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం, ప్రజలకు అందుబాటులో ఉండి వారి అవసరాలకు అనుగుణంగా పనిచేయడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. గత విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కార్యకర్తల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. 38వ డివిజన్ కూటమి అభ్యర్థి పత్తి నాగేశ్వరరావు విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలి. డివిజన్‌లోని ప్రజలను నేరుగా కలుసుకొని, వారి సమస్యలను తెలుసుకుంటూ, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందించేందుకు కృషి చేయాలని బుద్ధా వెంకన్న పార్టీ శ్రేణులకు సూచించారు.

# గుంటూరులో పసుపుమయమైన వీధులు!... మేయర్ అభ్యర్థికి ఘన స్వాగతం



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగర కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు సంగడిగుంటలో ఘన స్వాగతం లభించింది. తెలుగుదేశం యువ నాయకుడు భీమనాదం భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశం, భారీ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత భీమనాదం భరత్‌రెడ్డి నివాసంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో లక్ష్మీ అపర్ణ విజయానికి సమష్టిగా కృషి చేయాలని టీడీపీ, కూటమి నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం సిమ్స్ కాలేజీ నుంచి సంగడిగుంటలోని భరత్ రెడ్డి నివాసం వరకు భారీ కాన్వాయ్‌తో ర్యాలీ నిర్వహించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, లక్ష్మీ అపర్ణ, భీమనాదం భరత్ రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు.

# ఎన్డీయే కూటమి రోడ్‌షో... పాల్గొన్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగర ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మి అపర్ణ, కార్పొరేటర్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నిర్వహించిన భారీ రోడ్ షోలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవితో కలిసి ఏపీ టెక్నాలజీ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. ఈ రోడ్ షోలో ఎన్డీఏ కూటమి కార్పొరేటర్ అభ్యర్థులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మి అపర్ణతో పాటు ఎన్డీఏ కూటమి బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని మన్నవ మోహనకృష్ణ ప్రజలను విజ్ఞప్తి చేశారు.

# జడివాన హోరులోనూ జోరుగా ప్రచారం

## మంత్రి నారాయణ సతీమణి రమాదేవికి నీరాజనాలు, కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి



నెల్లూరు (చైతన్యరథం): హోరున వాన కురుస్తున్నా స్థానిక ప్రచారం జోరు తగ్గలేదు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి నెల్లూరు సిటీలో ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. 58, 64, 61, 63 డివిజన్లలో అభ్యర్థులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వర్షంలోనూ కొనసాగిన ప్రచారానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ రమాదేవి ఓటర్లను ఆకట్టుకున్నారు. కార్పొరేటర్లుగా కరీముల్లా, షేక్ నజీమా, ఆనం రంగమయూర్ రెడ్డి, జుబేరుద్దీన్‌లను, మేయర్‌గా రూప్ కుమార్ యాదవ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులకు అండగా నిలవాలని కోరారు. రమాదేవి ప్రచారానికి వెళ్లిన ప్రతి డివిజన్‌లోనూ స్థానిక మహిళలు ఘనస్వాగతం పలికారు. పూలవర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆమె ఇంటింటికీ వెళ్లడంతో ప్రచారంలో ప్రత్యేక సందడి నెలకొంది.

మహిళలతో మమేకమవుతూ వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. పేదల అభ్యున్నతికోసం మంత్రి నారాయణ చేస్తున్న కృషికి ప్రజల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయని రమాదేవి పేర్కొన్నారు. నగరాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న నారాయణకు తాము అండగా ఉంటామని ఓటర్లు చెబుతున్నారని తెలిపారు. నారాయణ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి భారీ మెజారిటీ అందిస్తామని ప్రజలు వ్యక్తం చేస్తున్న విశ్వాసం ప్రచారానికి మరింత ఊపునిస్తోందన్నారు. వర్షం కారణంగా ప్రచారానికి ఆటంకం ఎదురైనా వెనక్కి తగ్గకుండా సాగిన రమాదేవి పర్యటనతో ఆయా డివిజన్లలో ఎన్నికల సందడి నెలకొంది. స్థానికుల ఆత్మీయ స్వాగతాలు, మహిళల స్పందనతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది.

### వ్యాపార సంఘాలతో ఆత్మీయ సమావేశం

చిన్నబజార్ లోని ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ మరియు పాన్ బ్రోకర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆనం వివేకా తనయుడు కార్పొరేటర్ అభ్యర్థి ఆనం రంగ మయూర్ రెడ్డి తో కలిసి మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి పాల్గొన్నారు. రమాదేవికి అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతం పలికారు.

కార్పొరేషన్ ఎన్నికల్లో మంత్రి నారాయణ బలపరిచిన అభ్యర్థులకే తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ నారాయణ పట్ల గౌరవంతో కూటమి అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన అసోసియేషన్ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. వ్యాపారస్తులకు చిన్న ఇబ్బంది కూడా కలగకుండా చూడాలన్నది మంత్రి అభిలాష అన్నారు. మంత్రి నారాయణ నాయకత్వంలో వ్యాపార వర్గాలకు అంతా మంచే జరుగుతుందన్నారు.



# అభివృద్ధి కోసమే కూటమి అభ్యర్థులకు ఓట్లు

## తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటరెడ్డి గిరిధర్ రెడ్డి పిలుపు

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): 28వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కూటమి కార్పొరేటర్ అభ్యర్థి నన్నం శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో తెలుగుదేశం పార్టీ కూటమి నెల్లూరు నగర మేయర్ అభ్యర్థి పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్‌తో కలసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. నెల్లూరు నగర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు నగర మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్‌ను 28వ డివిజన్ కూటమి కార్పొరేటర్ అభ్యర్థి నన్నం శ్రీనివాసులును అత్యధిక ఓట్లు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల ప్రచారం, ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలు ఇతర కీలక అంశాలపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ కూటమి నెల్లూరు నగర మేయర్ అభ్యర్థి పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్ సూచనలు చేశారు.

# కూటమికి అన్నీ శుభశకునాలే!




ఒంగోలు (చైతన్యరథం): సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో దర్శి, కనిగిరి మున్సిపాలిటీల్లో ఉపసంహరణల అనంతరం పరిస్థితిని వెల్లడించకుండా అధికారులు వాయిదా వేశారు. కనిగిరి మున్సిపాలిటీ అంశం వైసీపీ సుప్రీంకోర్టు పిటిషన్‌లో పేర్కొన్న స్థానాల్లో లేదని తెలుస్తోంది. బీజేవైఎం పార్టీ తరపున రామచంద్రయాదవ్ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ మేరకు కనిగిరి నామినేషన్ల తీరుతెన్నుపై పరిశీలన జరుగుతోంది. ఒక వార్డులో నామినేషన్ వేసేందుకు వచ్చిన మహిళను అడ్డుకున్నారని, అందుకు న్యాయం చేయాలని పిటిషన్ వేసినట్లు తెలిసింది. దీంతో ఆ విషయంపై విచారణ చేపట్టి తదనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ మేరకు బుధవారం మార్కాపురం కలెక్టర్, జేసీ ప్రత్యేకంగా విచారణ నిర్వహించారు. అయితే సదరు మహిళనే నామినేషన్ వేసే సమయంలో తనకు ఎలాంటి సమస్య ఎదురు కాలేదని వారికి చెప్పినట్లు తెలిసింది. దీంతో అధికారులు పూర్తిస్థాయి విచారణ నివేదికను రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపారు. ఆ ప్రకారం నేడో,రేపో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పరిస్థితిని కనిగిరి ఎన్నికల అధికారి ప్రకటించవచ్చని తెలుస్తోంది. అందిన సమాచారం మేరకు.. కనిగిరి చైర్‌పర్సన్‌గా టీడీపీ అభ్యర్థి తిరుపతమ్మ ఏకగ్రీవం కావచ్చని తెలుస్తోంది. మొత్తం 32 వార్డుల్లో సుమారు 28 వార్డులు టీడీపీ అభ్యర్థులకు ఏకగ్రీవమైనట్లుగా సమాచారం. మిగిలిన నాలుగు వార్డుల్లో ఒకచోట సీపీఎం, మూడుచోట్ల వైసీపీ అభ్యర్థులు రంగంలో మిగిలారని తెలుస్తోంది.దర్శిలో జనసేన తరపున పోటీలో ఉన్న చైర్మన్ అభ్యర్థితోపాటు మొత్తం 28 వార్డులు ఏకగ్రీవమయ్యేందుకు రంగం సిద్ధమైంది. అందులో 24వార్డుల్లో టీడీపీ, మూడు వార్డుల్లో జనసేన, ఒకచోట బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఐదు వార్డుల్లో నామినేషన్లు దాఖలు చేసిన వైసీపీ అభ్యర్థులు విత్‌డ్రా చేసుకోవడం విశేషం. కాగా వైసీపీ వేసిన పిటిషన్ మేరకు సుప్రీంకోర్టు సూచనకు అనుగుణంగా అసలు దర్శిలో ఏం జరిగిందనే విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి విచారణ చేపట్టారు. కలెక్టర్, ఎస్పీలతో ఆయన నేరుగా మాట్లాడారు. దర్శిలో నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న గొడవలు, అందుకు అనుగుణంగా దాఖలైన కేసుల వివరాలను ఎస్ఈసీ తెప్పించుకొని పరిశీలన చేస్తోంది. అయితే ఎస్ఐపై రాళ్లతో దాడి జరగడం, ఆ సందర్భంగా అక్కడే బహిరంగంగా వైసీపీ చైర్మన్ అభ్యర్థి తన నామినేషన్ పత్రాలు చింపేయడం, ఇద్దరు, ముగ్గురుగా వచ్చి నామినేషన్ వేయండంటూ పోలీసులు అనౌన్స్ చేయడం తదితర దృశ్యాలతో కూడిన నివేదికలను అధికారులు పంపినట్లుగా తెలుస్తోంది. గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేసిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సోదరుడు కృష్ణకిశోర్‌రెడ్డి బుధవారం ఉపసంహరించుకున్నారు. దీంతో ఎమ్మెల్యే పూర్తిస్థాయిలో బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇచ్చే పరిస్థితి నెలకొంది. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా తాము పోటీ నుంచి తప్పుకున్నట్లు ఎమ్మెల్యే సోదరుడు ప్రకటించారు. ఇప్పటికే ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థి పక్షాన ప్రచారంలో ఉన్నారు. పట్టణ ప్రజలందరికీ సుపరిచితుడైన ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉండటం విశేషం. ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు మార్కాపురం, అద్దంకి మున్సిపాలిటీల్లో టీడీపీ, బీజేపీ అభ్యర్థులు బోణీ కొట్టారు. ఒంగోలులో మూడు డివిజన్‌లు టీడీపీకి ఏకగ్రీవమైనట్లు సమాచారం.

# ఘనంగా దుర్గమ్మ నిమజ్జనోత్సవం

## పాల్గొన్న సుగవాసి ప్రసాద్‌బాబు తదితరులు

రాయచోటి (చైతన్యరథం): పాత రాయచోటి దుర్గమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గమ్మ నిమజ్జన మహోత్సవంలో రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దుర్గమ్మ ఆశీస్సులు పొందారు. భక్తుల జయజయధ్వానాలు, మంగళవాయిద్యాలు, ఆధ్యాత్మిక వాతావరణం మధ్య జరిగిన ఈ నిమజ్జన వేడుక భక్తిభావాన్ని చాటిచెప్పింది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, భక్తులతో ఆయన ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ, అమ్మవారి ఉత్సవాలు భక్తి, ఐక్యత, సోదరభావానికి ప్రతీకలని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో వ్యవహరిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. దుర్గమ్మ కరుణాకటాక్షాలతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం ప్రాంతం సుభిక్షంగా ఉండాలని సుగవాసి ప్రసాద్ బాబు ఆకాంక్షించారు.





# చెన్నేకొత్తపల్లిలో ఇద్దరు ఖాకీల వీరంగం

**టీడీపీ నేతలపై సీఐ, ఎస్ఐల దాడి, 7గంటలకే నామినేషన్ కేంద్రాల్లోకి వైసీపీ నేతలకు అనుమతి, హోంగార్డ్ బంధువు నామినేషన్ వేస్తున్న సమయంలో ఘాతుకం, ఎస్పీతో మాట్లాడిన ఎమ్మెల్యే సునీత, ఎంఎస్ రాజు, ఆ ఇద్దరిపై చర్యలు తీసుకుంటామని హామీ**

రాప్తాడు (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో చెన్నేకొత్తపల్లి ఇన్ ఛార్జి సీఐ ఇస్మాయిల్, ఎస్ఐ సత్యనారాయణ వీరంగం సృష్టించారు. నామినేషన్ కేంద్రాలకు దూరంగా ఉన్న టీడీపీ నేతలపై విచక్షణారహితంగా లాఠీలతో దాడి చేశారు.

అదే సీఐ, ఎస్ఐ ఉదయం 7గంటలకే నామినేషన్ కేంద్రాల్లోకి వైసీపీ నేతలను అనుమతించడంతో పాటు వారితో కరచాలనం చేస్తూ చనువుగా ప్రవర్తించారు. మరోవైపు పుట్టపర్తిలో పని చేస్తున్న న్యామద్దల గ్రామానికి చెందిన హోంగార్డ్ నాగేంద్ర బంధువు నామినేషన్ వేసేందుకు రాగా ఆ సమయంలో టీడీపీ నేతలు అక్కడ ఉండకుండా చెదరగొట్టే ప్రయత్నం చేశారు. వారు తమ పార్టీ నాయకుల నామినేషన్‌కు వచ్చామని చెబుతున్నా వినకుండా విచక్షణారహితంగా లాఠీలతో చితకబాదారు. అక్కడున్న యాచకులపై సైతం ఇలానే దాడి చేశారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ నేతలు ఆందోళనకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎంఎస్ రాజు అక్కడికి చేరుకున్నారు. టీడీపీ నేతలతో మాట్లాడారు. సీఐ, ఎస్ఐ వ్యవహించిన తీరు గురించి వివరించారు. దీంతో ఎమ్మెల్యే సునీత నేరుగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌కు ఫోన్ చేశారు. తమ పార్టీ నాయకులు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా ప్రశాంతంగా ఉన్న చోట ఇలా సీఐ, ఎస్ఐ దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఎస్పీ సతీష్ కుమార్ దీనిపై స్పందిస్తూ.. సీఐ, హోంగార్డుల మీద చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో టీడీపీ నేతలు శాంతించారు. వైసీపీ నాయకులు నామినేషన్ వేయడంలో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, స్వేచ్ఛగా వేసుకోవచ్చని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కానీ ప్రశాంతంగా ఉన్న చోట టీడీపీ నేతలపై పోలీసులు వారి స్వప్రయోజనాల కోసం దాడులు చేయడం ఏంటని నిలదీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే.. ఎన్నికల కమిషన్ కు కూడా ఫిర్యాదు చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

# టీడీపీలోకి జనసేన మండల కన్వీనర్ చిల్లా మహేష్

**కోకొల్లలుగా పలు వార్డులకు చెందిన కార్యకర్తలు, కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్న ఎమ్మెల్యే కందికుంట**



కదిరి (చైతన్యరథం): కదిరి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో జనసేన పార్టీ రూరల్ మండల కన్వీనర్ చిల్లా మహేష్, చిల్లా శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన చిల్లా మహేష్, చిల్లా శ్రీనివాసులును ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలావుండగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో 39, 33, 38వ వార్డుల నుంచి టీడీపీలో భారీ చేరికలు జరిగాయి. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో 39, 33, 38వ వార్డులకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. 39వ వార్డు అభ్యర్థి తాత శ్రీనివాసులు, 33వ వార్డు అభ్యర్థి విజయ్ కుమార్, 38వ వార్డు అభ్యర్థి అతహర్ ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఖకాషా వలి, దాదాపీర్, రహమత్, షేక్ బాబ్జాన్, రమణమ్మ, షేక్ సోహైల్, నరేష్, బాబా, తౌఫిక్ తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు నాయకులు, బూత్ ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

**నల్లచెరువు మండలంలో వైఎస్సార్‌సీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మండలానికి చెందిన పలువురు కీలక నాయకులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే సాదరంగా స్వాగతం పలికారు.**





# మడకశిరలో కూటమి అభ్యర్థుల ప్రచారం జోరు

మడకశిర (చైతన్యరథం): మడకశిర పట్టణంలోని శివాపురం శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, పూజల అనంతరం శివాపురం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా సాగింది. కూటమి అభ్యర్థుల భారీ గెలుపే లక్ష్యంగా నాయకులు పెద్ద ఎత్తున ఈ ప్రచారంలో పాల్గొని ప్రజల మద్దతు కోరారు. పట్టణాభివృద్ధే ధ్యేయంగా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మడకశిర అబ్జర్వర్ సుధాకర్, జనసేన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గుండుమల శారదమ్మ రాధాకృష్ణ 23వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, టీడీపీ సీనియర్ నాయకులు, జనసేన బీజేపీ, టీడీపీ కూటమి నాయకులు, కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జులు, అనుబంధ కమిటీల నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.







# స్థానిక సమరానికి పకడ్బందీ వ్యూహం

**శ్రేణులతో సమావేశంలో మంత్రి సత్య, ఎమ్మెల్యే దగ్గుపాటి, మేయర్ అభ్యర్థి అజేష్**

అనంతపురం (చైతన్యరథం): అర్బన్ టీడీపీ కార్యాలయంలో కూటమి పార్టీల సమన్వయ సమావేశం జరిగింది. మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బీజేపీ, జనసేన, టీడీపీల జిల్లా అధ్యక్షులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. మేయర్ అభ్యర్థి అజేష్‌తో పాటు 62 కార్పొరేటర్ అభ్యర్థులు, క్లస్టర్ ఇంచార్జ్‌లతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. మేయర్ అభ్యర్థి అజేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతపురం నగర అభివృద్ధిపై తమ వద్ద స్పష్టమైన ప్రణాళిక ఉందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. 2014-19మధ్య ఎన్డీఏ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని చూశారని, 2019-24మధ్యలో జరిగిన అవినీతి, అరాచకాలను అనుభవించారని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ ఎన్డీఏ పాలనలో జరుగుతున్న అభివృద్ధి చూస్తున్నారని వివరించారు. ఇది ఇలాగే కొనసాగాలంటే మేయర్ అభ్యర్థి అజేష్ గెలవాల్సి అవసరం ఉందన్నారు. కేంద్రం, రాష్ట్రం, స్థానికంగా ఒక్కరే ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రధాన సమస్యను ప్రస్తావిస్తూ డంపింగ్ యార్డ్‌లో ఇప్పటికే 75 శాతం చెత్త తొలగించామన్నారు. నగరంలో త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్, పార్కు, లాజిస్టిక్ హబ్ ఏర్పాటవుతాయన్నారు. సుప్రీం కోర్టు తీర్పులను వక్రీకరిస్తూ జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. నిన్నటి వరకు మన సీట్ల కోసం సమష్టిగా మాట్లాడుకున్నామని, ఇక నుంచి కూటమి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేద్దామని పిలుపునిచ్చారు. రెండేళ్లుగా జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉందని ఇప్పుడు మేయర్ అభ్యర్థి కూడా ఎన్డీఏ వారైతేనే అభివృద్ధి సాధ్యమన్నారు. రెండేళ్లలో 1300కోట్లతో నగరంలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేశామని వెల్లడించారు. 300కోట్లతో మౌళిక వసతులు కల్పించామన్నారు. ఈ అభివృద్ధి మరింత కొనసాగాలన్నారు. అందుకే అజేష్‌కు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. వైసీపీకి ఓటు వేస్తే నగరంలో మళ్లీ అభివృద్ధి కుంటుపడుతుంది..అజేష్ బాబు పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కలిసి పని చేస్తే అన్ని స్థానాల్లో గెలుస్తామన్నారు.

# చంద్రబాబు 'వస్తున్నా మీకోసం' పాదయాత్రకు 14 ఏళ్లు

## అలంపూర్ నియోజకవర్గంలో ఘనంగా వేడుకలు

### టీడీపీ జెండాను ఆవిష్కరించిన పొలిట్‌బ్యూరో సభ్యుడు నరసింహులు



**అలంపూర్ (చైతన్యరథం):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన చారిత్రాత్మక 'వస్తున్నా మీకోసం' పాదయాత్రకు నేటితో 14 సంవత్సరాలు పూర్తయ్యాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు పేర్కొన్నారు. గురువారం ఆయన జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని శాంతినగర్‌లో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ నాటి కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ ప్రారంభమైన 'వస్తున్నా మీకోసం' పాదయాత్ర సరిగ్గా 14 సంవత్సరాల క్రితం (2/10/2012) తెలంగాణ గడ్డపై అడుగు పెట్టి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 18 రోజులు సాగిందని గుర్తు చేశారు.

**చరిత్రాత్మక ఘట్టాలు...**

**మందకృష్ణ సంఘీభావం:** నాటి చంద్రబాబు పాదయాత్రకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సంఘీభావం తెలపడం అభినందనీయమని నరసింహులు కొనియాడారు.

**రాజోలి పర్యటన:** 2012 అక్టోబర్ 22న రాజోలి గ్రామానికి చేరుకున్న చంద్రబాబు.. మొదట దళితవాడలో పర్యటించి, అనంతరం ప్రసిద్ధ చేనేత కార్మికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

**నేతల ఆతిథ్యం:** ఆనాడు చంద్రబాబుకు స్వాగతం పలికిన ప్రముఖుల్లో ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో పాటు ఎర్రబెల్లి దయాకర్‌రావు, నాగం జనార్దన్ రెడ్డి, జైపాల్‌యాదవ్, రాములు, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారని, కాలక్రమేణా వారందరూ వేరే పార్టీలకు వెళ్లడం కొసమెరుపు అని పేర్కొన్నారు.

**అభివృద్ధి సంస్కరణలు:** ప్రజల కోరిక మేరకు రాజోలి గ్రామానికి ఎన్టీఆర్ సుజల పథకం, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా నిధులు మంజూరు చేయించామని తెలిపారు.

**చంద్రబాబు సంస్కరణలే రాబోయే తరాలకు ఆదర్శం**

చంద్రబాబునాయుడు పాలనలో చేపట్టిన సంస్కరణలు నేటి యువతకు ఆదర్శమని వక్తలు పేర్కొన్నారు. మహిళా సాధికారత, అంటరానితనం నిర్మూలన, భూగర్భ జలాల పెంపునకు వాటర్ షెడ్ల నిర్మాణం, అందరికీ విద్య–వైద్యం అందించడంతో పాటు అలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం, ఆలయ ముఖద్వార నిర్మాణం వంటి ఎన్నో బృహత్తర కార్యక్రమాలను టీడీపీ ప్రభుత్వం చేపట్టిందని వెల్లడించారు.

అంతే కాకుండా అయిజ గ్రామంలో కుటుంబ సమేతంగా దసరా ఉత్సవాలు జరుపుకున్న సందర్భాన్ని గుర్తు చేస్తూ... అప్పట్లో స్వయంభూ కింది తిమ్మప్ప స్వామి (వేంకటేశ్వరస్వామి) దేవాలయ అభివృద్ధికి రూ.35 లక్షలు మంజూరు చేసి కల్యాణ మండపం నిర్మించినట్టు చెప్పారు.

కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.ఆంజనేయులు, పూర్ణచందర్‌రావు, రాజేందర్ గౌడ్, మహమ్మద్ రఫీ, సుధాకర్ నాయుడు, మూడవత్ కిషన్‌నాయక్, అశోక్, కుమార్, నాయుడు, వాకిటి జయరాము, జై.బాల్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన వీరుడు

# కొమురం భీమ్

### ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా ఆయన 125వ జయంతి వేడుకలు

### నివాళులర్పించిన తెలుగుదేశం పార్టీ నాయకులు

**హైదరాబాద్ (చైతన్యరథం):** హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో కొమురం భీమ్ 125వ జయంతి వేడుకలను తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజునాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొమురం భీమ్ 'జల్–జంగల్–జమీన్' నినాదంతో మానవ హక్కుల కోసం చిన్నతనం లోనే పోరాటం ప్రారంభించారని కొనియాడారు. 'ఎన్టీఆర్ స్వయంగా తండాలకు వెళ్లి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. గిరిజన ప్రాంతాల్లో ఎన్టీఆర్ హయాంలో రహదారులు, విద్యుత్ వంటి మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేశారు. చంద్రబాబు గిరిజనుల విద్యకు ప్రాధాన్యతమిచ్చి ప్రోత్సహించారు. ఎన్టీఆర్ హయాంలో జీవో నెం.275 ప్రకారం 7వ తరగతి ఫెయిల్ అయిన వారికి గిరిజనులకు ఆదివాసీ ప్రాంతాల్లో టీచర్ ఉద్యోగాలు ఇచ్చేవారు. తర్వాత ఈ జీవోను 1793గా మార్చి పదో తరగతి ఫెయిల్ అయిన వారికి ఆదివాసీ ప్రాంతాల్లో టీచర్ ఉద్యోగాలను ఆదివాసీలకే ఇచ్చేవారు. తదనంతరం చంద్రబాబు హయాంలో జీవో నెం.3 తీసుకొచ్చి అన్‌ట్రైన్డ్ టీచర్స్‌ను ఉద్యోగాల్లోకి తీసుకుని ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చేవారు. 109 డిపార్ట్‌మెంట్లలో జీవో నెం.3 ప్రకారం ఆదివాసీ గిరిజనులకు ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యోగాలు ఇచ్చేవారు. ఈ జీవోను 2021లో అప్పటి ప్రభుత్వం సరిగా వాదనలు వినిపించకపోవడంతో కోర్టు కొట్టివేసింది. జీవో నెం.3కి ప్రత్యామ్నాయంగా రాజ్యాంగానికి లోబడి ఆదివాసీ గిరిజనులకు జీవో తీసుకురావాల్సిన అవసరముంది. తెలుగుదేశం పార్టీ అన్ని ప్రాంతాల్లో ఇక ముందు గిరిజనులకు ప్రాధాన్యత ఇస్తుంది.' అని చెప్పారు.

టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న మాట్లాడుతూ... 'జల్–జంగల్–జమీన్' అనే నినాదాన్ని కొమురం భీమ్ అధికారం కోసం చేయలేదు. ఆదివాసీల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటం ఇది. ఆయన పోరాట స్ఫూర్తిని తీసుకుని ఎన్టీఆర్ గిరిజన సంక్షేమ నిధిని పెంచారు. చంద్రబాబు గిరిజనుల విద్య కోసం ప్రత్యేక పాఠశాలలను, హాస్టళ్లను ఏర్పాటు చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తండాలను గ్రామ పంచాయతీలుగా చేస్తామని చెప్పారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న పార్టీ గిరిజనులకు ఏమి చేశారో సమాధానం చెప్పలేని పరిస్థితి. విద్య, వైద్యం, ఉపాధి, భూమి అనే నాలుగింటిని గిరిజనులకు కల్పించిననాడే వారికి న్యాయం జరుగుతుందన్నారు.

టీడీపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి అజ్మీరా రాజునాయక్ మాట్లాడుతూ.... 'హక్కుల కోసం నిజాం పాలకులతో కొట్లాడిన యోధుడు కొమురం భీమ్. ఆయన స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమం జరిగింది. తెలుగుదేశం పార్టీ సామాజిక న్యాయాన్ని అమలు చేసింది. ఎస్సీ, ఎస్టీల కోసం మొట్టమొదటిసారిగా గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసింది. టీడీపీ కమిటీల్లో పది శాతం గిరిజనులకు ఇచ్చి ప్రోత్సహించాలి' అని కోరారు.

గిరిజన నాయకుడు ఆరెం రామయ్య మాట్లాడుతూ తెలంగాణ తల్లి కన్న గొప్ప పోరాట యోధుడు కొమురం భీమ్ అన్నారు. 'జల్–జంగిల్–జమీన్' అనే మూడు పదాల వెనుక ఒక జాతి మొత్తం హక్కుల కోసం ఒక వీరుడి పోరాటం కనిపిస్తుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఈ పోరాటాలన్నింటినీ గుర్తించి రాజ్యాంగంలో ఆదివాసీ గిరిజనులకు రక్షణ చట్టాలను పొందుపరి చారన్నారు. అయితే ఆ చట్టాలు నేడు సరిగా అమలు కావట్లేదన్నారు.

ఖమ్మం పార్లమెంట్ అడ్‌హాక్ కమిటీ సభ్యుడు కాట్రం స్వామి దొర మాట్లాడుతూ... గిరిజనుల హక్కుల కోసం నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు కొమురం భీమ్. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అర్పించే నివాళి అన్నారు.

కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకురాలు సూర్యదేవర లత, కాణిపాకం దేవస్థానం పాలకమండలి సభ్యుడు శ్రీపతి సతీష్, అనంతరెడ్డి, సంధ్యపోగు రాజశేఖర్, గూడెపు రాఘవులు, ఎం.స్వాతిచౌదరి, ఏబీఆర్ మోహన్‌రావు, బాలాజీ గోస్వామి, యాదగిరి, జలమోని రవీందర్, నర్సింహ, మండవ వెంకటేష్‌గౌడ్, పబ్బతి శేఖర్‌రెడ్డి, తెలుగుదేశం ప్రకాష్‌రెడ్డి తదితరులు కొమురం భీమ్‌కు నివాళులర్పించారు.





## 'పాలమూరు రాబిన్‌హుడ్'

# పండుగ సాయన్న

## ఆయన సేవలు చిరస్మరణీయం

### ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా సాయన్న ముదిరాజ్ 125వ జయంతి వేడుకలు

**హైదరాబాద్ (చైతన్యరథం):** నిజాం నిరంకుశత్వానికి, భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవ యోధుడు, ప్రజావీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ 125వ జయంతి వేడుకలను తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఘనంగా నిర్వహించింది. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో ఆ పార్టీ నాయకులు పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి భావపూర్వక నివాళులర్పించారు.

**పేదల పక్షాన నిలిచిన మహనీయుడు: అరవింద్ కుమార్ గౌడ్**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల దోపిడీకి గురవుతున్న పేదల భూములను కాపాడేందుకు సాయన్న చిన్నతనంలోనే విప్లవ భావాలు వంటబట్టించుకున్నారని కొనియాడారు. పేదలపై జరిగే అక్రమాలను ఎదిరించేందుకు ప్రత్యేకంగా ఒక సాయుధ దళాన్ని ఏర్పాటు చేసి నిరుపేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం చేస్తూ పీడిత వర్గాలకు ఆపద్బాంధవుడిగా నిలిచారని తెలిపారు. ఆనాడు నిజాం పాలనను గడగడలాడించి, పేదల ఆత్మగౌరవం కోసం పోరాడిన సాయన్నను ప్రజలు ప్రేమగా "తెలంగాణ రాబిన్‌హుడ్", "పాలమూరు రాబిన్‌హుడ్" అని పిలుచుకుంటారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతిని నిర్వహించకముందే సాయన్న పోరాట స్ఫూర్తిని గౌరవిస్తూ తెలుగుదేశం పార్టీ ముందుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న, రాష్ట్ర నాయకులు అజ్మీరా రాజు నాయక్, సూర్యదేవర లత, కాణిపాకం దేవస్థానం పాలకమండలి సభ్యుడు శ్రీపతి సతీష్, అనంత రెడ్డి, సంధ్యపోగు రాజశేఖర్, జలమోని రవీందర్ ముదిరాజ్, కాట్రం స్వామిదొర, మండవ వెంకటేష్ గౌడ్, గూడెపు రాఘవులు, ఏబీఆర్ మోహన్‌రావు, యాదగిరి, బాలాజీ గోస్వామి, ఎం.స్వాతి చౌదరి, ఆరెం రామయ్య, నర్సింహా, పబ్బతి శేఖర్‌రెడ్డి, తెలుగుదేశం ప్రకాష్‌రెడ్డి తదితర ముఖ్య నేతలు, కార్యకర్తలు విశేషంగా పాల్గొన్నారు.

# సంగీతం, నృత్యంతో సేవా భావం

శంకర నేత్రాలయ యూఎస్ఏ ఆధ్వర్యంలో 'మ్యూజిక్ అండ్ డాన్స్ ఫర్ విజన్ 2026'







**మిచిగన్:** భారతీయ సంగీతం మనసులను కలిపితే, నృత్యం సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. ఈ రెండూ ఒక మంచి లక్ష్యం కోసం కలిస్తే సమాజంలో సేవాభావం మరింత పెరుగుతుందని నిరూపించింది శంకర నేత్రాలయ యూఎస్ఏ. అమెరికాలోని మిచిగన్ రాష్ట్రం నోవైలో నిర్వహించిన 'మ్యూజిక్ అండ్ డాన్స్ ఫర్ విజన్-2026' ఈ సందేశాన్ని చాటిచెప్పింది. భారతీయ సంగీతం, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో పాటు కంటి వైద్య సేవలకు మద్దతుగా నిర్వహించిన ఈ సాంస్కృతిక వేడుక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

భారతదేశంలో కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం, నివారించగల అంధత్వాన్ని తగ్గించడం లక్ష్యంగా పనిచేస్తున్న శంకర నేత్రాలయ యూఎస్ఏ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. నోవైలోని శ్రీ వేంకటేశ్వర టెంపుల్-కల్చరల్ సెంటర్లో జరిగిన ఈ వేడుకకు కళాకారులు, కుటుంబాలు, వాలంటీర్లు, స్థానిక తెలుగు సమాజ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కళల ద్వారా సేవా కార్యక్రమాలకు నిధులు సమకూర్చడం, కంటి ఆరోగ్యంపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమ ప్రధానోద్దేశం. మిచిగన్ ప్రాంతంలోని నాలుగు నృత్య పాఠశాలలకు చెందిన సుమారు 40 మంది చిన్నారులు, టీనేజర్లు కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శించారు. శ్రీ త్రిపురసుందరి కూచిపూడి నృత్యాలయం (గురువు: త్రిపుర సుందరి భాగవతుల), నాట్యధర్మి పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ (గురువు: సంధ్యశ్రీ ఆత్మకూరి), అభినయ స్కూల్ ఆఫ్ డాన్స్ (గురువు: ధన్యవాణి రావు), నాట్యాలయ అకాడమీ ఆఫ్ భరతనాట్యం (గురువు: ఐశ్వర్య అరుణ్‌కుమార్)

స్థానిక గాయకులు వెంకట్ గోటూర్, భార్గవ్ గంటి, అశ్విని అయ్యర్, శ్రీరంజిత చిత్రపు, రాధ కొల్లి, కీర్తన జగదీష్‌తో పాటు కళ్యాణి మంత్రప్రగడ శిష్యులు తమ గానంతో అలరించారు. కాలిఫోర్నియా నుంచి వచ్చిన ప్రముఖ గాయని అంజనా సౌమ్య, భారతదేశం నుంచి వచ్చిన ప్రముఖ గాయకుడు రాము మహారాజపురం ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

SNUSA బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యుడు రమణ ముదిగంటి సంస్థ లక్ష్యాలు, మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ద్వారా అందిస్తున్న కంటి వైద్య సేవల గురించి వివరించారు. గ్రామీణ భారతదేశంలో కంటి వైద్య సేవలు సులభంగా అందుబాటులో లేని ప్రాంతాల ప్రజలకు చికిత్స అందించడంలో దాతల విరాళాలు, ప్రజల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. SNUSA అధ్యక్షుడు డాక్టర్ బాలరెడ్డి ఇందుర్తి నాయకత్వంలో సేవల విస్తరణకు ప్రాధాన్యత ఇచ్చామని, సేవలు 7 నగరాల నుంచి 30 నగరాలకు విస్తరించాయని తెలిపారు. మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ప్రాజెక్ట్‌లో ఆపరేటింగ్ యూనిట్ల సంఖ్య 2 నుంచి 5కు పెరిగింది. దీంతో పాటు 'అడాప్ట్-ఎ-విలేజ్' ద్వారా కూడా కంటి వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు చేరవేస్తున్నారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో డెట్రాయిట్ బృందం సభ్యులు రమణ ముదిగంటి, ఫౌండేషన్ చైర్ ప్రతిమ కొడాలి, చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ పెరుమాళ్ల, కల్చరల్ లీడ్ త్రిపురసుందరి భాగవతుల, చాప్టర్ లీడ్స్ వెంకట్ గోటూర్, రవి కవుతరపు కీలక పాత్ర పోషించారు. డాక్టర్ బాలారెడ్డి ఇందుర్తి మార్గదర్శకత్వంలో, డాక్టర్ ఎన్ఆర్‌యూ, మూర్తి రేకపల్లి సహకారంతో ఈ సాంస్కృతిక నిధుల సేకరణ కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. మరిన్ని వివరాల కోసం లేదా విరాళాలు అందించడానికి www.sankaranethralayausa.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. టోల్‌ఫ్రీ నెంబరు (855) 463-8472కు ఫోన్ చేయవచ్చు.







తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్ ఆధ్వర్యంలో

## 'సూపర్ సింగర్-2026' పోటీలు

**మసాచుసెట్స్:** తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్ ఆధ్వర్యంలో 'సూపర్ సింగర్-2026' నిర్వహిస్తున్నారు. ప్రవాసాంధ్ర, తెలంగాణ వాసుల్లోని ప్రతిభావంతులైన గాయకులను వెలికితీసేందుకు ఈ ప్రోగ్రాం వేదిక కానుంది. నవంబరు 7వ తేదీ మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మసాచుసెట్స్‌లోని లెక్సింగ్టన్ కమ్యూనిటీ సెంటర్ (Lexington Community Center, MA) వేదికగా పోటీలు వైభవంగా జరగనున్నాయి. సోలో సింగింగ్ విభాగంలో క్లాసికల్ (శాస్త్రీయ సంగీతం), సెమీ-క్లాసికల్, సినిమా పాటల (ఫిల్మ్) పోటీలు ఉంటాయి. తెలుగు భాషా పాటలు... గీతం/స్వరజతి, వర్ణం లేదా మనోధర్మంతో కూడిన కృతి (స్వర కల్పన, రాగాలాపన, నెరవల్) విభాగాలు ఉన్నాయి. క్లాసికల్ విభాగంలో ఏ వయసు వారైనా పాల్గొనే అవకాశం కల్పించారు.

వయసుల వారీ విభాగం (సెమీ-క్లాసికల్ & ఫిల్మ్):
సబ్ జూనియర్: 5-8 సంవత్సరాలు
జూనియర్: 9-12 సంవత్సరాలు
సీనియర్: 13-17 సంవత్సరాలు
పెద్దలు (అడల్ట్స్): 18 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసు గలవారు.

నిబంధనలు: క్లాసికల్ పాటలు తెలుగు లేదా సంస్కృతంలో ఉండవచ్చు (తెలుగు రచనలకు విశేష ప్రాధాన్యత ఉంటుంది). మిగిలిన అన్ని విభాగాల్లో కేవలం తెలుగు పాటలు మాత్రమే పాడాలి.

నిడివి: సినిమా మరియు సెమీ-క్లాసికల్ పాటలకు 5 నిమిషాలు, గీతం/స్వరజతికి 6 నిమిషాలు, వర్ణానికి 8 నిమిషాలు, క్లాసికల్ కృతి విభాగానికి 10 నిమిషాల సమయం కేటాయించారు.

రిజిస్ట్రేషన్ వివరాలు: ఈ పోటీల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల రెండో తేదీన ప్రారంభమైంది. నవంబరు 5న ముగుస్తుంది. ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత గడువులోగా పేర్లు నమోదు చేసుకోవాలి. ఈ పోటీలకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా Competitions@tagb.org ఈ-మెయిల్ ద్వారా నిర్వాహకులను సంప్రదించవచ్చు.




# మసాచుసెట్స్‌లో దసరా వేడుకలు



**మసాచుసెట్స్:** అమెరికాలోని గ్రేటర్ బోస్టన్ తెలుగు సంఘం ఆధ్వర్యంలో మసాచుసెట్స్‌లోని లిటిల్‌టన్ హైస్కూల్ పెర్ఫార్మెన్స్ ఆర్ట్స్ సెంటర్లో దసరా వేడుకలు వైభవంగా జరిగాయి. స్థానిక తెలుగు సమాజాల నుంచి 500 మంది హాజరయ్యారు. ప్రముఖ తెలుగు చలనచిత్ర నేపథ్య గాయని, గేయ రచయిత, వాయిస్ కోచ్ స్ఫూర్తి జితేందర్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమెరికాకు చెందిన లెహరి బ్యాండ్ ప్రతినిధులు డూడుల్, హోప్, హేమన్, సైమన్‌లతో కలిసి ఆమె అద్భుతమైన ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. 'సప్త తాండవ' నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా హైలెట్‌గా నిలిచింది. ష్రూస్‌బరీలోని 'నాట్యం స్కూల్ ఆఫ్ డాన్స్' సంస్థాపకురాలు ఆదిలక్ష్మి గొల్లపూడి నృత్య దర్శకత్వంలో జరిగిన ప్రదర్శనల్లో దాదాపు 40 మంది కళాకారులు పాల్గొన్నారు. తెలుగు సాంస్కృతిక వైభవానికి సుమారు 150 మంది కళాకారులు 30 రకాలకు పైగానే వినూత్నమైన ప్రదర్శనలను ఇచ్చారు. బతుకమ్మ సంబరాలు కూడా జరిగాయి. అన్ని వయసుల వారు అద్భుతంగా ఒకే రీతిలో బతుకమ్మ ఆడారు. ఇదే వేదికపై హుయ్ షీ నేతృత్వంలోని చైనీస్ నృత్య బృందం ప్రదర్శించిన చైనీస్ వాటర్ డాన్స్ తెలుగు ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతి పంచింది. పిల్లల కోసం నిర్వహించిన కథల పోటీల విజేతలతో పాటు, టెన్నిస్ క్రీడా పోటీల విజేతలకు వేదికపైనే బహుమతులు, ధ్రువపత్రాలను అందజేశారు. తెలుగు సమాజానికి సేవలు అందిస్తూ ప్రముఖ షార్ట్ ఫిల్మ్ వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించిన అవార్డు గ్రహీత, దర్శకుడు సంపత్ కందాళను సంఘం ప్రతినిధులు సత్కరించారు. ఇదే వేదికపై నుంచి సంస్థకి సంబంధించిన 2026-2027 నూతన కమిటీ, ధర్మకర్తల మండలిని కూడా ప్రకటించారు.

**కార్యనిర్వాహక కమిటీ:** సుధ మూల్పూర్ (అధ్యక్షురాలు), దీప్తి కోరిపల్లి (అధ్యక్షురాలిగా ఎన్నికైనవారు), జగదీష్ చిన్నం (కార్యదర్శి), సూర్య తేలప్రోలు (కోశాధికారి), మానస కృష్ణ (సాంస్కృతిక కార్యదర్శి).

**ధర్మకర్తల మండలి:** కాళిదాస్ సురపనేని (అధ్యక్షుడు), చంద్ర వల్లూరుపల్లి, కళ్యాణ్ కాకి, శిరీష కేతిరెడ్డి (సభ్యులు), శ్రీనివాస్ గొంది (సభ్యుడు).





## తప్పును ఒప్పుకున్న రణబీర్

దసరా ప్రసంగంలో మాట తడబడటంపై బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ క్షమాపణలు చెప్పాడు. తాను చెప్పాలనుకున్న దానికి బదులుగా మరో అర్థం వచ్చేలా రణ్‌బీర్ మాట్లాడాడు. దీంతో తన తాజా చిత్రం 'రామాయణం' ప్రచార కార్యక్రమంలో భాగంగా చెన్నైలో జరిగిన సంగీత వేడుకలో ఈ ఘటనపై స్పందించారు. తన తప్పును అంగీకరిస్తూ, గతంలో తాను నటించిన 'రాక్‌స్టార్' సినిమాలోని పాట పంక్తులను ప్రస్తావించారు. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో జరిగిన దసరా వేడుకకు 'రామాయణం' చిత్ర బృందం హాజరైంది. ఈ సందర్భంగా రణ్‌బీర్ కపూర్ మాట్లాడుతూ చెడు ఎంత శక్తివంతమైనదైనా చివరకు సత్యం, మంచితనమే గెలుస్తాయని చెప్పాలనుకున్నారు. అయితే, ఆయన మాటల్లో పొరపాటు చోటుచేసుకుంది.

చివరికి సత్యం, మంచితనమే అంతమవుతాయని అర్థం వచ్చేలా మాట్లాడారు.

## భారత సైన్యానికి అధునాతన రాడార్లు

దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సైన్యానికి అధునాతన, తేలికైన(ఎల్ఎల్ఎల్ఆర్ఐ) గగన తల రాడార్లను సమకూర్చేందుకు భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్(బెల్)తో రూ.770తో ఒప్పందం చేసుకున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. స్వదేశీ గగన తల రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడంలో ఇది కీలక ముందడుగు అని పేర్కొంది. ఈ రాడార్ వ్యవస్థ గగన తలంలో యుద్ధవిమానాల వంటి లక్ష్యాలను గుర్తించడంతోపాటు చిన్న చిన్న డ్రోన్లను సైతం గుర్తించగలదని రక్షణ శాఖ వెల్లడించింది. అంతేగాక పలు గగన తల లక్ష్యాల్లో దేనిపై ముందుగా దృష్టి సారించాలో నిర్ణయించే అదనపు సామర్థ్యం దీనికి ఉందని రక్షణ శాఖ వివరించింది. ఈ కారణంగా సైన్యానికి వాటిని గుర్తించి నిర్వీర్యం చేయడం సులభతరమవుతుందని తెలియజేసింది.





## గ్రాండ్ మాస్టర్‌గా మణిపూర్ ముఖ్యమంత్రి

### సత్కరించిన గ్లోబల్ ట్రెడిషనల్ తైక్వాండో ఫెడరేషన్

మణిపూర్ ముఖ్యమంత్రి యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఆయన్ను గ్లోబల్ ట్రెడిషనల్ తైక్వాండో ఫెడరేషన్ అత్యున్నత పురస్కారమైన 'గ్రాండ్‌మాస్టర్ 9వ డాన్'తో సత్కరించింది. ఖుమాన్ లంపాక్ ఇండోర్ స్టేడియంలో తొలి మణిపూర్ రాష్ట్ర తైక్వాండో ఛాంపియన్‌షిప్-2026 ప్రారంభోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జీటీటీఎఫ్ అధ్యక్షుడు గ్రాండ్‌మాస్టర్ జున్ లీ ముఖ్యమంత్రికి గ్రాండ్ మాస్టర్ గౌరవాన్ని అందజేశారు. తైక్వాండో క్రీడలో ఆయన చేసిన దీర్ఘకాలిక సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఖేమ్‌చంద్ తన మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలను, రిఫ్లెక్సెస్ ప్రదర్శించి అందరినీ ఆశ్చర్యపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తైక్వాండో పుట్టినిల్లయిన దక్షిణ కొరియా నుంచి జీటీటీఎఫ్ అధ్యక్షుడు జున్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడం సంతోషమన్నారు. అలానే వారి రాక మణిపూర్ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెడుతుందని అన్నారు. సీఎం ఖేమ్‌చంద్‌ను జున్ లీ ప్రశంసిస్తూ.. ఆయన 1980ల ప్రారంభంలో భారత్‌లోనే అత్యుత్తమ తైక్వాండో అభ్యాసకులలో ఒకరని జున్ లీ గుర్తుచేశారు. ఆయన అనేక సార్లు నేషనల్ ఛాంపియన్‌షిప్ టైటిల్ గెలుచుకోవడంతో పాటు, భారత్‌లో తైక్వాండోకు ప్రాచుర్యం కల్పించడంలో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన రాజకీయ నాయకుడిగా ఉన్నప్పటికీ, అంతకుముందే గొప్ప తైక్వాండో ఛాంపియన్‌గా నిలిచారని ప్రశంసించారు. రాష్ట్ర హోమ్, యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ మంత్రి గోవిందాస్ కొంథౌజమ్ మాట్లాడుతూ.. మణిపూర్‌లో అనేక మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, ఈ ఛాంపియన్‌షిప్ రాష్ట్రంలో బలమైన తైక్వాండో పోటీలకు పునాది వేస్తుందని చెప్పారు.




బీజేపీ యువజన విభాగమైన బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా తెలంగాణకు చెందిన సింధురెడ్డి కసిరెడ్డి నియమితులయ్యారు. బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ హేమాంగ్ జోషి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 34 మంది సభ్యులతో నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించారు. బీజేపీ అధ్యక్షుడు నితీన్ నబీన్ ఆదేశాల మేరకు ఈ నియమకాలను చేపట్టినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## పంజాబ్ ముఖ్యమంత్రికి జరిమానా!

### కేంద్ర కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని ఆప్ నేతల విమర్శ



పంజాబ్ ముఖ్యమంత్రి, భగవంత్‌మాన్‌కు ఢిల్లీ విమానాశ్రయంలో ఊహించని షాక్ తగిలింది. ఫ్రాన్స్ పర్యటన ముగించుకుని ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనను కస్టమ్స్ అధికారులు దాదాపు మూడు గంటల పాటు నిలిపివేసి, జరిమానా విధించారని మీడియా వర్గాలు పేర్కొన్నాయి. సీఎం భగవంత్ మాన్ తన లగేజీలోని కొన్ని లగ్జరీ వస్తువులను డిక్లేర్ చేయడంలో విఫలమయ్యారన్న కారణంతో అధికారులు కస్టమ్స్ సుంకం విధించినట్లు వెల్లడించాయి. పంజాబ్ వ్యవసాయ, ఆహారశుద్ధి ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రమోట్ చేసేందుకు భగవంత్‌మాన్ తన సిబ్బందితో కలిసి ఫ్రాన్స్ వెళ్లొచ్చారు. అయితే, ఢిల్లీ ఎయిర్‌పోర్టులో గ్రీన్ ఛానెల్ గుండా బయటకు వస్తున్న సమయంలో భగవంత్‌మాన్‌ను ఆపిన అధికారులు ఆయన సామగ్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిక్లేర్ చేయని కొన్ని లగ్జరీ వస్తువులు కనిపించడంతోనే కస్టమ్స్ డ్యూటీ కింద జరిమానా విధించినట్లు తెలుస్తోంది. మరోవైపు, సీఎంపై కస్టమ్స్ చర్యలను ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండించింది. మాన్ ఫ్రాన్స్ పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించిందని, ఈ నేపథ్యంలోనే పర్యటన జరిగిందని ఆప్ నేత సౌరబ్ భరద్వాజ్ తెలిపారు. కక్ష్యసాధింపు చర్యల్లో భాగంగానే కేంద్రం ముఖ్యమంత్రిని విమానాశ్రయంలో నిర్బంధించిందని, ఇది పంజాబీలకు జరిగిన అవమానమని మండిపడ్డారు. కేంద్రం ఒత్తిడి మేరకే అధికారులు ఈ విధంగా ప్రవర్తించారని విమర్శించారు.

## రాజకీయ ప్రహసనంగా రాహుల్ వియత్నాం పర్యటన

### జార్జ్ సోరోస్‌తో సంబంధాలున్నాయని అధికార పక్షాల విమర్శ, నాకేం తెలుసన్న శశిథరూర్





కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వియత్నాం పర్యటన రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసనలు కొనసాగిస్తున్న వేళ రాహుల్ విదేశీ పర్యటనకు వెళ్లారంటూ బీజేపీ విమర్శలు గుప్పించింది. ఇదే అంశంపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్‌ను మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ఆయన ఆసక్తికర సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా శశి థరూర్ మాట్లాడుతూ.. 'నేను ట్రావెల్ ఏజెంట్ కాదు. ఈ ప్రశ్న నన్ను అడగడంలో అర్థం లేదు. నేనిప్పుడు ఢిల్లీని వదిలి ఇక్కడికి ఎందుకు వచ్చాను? ప్రతి ఒక్కరికీ కొన్ని బాధ్యతలు ఉంటాయి. అందువల్ల ఈ విషయంపై నేను వ్యాఖ్యానించలేను' అని స్పష్టం చేశారు. కాగా, ప్రస్తుతం ఆయన కేరళంలోని తిరువనంతపురంలో పర్యటిస్తున్నారు. ఢిల్లీలో ఇటీవల ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసనలు చేపట్టాయి. ఆ సమయంలో రాహుల్ విదేశాలకు వెళ్లారంటూ బీజేపీ ఓ వీడియోను ఎక్స్ వేదికగా షేర్ చేసింది. అందులో కాంగ్రెస్ అగ్రనేత విమానంలో ఉన్నట్లు కనిపిస్తున్నారు. ఈ సందర్భంగా రాహుల్ విదేశీ పర్యటనకు వెళ్లడాన్ని బీజేపీ ఎద్దేవా చేసింది. రాజకీయ కార్యక్రమాల కంటే విదేశీ పర్యటనలకే ఆయన ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించింది. బీజేపీ నేత సంబిత్ పాత్రా తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్‌కు జార్జ్ సోరోస్‌తో సంబంధాలు ఉన్నాయని, భారతదేశంలో ప్రభుత్వ మార్పునకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకే ఆయన విదేశాలకు వెళ్లారని పాత్రా పేర్కొన్నారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై బీజేపీ విమర్శలు చేయడాన్ని కాంగ్రెస్ నేతలు తప్పుబట్టారు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత బాధ్యతలు, కార్యక్రమాలు ఉంటాయని.. రాహుల్ పర్యటనను రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఒక వ్యక్తి మాత్రమే కాకుండా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగానూ బాధ్యతలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా విదేశాల్లోని యేల్ విశ్వవిద్యాలయ విద్యార్థులతో సమావేశాలు, లండన్‌లో విద్యార్థులు, మేధావులతో చర్చలు వంటి కార్యక్రమాల్లో రాహుల్ పాల్గొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

# భారత్‌ను కాదని పాక్‌కు దగ్గరయ్యే ప్రసక్తి లేదు



## అమెరికా విదేశాంగ మంత్రి రూబియో వెల్లడి

ఉగ్రవాదం విషయంలో తాము భారత్ ఆందోళనను అర్థం చేసుకున్నామని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న ఆయన జాతీయ మీడియాకు తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ వ్యక్తం చేస్తున్న ఆందోళన తమకూ ఉందని అన్నారు. భారత్‌ను కాదనుకుని పాక్‌కు దగ్గరయ్యే ప్రశ్నే లేదని చెప్పారు. పాక్ సహా అన్ని దేశాలతో సంబంధాలు నెరపాల్సిన అవసరం అమెరికాకు ఉందని మంత్రి రూబియో పేర్కొన్నారు. దౌత్యబంధాల్ని కొనసాగించడం ద్వారా పాక్ నిర్ణయాలను కొంత ప్రభావితం చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దాయాది దేశాల దౌత్యంతో ఘర్షణలు తీవ్రరూపం దాల్చకుండా అడ్డుకునే అవకాశం ఉందని చెప్పారు. భారత్, అమెరికా మధ్య దీర్ఘకాలిక బంధం ఉందని అన్నారు. పాక్‌తో దౌత్యబంధం ఇటీవల కాలంలో కొంత మెరుగైందని చెప్పారు. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు అమెరికా సిద్ధంగానే ఉందని అన్నారు. ఇరు దేశాల మధ్య యుద్ధం జరగడం అమెరికాకు ఇష్టం లేదని మంత్రి రూబియో చెప్పారు. రెండు దేశాలు అభివృద్ధి, వాణిజ్యంపై దృష్టి పెట్టాలని కోరారు. అమెరికా కూడా ఉగ్రవాదం బారిన పడిందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా టెర్రరిస్టుల ఆటకట్టించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మిగతాదేశాలన్నిటికంటే ఉగ్రవాదంపై అమెరికా తీవ్రంగా పోరాడుతోందని అన్నారు. ఆఫ్రికాలోని టెర్రరిస్టు గ్రూపులపై తీసుకున్న చర్యల గురించి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఉగ్రవాద కట్టడి కోసం తమ నిబద్ధతను ఇప్పటికే పలుమార్లు చాటుకున్నామని చెప్పారు.



# అట్లాంటిక్ పేరు మార్పునకు పిచాయ్ నో...!

## తాజాగా యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడి

అట్లాంటిక్ మహాసముద్రం పేరు మార్పునకు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అస్సలు అంగీకరించలేదని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా తెలిపారు. 'నేను పేరు మారుద్దామని అన్నాను.. ఆయనేమో వద్దు, వద్దు.. అన్నారు. ఈసారి నా వల్ల కాదని అన్నారు' అని ఇటీవల టెన్నిస్సీ రాష్ట్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో ట్రంప్ తెలిపారు. 'సర్.. సముద్రాల వ్యవహారం వేరు. అవి చాలా దేశాలతో ముడిపడి ఉంటాయి. దయచేసి అలా చేయాలని మాత్రం అనొద్దు' అని పిచాయ్ చెప్పినట్టు వివరించారు. పదవిలోంచి దిగిపోయేలోపు అట్లాంటిక్ మహాసముద్రం పేరును అమెరికా సముద్రంగా మార్చాలని యూఎస్ అధ్యక్షుడు ఉవ్విళ్లూరుతున్న విషయం తెలిసిందే. ఏదైనా సముద్రానికి అమెరికా పేరు ఉంటే బాగుంటుందని ఎవరో తనకు సూచించినట్టు ట్రంప్ చెప్పుకొచ్చారు. 'గల్ఫ్ (గల్ఫ్ ఆఫ్ మెక్సికో) పేరును మార్చాం. సరస్సు (ఒంటారియో) పేరును కూడా మార్చుకున్నాము. ఏదైనా నదికి కూడా అమెరికా పేరు పెట్టాలని ఎవరో సూచించారు. దాంతో పాటు సముద్రం పేరు మార్చాలని కూడా అన్నారు. ట్రంప్ సముద్రమని పిలిస్తే బాగుంటుందని నాకు అనిపించింది' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఇటీవలే గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును ట్రంప్ గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చిన విషయం తెలిసిందే. కెనడాతో సరిహద్దుగా ఉన్న ఒంటారియో సరస్సును కూడా అమెరికా సరస్సుగా మార్చేశారు. ట్రంప్ ఆదేశాల మేరకు గూగుల్ మ్యాప్స్‌లో లేక్ ఒంటారియో పేరు లేక్ అమెరికాగా మారింది. అయితే, ఈ మార్పు కేవలం అమెరికన్ గూగుల్ మ్యాప్స్‌లో మాత్రమే కనిపిస్తుందని చెప్పింది. కెనడా వాసులకు మాత్రం లేక్ ఒంటారియోగానే ఉంటుందని పేర్కొంది. ఇతర దేశాల వారికి మాత్రం ఒంటారియో పేరు పక్కన లేక్ అమెరికా పేరు బ్రాకెట్స్‌లో కనిపిస్తుందని గూగుల్ ఒక ప్రకటనలో తెలిపింది.

# తాజా ప్రతిపాదనలతో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగింపు!

## త్రైపాక్షిక శాంతి చర్చలకు రష్యా సూత్రప్రాయంగా అంగీకారం



రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా, ఉక్రెయిన్‌లతో కలిసి త్రైపాక్షిక శాంతి చర్చలను తిరిగి ప్రారంభించేందుకు రష్యా సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ పరిణామంతో యుద్ధానికి ముగింపు దగ్గరపడుతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ సమావేశమైన అనంతరం ఈ పరిణామం వెలుగులోకి వచ్చింది. వచ్చే నెల పదవ తేదీ తర్వాత అమెరికా, ఉక్రెయిన్‌లతో చర్చలను తిరిగి ప్రారంభించేందుకు పుతిన్ సూత్రప్రాయంగా అంగీకరించారు. యుద్ధం ముగిసిన తర్వాత రష్యా, ఉక్రెయిన్‌లకు సంబంధించిన భద్రతా వ్యవస్థను రూపొందించడం ఈ చర్చల్లో ప్రధాన అంశంగా ఉండనుంది. అమెరికా మధ్యవర్తిత్వంతో చర్చలు తిరిగి ప్రారంభించేందుకు ఉక్రెయిన్ కూడా సుముఖత వ్యక్తం చేసింది. వీలైనంత త్వరగా చర్చలు జరగాలని, యుద్ధాన్ని ముగించి శాంతిని నెలకొల్పడమే తమ లక్ష్యమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ పేర్కొన్నారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే ప్రయత్నాల్లో చాలా పురోగతి కనిపిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. యుద్ధానికి ముగింపు పలికే విషయంలో ప్రస్తుతం అత్యంత కీలక దశలో ఉన్నామని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, రష్యాతో చర్చలను ముందుకు తీసుకెళ్లడంలో అమెరికా కీలక పాత్ర పోషిస్తోంది. రష్యాలో పుతిన్‌తో జరిగిన సమావేశంలో స్టీవ్ విట్‌కాఫ్‌తో పాటు ఇతర ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. యుద్ధాన్ని ముగించేందుకు కొత్త ప్రతిపాదనలను పరిశీలించారు. అంతకుముందు నార్వేలో జెలెన్స్కీతో కూడా అమెరికా ప్రతినిధులు చర్చలు జరిపారు.

## విజయవాడలో బంగ్లాదేశ్ బంగారం పట్టివేత




విదేశాల నుంచి అక్రమంగా బంగారం, విదేశీ కరెన్సీని తరలిస్తున్న స్మగ్లింగ్ ముఠా గుట్టును డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు రట్టు చేశారు. బంగ్లాదేశ్ నుంచి బంగారాన్ని అక్రమంగా కోల్‌కతాకు తీసుకొచ్చి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా విజయవాడ శివారులో ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 3.1 కేజీల బంగారం బిస్కెట్లతోపాటు, 60 వేల అమెరికన్ డాలర్లు, 21,500 యూరోలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను డీఆర్ఐ అధికారులు బుధవారం వెల్లడించారు. బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతా మీదుగా హైదరాబాద్‌కు బంగారం అక్రమంగా తరలిస్తున్నారని డీఆర్ఐ అధికారులకు సమాచారం అందింది. దీంతో హైదరాబాద్ జోనల్ యూనిట్ (హెచ్‌జడ్‌యూ), విజయవాడ ప్రాంతీయ కార్యాలయం (ఆర్‌వో) అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి.. ఈ నెల 18న విజయవాడ శివారులో ఓ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఆ వాహనంలో ప్రత్యేకంగా చేయించిన రహస్య అరలో 60,000 డాలర్లు, 21,500 యూరోలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా.. విజయవాడ శివారులో ముగ్గురు వ్యక్తులకు బంగారం అందించామని, వారు దాన్ని తీసుకుని ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్ వెళ్తున్నారని వెల్లడించారు. ఈ సమాచారంతో బస్సును అడ్డగించి, అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు అనుమానితులను సోదా చేయగా.. వారి నడుముకు కట్టుకున్న పౌచ్‌ల్లో మూడు బంగారం బిస్కెట్లు లభ్యమయ్యాయి. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, ఆర్థిక నేరాల విచారణ కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించిందని పేర్కొన్నారు.



# లాడెన్ మాదిరిగా పాకిస్థాన్‌లోనే దావూద్!

## అంతర్జాయ వేదికపై మరోసారి ఢంకా బజాయించి చెప్పిన భారత్

మోస్ట్ వాంటెడ్ నేరస్థుడైన దావూద్ ఇబ్రహీం పాకిస్థాన్‌లోనే ఉన్నాడని ఐక్యరాజ్యసమితి వేదికగా భారత్ మరోసారి స్పష్టం చేసింది. మానవ హక్కులపై ఐరాస ప్రత్యేక ప్రతినిధి బెన్ సాల్ సమర్పించిన నివేదికలో వాస్తవాలకు విరుద్ధమైన అంశాలున్నాయని అభ్యంతరం వ్యక్తం చేసింది. దావూద్ ఇబ్రహీం పాకిస్థాన్‌లోనే నివసిస్తున్నాడని, గతంలో అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ కూడా అక్కడే హతమయ్యాడని భారత దౌత్యవేత్త రఘు పూరి పేర్కొన్నారు. ఐరాస ప్రత్యేక ప్రతినిధి బెన్ సాల్ తన నివేదికలో డీ కంపెనీని భారత్‌కు చెందిన నేర సంస్థగా పేర్కొన్నారు. దాని అధినేత దావూద్ ఇబ్రహీంకు ఉగ్రవాద సంబంధాలున్నాయని, అతడు భారత్‌లోనే ఉన్నాడని, డీ కంపెనీ భారత్ కేంద్రంగా పని చేస్తోందని నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదికపై భారత్ అభ్యంతరం తెలిపింది. దావూద్ 1993 ముంబై వరుస పేలుళ్ల కేసుల్లో నిందితుడని, అతడి కోసం భారత్ చాలా కాలంగా ప్రయత్నిస్తోందనే అంశాన్ని నివేదికలో తగిన రీతిలో ప్రస్తావించలేదని భారత ప్రతినిధి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి కీలక విషయాలను విస్మరించడం వల్ల నివేదికపై విశ్వసనీయత దెబ్బతింటుందని వ్యాఖ్యానించారు. దావూద్ ఇబ్రహీం ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్నాడని, ఒసామా బిన్ లాడెన్‌ను గుర్తించిన దేశంలోనే అతడు నివసిస్తున్నాడని ఐరాస రికార్డులను ఉటంకిస్తూ రఘు పూరి పేర్కొన్నారు. అతడి కోసం భారత్ వెతుకుతోందనే విషయాన్ని కూడా ప్రస్తావించాల్సిందని పూరి అన్నారు. 1993 మార్చి 12న ముంబైలో జరిగిన వరుస బాంబు దాడుల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. డీ కంపెనీ అనే నేర ముఠాకు అతడే నాయకుడని భారత దర్యాప్తు సంస్థలు పేర్కొంటున్నాయి. దావూద్‌ను అప్పగించాలని భారత్ పలుమార్లు పాకిస్థాన్‌ను కోరింది. అతడు పాకిస్థాన్‌లో నివసిస్తున్నాడని భారత్ చెబుతుండగా, పాకిస్థాన్ గతంలో ఈ ఆరోపణలను ఖండించింది.

# భారత్ శుభారంభం

**తొలి టీ20లో న్యూజిలాండ్‌పై ఘన విజయం**

మొన్నటిదాకా స్వదేశంలో ఆడిన టీమిండియా దాదాపు నెల రోజులు సాగే పర్యటన కోసం న్యూజిలాండ్‌లో అడుగుపెట్టింది. ప్రయాణబడలిక తీరకముందే మైదానంలోకి దిగాల్సి వచ్చింది. ఎలా ఆడతారోనని అభిమానులు కాస్త ఆందోళనకు గురైనా.. తమకు ఎలాంటి ఇబ్బంది లేదని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాటలను నిజం చేస్తూ టీమిండియా అదరగొట్టింది. రికార్డు లక్ష్య ఛేదన చేసి చరిత్ర సృష్టించింది. ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

క్రైస్ట్‌చర్చ్: నమన్ ధీర్ స్టన్నింగ్ బ్యాటింగ్ చేశాడు. కేవలం 15 బంతుల్లోనే అతను 42 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 5 బౌండరీలు, రెండు సిక్సర్లు ఉన్నాయి. 280 స్ట్రయిక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. దీంతో కివీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో.. టీమిండియా 4 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది. 226 రన్స్ భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన భారత్ మరో రెండు బంతులు మిగిలి ఉండగానే విక్టరీని ఖాతాలో వేసుకుని ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆధిక్యాన్ని సాధించింది. భారత ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఆరంభంలో ఊచకోత కోశారు. ఆ ఇద్దరూ తొలి వికెట్‌కు 93 రన్స్ జోడించారు. పవర్‌ప్లేలో సంజూ, అభిషేక్ బౌండరీలతో హోరెత్తించారు. అభిషేక్ 12 బంతుల్లో 2 ఫోర్లు, మూడు సిక్సర్లతో 29 రన్స్ చేశాడు. ఇక శాంసన్ 33 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 67 రన్స్ చేశాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ కూడా బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడాడు. అతను 28 బంతుల్లో 42 రన్స్ స్కోరు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.



ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 225 రన్స్ చేసింది. ఫిన్ అలెన్, గ్లెన్ ఫిలిప్స్ ఇద్దరూ విధ్వంసకర బ్యాటింగ్ చేశారు. అలెన్ 24 బంతుల్లో 45, ఫిలిప్స్ 40 బంతుల్లో 82 రన్స్ చేశారు. టీ20ల్లో స్వదేశీ పిచ్‌పై కివీస్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. దాదాపు నాలుగేళ్లు ఇంటర్నేషనల్ క్రికెట్ దూరంగా ఉన్న భువనేశ్వర్ కుమార్ ఈ మ్యాచ్‌లో ఆడాడు. అయితే అంతగా ఆకట్టుకోలేకపోయాడు. అతని ఖాతాలో వికెట్ పడలేదు. కివీస్ ఓపెనర్ టిమ్ సీఫర్ట్ 17 బంతుల్లో 24 రన్స్ చేశాడు. న్యూజిలాండ్ చివరి 30 బంతుల్లో 67 రన్స్ చేసింది. అర్షదీప్, అక్షర్, మయాంక్ యాదవ్ చెరో ఒక వికెట్ తీసుకున్నారు.



## హ్యారీ బ్రూక్ ప్రపంచ రికార్డు

**114 బంతుల్లోనే డబుల్ సెంచరీ**

**వన్డేల్లో అత్యంత వేగవంతమైన ద్విశతకం**

వన్డే క్రికెట్ చరిత్రలో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పేరిట ఉన్న ఆ ఘనతను బ్రూక్ అధిగమించాడు. ఇక ఇంగ్లాండ్ తరపునా ఆ ఫీట్ సాధించిన తొలి ప్లేయర్‌గా నిలిచాడు. ఇంతకీ అదేంటంటారా? వన్డేల్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ చేసిన క్రికెటర్‌గా హ్యారీ బ్రూక్ అవతరించాడు. శ్రీలంకతో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 429 పరుగులు చేసింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (202: 116 బంతుల్లో 21 ఫోర్లు, 10 సిక్సులు) అదరగొట్టాడు. కేవలం 114 బంతుల్లోనే డబుల్ సెంచరీ బాదేసాడు. ఈ క్రమంలో గిల్ (117 బంతుల్లో) పేరిట ఉన్న వేగవంతమైన ద్విశతకం ఘనతను బ్రూక్ అధిగమించాడు. ఇక ఇంగ్లాండ్ తరపున డబుల్ సెంచరీ.. అత్యధిక వ్యక్తిగత నమోదు చేసిన బ్యాటరూ బ్రూకే కావడం గమనార్హం. గతంగా బెన్ స్టోక్స్ న్యూజిలాండ్‌పై 2023లో చేసిన 182 పరుగులే ఇప్పటిదాకా అత్యధిక వ్యక్తిగత స్కోరు. ఇప్పుడు ఆ ఘనతనూ బ్రూక్ తన ఖాతాలో వేసుకున్నాడు.

## ఆర్చరీలో శీతల్‌దేవి అద్భుతం

# పారా గేమ్స్‌లో రెండో స్వర్ణం



నగోయా: శీతల్‌దేవికి చేతులు లేవు. కానీ ఆమె ఆర్చరీలో దిట్ట. ఇండియన్ ఆర్చర్ శీతల్ దేవి ఏషియన్ పారా గేమ్స్‌లో రెండో స్వర్ణం గెలిచింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత ఈవెంట్‌లోనూ ఆమె గోల్డ్ మెడల్ గెలుచుకుంది. ఉత్కంఠంగా సాగిన ఫైనల్లో ఆమె సింగపూర్ అథ్లెట్ ఆలిమ్ నుర్ స్యాహిదాను ఓడించింది. తోమన్ కుమార్‌తో కలిసి కాంపౌండ్ మిక్స్ టీమ్ గోల్డ్ మెడల్ గెలిచిన కొన్ని గంటల వ్యవధిలోనే వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్‌లో శీతల్‌దేవి అద్భుత ప్రదర్శన ఇచ్చి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నది. 19 ఏళ్ల వరల్డ్ చాంపియన్ శీతల్‌దేవి 142-139 స్కోర్‌తో ఆలిమ్‌పై విజయం సాధించింది. 2023 హాంగ్‌జూ గేమ్స్‌లోనూ ఆమె ఆలిమ్‌పైనే విక్టరీ కొట్టింది. ప్రస్తుత పారా గేమ్స్‌లో శీతల్‌దేవి ఖాతాలో మొత్తం మూడు పతకాలు ఉన్నాయి. మహిళల డబుల్స్ సిల్వర్ కూడా గెలిచిందామె.



## పారా ఆసియా క్రీడలు

**శీతల్‌దేవి హ్యాట్రిక్ స్వర్ణాలు, మెరిసిన భారత అథ్లెట్లు**

పారా ఆసియా క్రీడల్లో భారత్ ఐదో రోజూ మెరుగైన ప్రదర్శన చేసింది. ఇప్పటికే రెండు స్వర్ణాలను ఖాతాలో వేసుకుంది. దీంతో 73 పతకాలతో ఐదో స్థానంలో నిలిచింది. ఇందులో 17 స్వర్ణాలు, 22 రజతాలు, 34 కాంస్యాలు ఉన్నాయి. మహిళల వ్యక్తిగత విభాగంలో రజతం సాధించిన శీతల్ దేవి.. మిక్స్‌డ్ డబుల్స్‌లో రాకేష్ కుమార్‌తో కలిసి స్వర్ణం సొంతం చేసుకుంది. ఫైనల్లో భారత్ 151-148 తేడాతో ఇండోనేషియాను ఓడించింది. మహిళల డిస్కస్ త్రో ఛీ55 విభాగంలో భారత అథ్లెట్ పూజ 15.66 మీటర్లు విసిరి రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం నెగ్గిన ఆమె.. మహిళల కాంపౌండ్ విభాగంలోనూ బంగారు పతకం కైవసం చేసుకుంది. ఫైనల్లో సింగపూర్ ఆర్చర్ అలీమ్ నూర్ సైదాపై 142-138 తేడాతో విజయం సాధించింది. దీంతో పారా ఆసియా క్రీడల్లో శీతల్ దేవి ప్రయాణం పసిడితో ముగిసింది.

ఆసియా పారా గేమ్స్‌లో పోటీ పడిన మొదటి భారత డబ్ల్యూ1 ఆర్చర్ స్వాతి చౌదరి. డబ్ల్యూ1 అంటే.. తీవ్రమైన శారీరక వైకల్యం ఉన్న వీల్‌చైర్ ఆర్చరీ విభాగం. వీల్‌చైర్‌లో కూర్చొని పోటీపడతారు. ఈ విభాగంలో స్వాతి ఫైనల్‌కు చేరి చరిత్ర సృష్టించింది. మొదటి సెట్ గెలుచుకున్న ఆమె.. ఆ తర్వాత లయ కోల్పోయింది. చివరికి 4-6 తేడాతో ఓడిపోయి రజతం సాధించింది.

బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ SL3 విభాగంలో సంజన కుమారి కాంస్యం నెగ్గింది. అంతకు ముందు పురుషుల సింగిల్స్ SL4 కేటగిరీలో సుహాస్ యతిరాజ్, అభినవ్ కాంస్యాలు సాధించారు. వీరిద్దరూ తమ సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్ SH6 విభాగంలో కృష్ణ నాగర్ -నిత్యశ్రీ జోడీ కాంస్యంతో సరిపెట్టుకుంది. ఇండోనేషియాకు చెందిన దినా మార్లినా-సుభాన్ 14-21, 18-21 తేడాతో భారత జోడీపై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ SL3 కేటగిరీలో మనీషా రామదాస్-ప్రమోద్ భగత్‌కు కాంస్యమే వచ్చింది.

## మహిళల టీ20 సిరీస్...

# భారత్ క్లీన్ స్వీప్



రాయ్‌పూర్: స్మృతి మంధాన కెప్టెన్ అయ్యాక ఆడిన తొలి టీ20 సిరీస్‌ను భారత మహిళల క్రికెట్ జట్టు క్లీన్ స్వీప్ చేసింది. మూడో టీ20లో 92 పరుగుల భారీ తేడాతో జింబాబ్వేను చిత్తు చేసిన భారత్.. సిరీస్‌ను 3-0తో చేజిక్కించుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 216 పరుగుల స్కోరు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' హర్మన్ ప్రీత్ (91 నాటౌట్; 41 బంతుల్లో 10x4, 5x6), షెఫాలి వర్మ (69; 37 బంతుల్లో 6x4, 5x6) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. కెప్టెన్ స్మృతి మంధాన బ్యాటింగ్‌కు దిగకుండా, యువ బ్యాటర్ అనుష్క శర్మ (28)ను ఓపెనర్‌గా పంపింది. జింబాబ్వే బౌలర్లలో బీజా 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వేను భారత బౌలర్ నందని శర్మ (3/18) విలయతాండవంతో దెబ్బతీసింది. దీంతో జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లకు 124 పరుగులకే పరిమితమైంది. జింబాబ్వే బ్యాటర్లలో షార్న్ మేయర్స్ (60) టాప్ స్కోరర్‌గా నిలిచింది.

## మహిళల డిస్కస్ త్రోలో సువర్ణ రాజ్‌కు స్వర్ణం



మహిళల డిస్కస్ త్రో ఎఫ్54 ఈవెంట్‌లో భారత్ అథ్లెట్ సువర్ణ రాజ్ స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. ఈ పోటీలో ఆమె అత్యుత్తమంగా 15.66 మీటర్ల దూరం విసిరింది. మొత్తం ఆరుగురు అథ్లెట్లు తలపడిన ఈ ఫైనల్‌లో సువర్ణరాజ్ అత్యంత స్థిరమైన ప్రతిభ కనబరిచింది. ఆరు ప్రయత్నాల్లో ఏకంగా నాలుగు సార్లు 15 మీటర్ల మార్క్‌ను దాటింది. ముఖ్యంగా ఐదో ప్రయత్నంలో 15.66 మీటర్ల దూరం విసిరి తొలి స్థానంలో నిలిచింది.

## భువీ వరల్డ్ రికార్డు



క్రైస్ట్‌చర్చ్: టీమిండియా పేసర్ భువనేశ్వర్ కుమార్ నాలుగేళ్ల విరామం తర్వాత తిరిగి అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేశాడు. ఈ క్రమంలో అతడు వరల్డ్ రికార్డు సృష్టించాడు. పవర్‌ప్లేలో అత్యధిక డాట్ బాల్స్ వేసిన బౌలర్‌గా నిలిచాడు. తద్వారా న్యూజిలాండ్ మాజీ పేసర్ టిమ్ సౌథీ రికార్డును భువీ బ్రేక్ చేశాడు. క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దీంతో కివీస్ జట్టు బ్యాటింగ్‌కు దిగింది. తొలి ఓవర్ వేసిన భువనేశ్వర్ కేవలం నాలుగు పరుగులే ఇచ్చి మూడు డాట్ బాల్స్ వేశాడు. దీంతో పూర్తి సభ్య దేశాల బౌలర్లలో అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌ల పవర్‌ప్లేలో అత్యధిక డాట్ బాల్స్ వేసిన బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు.

చైతన్య రథం
సినిమా
శుక్రవారం 23 అక్టోబరు 2026 XI

# పెళ్లి పీటలు ఎక్కబోతున్న 'హనుమాన్' హీరో తేజ సజ్జ

## ఉదయ్‌పూర్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్



టాలీవుడ్ యంగ్ హీరో, 'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ వార్తను స్వయంగా ఆయనే ధ్రువీకరించారు. తన పెళ్లికి సంబంధించిన ఆసక్తికర విషయాలను అభిమానులతో పంచుకున్నారు.రాజస్థాన్‌లోని చారిత్రాత్మక నగరమైన ఉదయ్‌పూర్‌లో ఈ ఏడాది డిసెంబర్‌లో తన వివాహం అత్యంత నిరాడంబరంగా జరగనుందని తేజ వెల్లడించారు. తన తల్లిదండ్రులే ఈ సంబంధం నిశ్చయించారని తెలిపారు. నవంబరులో నిశ్చితార్థ వేడుక నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లో టాలీవుడ్ ప్రముఖులు, స్నేహితులకోసం ప్రత్యేకంగా ఒక ఘనమైన రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇక తన కాబోయే భార్య గురించి చెబుతూ.. ఆమెకు సినీ పరిశ్రమతో ఎలాంటి సంబంధం లేదని తేజ వెల్లడించారు. ఆమె కుటుంబం టెక్నాలజీ రంగంలో వ్యాపారం చేస్తోందని, ఆమె కూడా తన తండ్రితోకలిసి అదే రంగంలో పనిచేస్తున్నారని చెప్పారు.

ఆమె అమెరికాలో పెరిగారని, సినిమా గ్లామర్ ప్రపంచానికి, లైమ్‌లైట్‌కు పూర్తిగా దూరంగా ఉన్నారని తెలిపారు. సెలబ్రిటీ ప్రపంచానికి దూరంగా ఉండే ఆమె స్వభావమే తనకు బాగా నచ్చిందని, భవిష్యత్తులో కూడా ఆమె ప్రైవసీకి ఎటువంటి భంగం కలగకుండా చూసుకుంటానని తేజ సజ్జ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ప్రముఖ రియాలిటీ షో 'ది ట్రైటర్స్ తెలుగు' తొలి సీజన్‌కు హోస్ట్ వ్యవహరిస్తూ బిజీగా ఉన్నారు.

### 'రణబాలి' గ్రాండ్ సక్సెస్ ఈవెంట్‌కు

# ముహూర్తం ఫిక్స్... ఎక్కడంటే?




టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్నా జంటగా నటించిన చిత్రం 'రణబాలి'. దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కించిన ఈ సినిమా దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం అభిమానులకు మరో ఆసక్తికరమైన వార్తను అందించింది. సినిమా విజయాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న గ్రాండ్ సక్సెస్ ఈవెంట్‌కు వేదిక, సమయాన్ని ఖరారు చేసింది. అనంతపురం జిల్లాలోని రాప్తాడు సమీపంలో ఉన్న హార్మోని సిటీలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు వేడుక ప్రారంభం కానుంది. ఈ మేరకు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సినిమా విజయాన్ని అభిమానులతో కలిసి జరుపుకునేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో విజయ్ దేవరకొండ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమానికి చిత్ర బృందం హాజరయ్యే అవకాశం ఉండటంతో వేడుకపై ఆసక్తి మరింత పెరిగింది. తమ అభిమాన హీరోను ప్రత్యక్షంగా చూసేందుకు అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఈ వేడుకలో చిత్ర విజయంపై నటీనటులు, దర్శకుడు ఎలాంటి విషయాలు పంచుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.



## మెగా మేనల్లుడి పెళ్లి ఫిక్స్!

మెగా ఫ్యామిలీలో మరోసారి పెళ్లి సందడి మొదలుకానుందా? అంటే అవుననే మాటే వినిపిస్తోంది. మెగా హీరో సాయి దుర్గా తేజ్ త్వరలో వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టబోతున్నారంటూ టాలీవుడ్‌లో ఇంట్రెస్టింగ్ డిస్కషన్ నడుస్తోంది. ఆయన పెళ్లికి సంబంధించిన వార్తలు ప్రస్తుతం సినీవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. నవంబర్లోనే పెళ్లి వేడుక జరగనుందనే ప్రచారం ఊపందుకోగా... దీనిపై అఫీషియల్ ఇన్ఫర్మేషన్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ వార్తలపై మెగా ఫ్యామిలీ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.తాజా ప్రచారం ప్రకారం.. నవంబరు 5న సాయి దుర్గాతేజ్ ఎంగేజ్‌మెంట్ నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆయన చేసుకోబోయే అమ్మాయి చిన్ననాటి స్నేహితురాలనే వార్తకూడా వినిపిస్తోంది. ఇరు కుటుంబాల అంగీకారంతోనే ఈ పెళ్లిఫిక్స్ అయినట్టు వార్తలొస్తున్నాయి. అయితే ఈ పెళ్లి ప్రేమ వివాహమా, కుటుంబ సభ్యులు కుదిర్చిన సంబంధమా అనే విషయంపై క్లారిటీ లేదు.వేడుకను కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులసమక్షంలో పరిమిత స్థాయిలో నిర్వహించనున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అఫీషియల్ కన్ఫర్మేషన్ వచ్చే వరకు వీటిని రూమర్లుగానే చూడాలి.

# ఎన్టీఆర్‌తో సినిమానా!

### కథ తీసుకెళ్తే కొడతాడంటూ విశ్వక్ సేన్ కామెంట్స్



యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్‌కు టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్‌సేన్ వీరాభిమాని అనే విషయం తెలిసిందే. తారక్ నటన, డ్యాన్స్, డైలాగ్ డెలివరీ తనకు ఎంతో ఇష్టమని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకున్నానని విశ్వక్ పలు సందర్భాల్లో వెల్లడించారు.అటు ఎన్టీఆర్ కూడా తన అభిమానహీరో విశ్వక్ సేన్‌కు అండగా నిలుస్తూ ఆయన సినిమాల కార్యక్రమాలకు హాజరయ్యారు.ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఎన్టీఆర్‌ను తన దర్శకత్వంలో తెరకెక్కించే అవకాశం ఉందా? అనే ప్రశ్నకు విశ్వక్ ఇచ్చిన సమాధానం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

విశ్వక్‌సేన్ హీరోగానేకాకుండా దర్శకుడిగానూ తన ప్రతిభను నిరూపించుకున్నారు. 'ఫలక్‌నుమా దాస్','దాస్ కా ధమ్కీ' వంటి సినిమాలకు దర్శకత్వం వహించారు.ప్రస్తుతం తన స్వీయ దర్శకత్వంలో 'కల్ట్' అనే చిత్రాన్ని రూపొందించారు.ఈసినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయనకు... ఎన్టీఆర్‌తో సినిమా చేసే అవకాశం గురించి ప్రశ్న ఎదురైంది. దీనికి విశ్వక్ సరదాగా స్పందించారు. ఒక వేదికపై ఎన్టీఆర్ తనతో దర్శకత్వం చేయొద్దనిచెప్పిన విషయాన్నిగుర్తు చేసుకున్నారు. తాను తారక్ దగ్గరకు కథ తీసుకెళ్తే.. 'ముందు నటనపై దృష్టి పెట్టు' అని అంటాడని, సరదాగా తనను కొట్టినా కొడతాడని నవ్వుతూ వ్యాఖ్యానించారు. విశ్వక్ చేసిన ఈ వ్యాఖ్యలు అభిమానుల్లో ఆసక్తి పెంచుతున్నాయి.

విశ్వక్ సేన్ తన తాజా చిత్రం 'కల్ట్'లో పోలీస్ అధికారిగా కనిపించనున్నారు. ఈ పాత్రను ఒకవేళ తాను చేయకపోతే తన మొదటి ఎంపిక జూనియర్ ఎన్టీఆరే అని ఆయన వెల్లడించారు. ఆ పాత్రకు తారక్ ఎంతో బాగా సరిపోతారని అభిప్రాయపడ్డారు. దీంతో ఎన్టీఆర్‌పై విశ్వక్‌కు ఉన్నఅభిమానం మరోసారి స్పష్టమైంది. 'కల్ట్'చిత్రాన్ని భారతదేశపు తొలి స్లాషర్ సినిమాగా చిత్ర బృందం ప్రచారం చేస్తోంది.ఇప్పటికే ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. ఈనెల 30న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. కాగా విశ్వక్‌సేన్ త్వరలో వరుసగా మూడు సినిమాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'కల్ట్'తోపాటు 'ఈ నగరానికి ఏమైంది రిపీట్', 'లెగసీ'చిత్రాలు కూడా విడుదలకు సిద్ధమవుతున్నాయి. తక్కువ వ్యవధిలో ఇన్ని సినిమాలు రావడంపై స్పందించిన విశ్వక్.. తాను వరుసగా సినిమాలు చేస్తున్నానని చెప్పి ప్రేక్షకులపై దాడిచేయట్లేదని సరదాగా అన్నారు.

## 'రియాలిటీ' నుంచి బ్లాక్‌బస్టర్ వీడియో సాంగ్

# 'భజ గోవిందం' రిలీజ్



ప్రామిసింగ్ హీరో కిరణ్ అబ్బవరం తన ప్రతిష్టాత్మక చిత్రం 'రియాలిటీ'తో నిత్య జీవితంలోని సహజమైన భావోద్వేగాలను, మన చుట్టూ ఉండే చిన్న చిన్న ఆనందాలను అందంగా ప్రజెంట్ చేయడానికి సిద్ధమవుతున్నారు. 'క', 'కె-రాంప్' చిత్రాల విజయాలతో జోరుమీదున్న ఆయన ఈ సినిమాకు హీరోగా నటించడంతో పాటు కథ, స్క్రీన్‌ప్లే అందించి దర్శకత్వం కూడా వహిస్తున్నారు. తన కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా సురేష్ యెర్రా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మేకర్స్ తాజాగా ఈ సినిమా సంగీత ప్రయాణాన్ని ప్రారంభిస్తూ తొలి పాట 'భజ గోవిందం' ఫుల్ వీడియోను విడుదల చేశారు. గతంలో విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు మంచి స్పందన లభించగా... ఈ పాట సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచుతోంది. 'రియాలిటీ' జీవితానికి ఆంథమ్‌లా నిలిచే ఈ పాట, జీవితంలోని చిన్న చిన్న విషయాల్లోనే ఆనందాన్ని వెతుక్కోవాలనే సినిమా ప్రధాన సందేశాన్ని అందంగా ఆవిష్కరిస్తోంది. భీమ్స్ సిసిరోలియో ప్రశాంతమైన, భక్తిభావంతో కూడిన మెలోడీని స్వరపరిచారు. సనారే అందించిన అర్థవంతమైన సాహిత్యం మన దగ్గర ఉన్నదానితో సంతృప్తిగా ఉండటం, మనం చేసే పనిని ప్రేమించడం, స్వయంగా ఎదగడం ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది. జీవితంలోని బాధ్యతల మధ్య మన కోసం మనం కొంత సమయాన్ని కేటాయించుకోవాల్సిన అవసరాన్ని కూడా ఈ పాట గుర్తు చేస్తోంది.

# కీర్తి సురేష్ 'అక్క' ట్రైలర్ అదుర్స్!

ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన క్రైమ్ డ్రామా సిరీస్ 'అక్క' ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నేషనల్ అవార్డు గ్రహీత కీర్తి సురేష్, టాలెంటెడ్ నటి రాధికా ఆప్టే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. వైఆర్‌ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ సిరీస్‌కు ధర్మరాజ్ శెట్టి రచన, దర్శకత్వం వహించారు.పూర్తిగా మహిళల చేతుల్లో సాగే ఒక విభిన్న రాజ్యాన్ని, వారి మధ్య జరిగే పవర్ పాలిటిక్స్‌ను ఈ సిరీస్‌లో ఆవిష్కరించనున్నారు. ఈ నెల 30 నుంచి ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

ట్రైలర్ చూస్తుంటే.. పెన్నూరు అనే కల్పిత రాజ్యంలో గత 800 ఏళ్లుగా కేవలం మహిళలదే పూర్తి ఆధిపత్యం. ఇక్కడ కుటుంబాలు, వ్యాపారాలు అన్నీ మహిళల కంట్రోల్‌లోనే ఉంటాయి.



కుటుంబంలో అత్యున్నత అధికారం చెలాయించే మహిళను 'అక్క' అని పిలుస్తారు. ప్రేమకు, పెళ్లికి సంబంధించి ఈ సమాజం కొన్ని ప్రత్యేకమైన నిబంధనలను పాటిస్తుంది. అయితే రుద్ర (రాధికా ఆప్టే) రాకతో ఈ వ్యవస్థలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుంటాయి. రుద్ర అంచనాలు, ఆమె ఆశయాలు భవాని (కీర్తి సురేష్)తో తీవ్ర ఘర్షణకు దారితీస్తాయి. ఈ ఇద్దరు బలమైన మహిళల మధ్య జరిగే ఆధిపత్య పోరు, వంశాచారాన్ని కాపాడుకునే ప్రయత్నం వంటి అంశాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది.